


epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-10-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 268 పేజీలు: 8+4 వెల: 6.50

డేటా పరిరక్షణ చట్టం ప్రమాదకరం!

తమిళనాట జైలు నుంచి 17 మంది ఖైదీలు పరార్ 5



ఉక్కిరిబిక్కిరి

అర్నబ్ ఎఫెక్ట్‌తో మంగళవారం విశాఖలో ఎగిసిపడుతున్న అలలు

ఉభయగోదావరి జిల్లాలు, కాకినాడ, విశాఖ, శ్రీకాకుళం, యానాంలో అతిభారీ వర్షాలు

నేటి ఉదయం బాపట్ల, విశాఖ మధ్య యానాం సమీపంలో తుఫాన్ తీరం దాటే అవకాశం

150 కి.మీ వేగంతో ప్రచండ గాలులు!

కూలుతున్న వృక్షాలు, ఒరుగుతున్న విద్యుత్ స్తంభాలు.. పలు రైళ్లు, విమానాలు రద్దు



కాకినాడలో కూలిన చెట్లను తొలగిస్తున్న దృశ్యం



విశాఖలో భారీవర్షం

అమరావతి, అక్టోబరు 27,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంపైకి అర్నబ్ తుపాను ప్రభావం కొనసాగుతోంది. మంగళవారం అతి తీవ్ర తుపానుగా మారింది. ఒక రోజంతా అలాగే కొనసాగనుండడంతో నష్టం భారీగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ సమయంలో భారీ గాలులు వీస్తాయని, అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తమయ్యారు. తుపాను ప్రభావిత జిల్లాల్లో విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. అలానే 53 రైళ్లను దక్షిణ కోస్తా రైల్వే రద్దు చేసింది. అర్నబ్ తీరానికి దగ్గరయ్యే కొద్ది తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ఇది అతి తీవ్ర తుపానుగా తీరం దాటనుండడంతో భారీ గాలుల ముప్పుతో పాటు తీర ప్రాంతాల్లో 20 సెంటీమీటర్లకుపైగా వర్షం కురిసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తుపాను ప్రభావంతో కోస్తాంధ్రాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి, ఉత్తరాంధ్రాలోను పలు జిల్లాలో వర్షాలు పడుతున్నాయి.తుపాను గడిచిన 6 గంటల్లో గంటకు 18 కి.మీ. వేగంతో తీరం వైపు దూసుకొస్తోంది. ప్రస్తుతం ఇది కాకినాడకు 140 కి.మీ., విశాఖకు 170 కి.మీ., మచిలీపట్నానికి 230 కి.మీ., బాపట్లకు 300 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. నేటి ఉదయంలోపు బాపట్ల విశాఖ మధ్య యానాం సమీపంలో ఇది తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. తీరం దాటే సమయంలో గంటకు >>2


ఎపిలో అర్నబ్ సెనుతుఫాన్ కల్లోలం

వరంగల్లు, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు



అర్నబ్ తుఫాన్ ఎఫెక్టు: తూర్పు తెలంగాణలో భారీ వర్షాలు 2

365 మండలాల్లో కరవు



111 చోట్ల తీవ్రం, 254 చోట్ల మోస్తరు ప్రభావం

హైదరాబాద్,అక్టోబరు27,ప్రభాతవార్త: తెలంగాణలో కరవు మండలాలను ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో 31 జిల్లాల్లో 365 కరవు ప్రభావిత మండలాలుగా గుర్తించింది. ఇందులో 111 మండలాల్లో తీవ్రమైన, 254 మోస్తరు ప్రభావం ఉన్నట్లు ప్రభుత్వం మంగళవారం సాయంత్రం వెల్లడించింది. కరవు మండలాల్లో సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్లను సర్కార్ ఆదేశించింది. గత ఏడాదితో పోలిస్తే జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు కురవాల్సిన వర్షపాతంలో భారీగా కోత పడింది. ప్రతి మండలంలోని 10శాతం గ్రామాల్లో భూగర్భ జలాలు,పంటల పరిస్థితులను పరిగణలోకి తీసుకన్నారు. ఎల్‌నినో పరిస్థితులు, బంగాళాఖాతంలో అల్పపీడనాలు బలహీనపడటం,సుదీర్ఘకాలం పొడి వాతావరణం, నైరుతి రుతు పవనాల సీజన్‌పై తీవ్ర ప్రభావం చూపినట్లు ప్రభుత్వం తెలిపింది. సాధారణంగా రాష్ట్రంలో 740.6 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 615.5 మి.మీ. మాత్రమే పడింది. అంటే సుమారు 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఎల్‌నినో ప్రభావం, బలహీనపడిన అల్పపీడన వ్యవస్థల కారణంగా దీర్ఘకాలిక వర్షాభావం ఏర్పడి పంటలను దెబ్బతీసింది. ఫలితంగా వరి సాగు విస్తీర్ణం భారీగా తగ్గి, 69.19 లక్షల ఎకరాల నుంచి 57 లక్షల ఎకరాలకు పరిమితమైంది. ఈ కరువు పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. కరువు ప్రభావిత మండలాల్లోని రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించడంతో పాటు, వ్యవసాయ పెట్టుబడి సాయాన్ని డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా, తాగునీరు, పశుగ్రాసం కొరత తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు, ఉపాధి హామీ పథకం కింద అదనంగా మరో 50 రోజుల పని కల్పించాలని ప్రతిపాదించారు. ఇదిలా ఉండగా, కేంద్ర సహాయం కోసం నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ నిధులకై మెమోరాండం సమర్పించనున్నట్లు రేవంత్ సర్కార్ ఇటీవల వెల్లడించింది. క్షేత్రస్థాయిలో కరువు తీవ్రతను అంచనా వేసేందుకు కేంద్ర బృందాన్ని పంపాలని కోరింది. ఈ కరువుకు సంబంధించి విడుదలైన >>2

మొత్తం 31 జిల్లాలు కరవు ప్రభావితం

ప్రకటించిన ప్రభుత్వం

ఎల్‌నినో, కరవు పరిస్థితులపై నేడు అఖిలపక్ష భేటీ

29న ఢిల్లీకి సిఎం రేవంత్‌రెడ్డి

నేడు ఒయు క్యాంపస్‌లో నషా ముక్త్ భారత్ అవగాహన ర్యాలీ

హైదరాబాద్,అక్టోబరు27,ప్రభాతవార్త: బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా యువతలో చైతన్యం తెచ్చేందుకు నషా ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమం, భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ఠాగూర్ ఆడిటోరియం వేదికగా ఉదయం 11.00 గంటలకు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న ఈ భారీ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా హాజరు కానున్నారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంలో ఠాగూర్ ఆడిటోరియంలో నషాముక్త్ భారత్ పోస్టర్లు, స్టిక్కర్లను గవర్నర్ ఆవిష్కరిస్తారు. విద్యార్థులు, యువత చేత మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞను గవర్నర్ చేయిస్తారు. అనంతరం గవర్నర్ ఓయూ విద్యార్థులు, ఎన్ఎస్ వాలంటీర్లు, ఐఆర్‌సీఎస్ సభ్యులు, యువతను ఉద్దేశించి సందేశం ఇస్తారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహణను ప్రారంభిస్తారు, రక్తదాతలకు పండ్లు, ధ్రువపత్రాలను గవర్నర్ పంపిణీ చేస్తారు. చివరగా 1200 మందికి పై >>2



ఇది సర్కార్ కరవు

కాళేశ్వరం పంపులు ఆన్ చేయకుండా పంటలు ఎండబెడుతున్నారు..

కెసిఆర్ మళ్లీ వస్తేనే తెలంగాణ గట్టెక్కుతుంది

నవంబరు 11న నిర్మల్‌లో భారీ సభ: కెటిఆర్

హైదరాబాద్,అక్టోబరు27,ప్రభాతవార్త: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థ పాలన, ప్రభుత్వ నిరక్ష్యం కారణంగానే తెలంగాణలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రకృతి తెచ్చిన కరువు కాదని, రేవంత్ రెడ్డి తన వైఫల్యాలతో ప్రజల నెత్తిన రుద్దిన కరువని మండిపడ్డారు. రాష్ట్రంలో సాగునీటి కొరత, విద్యుత్ సమస్యలు, యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నదుల్లో నీళ్లు పారుతున్నా వాటిని సాగుకు వినియోగించుకోకుండా సముద్రంలోకి వదిలేస్తున్నారని, అందుబాటులో ఉన్న నీటిని రైతులకు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్మల్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వస్తాయా, కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని ఎప్పుడు చేసుకుందామా అనే ఆలోచనలో ప్రజలు ఉన్నారని అన్నారు. చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని, గాడిదను చూస్తేనే గుర్రం విలువ తెలుస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణకు 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీటి సదుపాయాలు అందించామని కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణలో కరువు పరిస్థితులు ప్రకృతి వల్ల మాత్రమే ఏర్పడినవి కావని, నీటి నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణమని కేటీఆర్ ఆరోపించారు. జూన్ 19, 2026న కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించినప్పుడు లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోందని, పంపులు ఆన్ చేసి నీటిని ఎత్తిపోయాలని ప్రభుత్వాన్ని కోరామని గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. కాళేశ్వరం పంపులు ఆన్ చేస్తే ప్రాజెక్టుపై ఇంతకాలం చేసిన ఆరోపణలు తప్పని తేలిపోతాయనే భయంతోనే బటన్ నొక్కడం లేదని ఆరోపించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ మళ్లీ అభివృద్ధి, సంక్షేమ బాటలోకి వస్తుందని అన్నారు. నిర్మల్‌లో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని కేటీఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రామచరణ్ నాయకత్వంలో పార్టీ కార్యక్రమాలను విస్తరించాలని, యువ నాయకులు అనిల్ జాదవ్, జాన్సన్ రాథోడ్ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.నవంబర్ 11న నిర్మల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సభలో మరిన్ని చేరికలు ఉంటాయని వెల్లడించారు.



100 సీట్లు గెలుస్తాం

బిజెపి పని అయిపోయింది..

కెటిఆర్, హరీష్ భ్రమల్లో ఉన్నారు: పిసిసి చీఫ్ మహేష్ గౌడ్

హైదరాబాద్,అక్టోబరు27,ప్రభాతవార్త: బిఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు ఇంకా భ్రమల్లోనే జీవిస్తున్నారని, క్షేత్రస్థాయి వాస్తవాలను వారు గ్రహించడం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. వచ్చేఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుచుకోవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.మేధావి అని చెప్పుకునే కేసీఆర్ ఎలాంటి ఆలోచన లేకుండా అప్పులు చేశారని మహేశ్ గౌడ్ విమర్శించారు. ఎల్ నినో ప్రభావం దేశవ్యాప్తంగా ఉంటే, దాని గురించి హరీశ్ రావు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, 90,000 ఉద్యోగాలు పొందిన ప్రతి లబ్ధిదారుడు కాంగ్రెస్‌కే ఓటు వేస్తారని... క్షేత్రస్థాయిలో తమ పార్టీ బలంగా ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని... దేశంలో ఎక్కడా లేనంతగా తమ పార్టీలో సమన్వయం ఉందని మహేశ్ గౌడ్ తెలిపారు. నవంబర్‌లో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఆ తర్వాత తమ ప్రత్యక్ష లక్ష్యం ఎన్నికలేనని స్పష్టం చేశారు.రాబోయే కాలంలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని, ఆ పార్టీ పని అయిపోయిందని జోస్యం చెప్పారు. ప్రస్తుతం ఉన్న 8 ఎంపీ సీట్లలో రెండు కూడా గెలవడం కష్టమేనని.. మరోవైపు, >>2

కాలుష్యంపై కన్నెర్ర జేసిన జనం

జవహర్‌నగర్ డంపింగ్ కాలుష్యంపై ప్రభుత్వం మేలుకోవాలి: రాంచందర్‌రావు 3

ఈటల జనసంకల్ప పాదయాత్రకు భారీగా మద్దతు

నవంబరు 2న బిజెపి మహా పాదయాత్ర

కేంద్ర హోం మంత్రి అమిత్ షా హాజరు

సర్‌పై కాంగ్రెస్ దుష్ప్రచారానికి నిరసన 2

రూ.30 లక్షల కోట్ల సంపద ఆవిరి!

భారత్ స్టాక్ మార్కెట్లు భారీ పతనం..

అమ్మకాల ఒత్తిడి, ఎఫ్‌పిఐల విత్‌డ్రాలతో దిగజారిన సూచీలు



ముంబయి, అక్టోబరు 27: దలాల్ స్ట్రీట్‌కు ఈ ఏడాది గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. భారత స్టాక్ మార్కెట్లలో భారీగా అమ్మకాల ఒత్తిడి నెలకొనడంతో బీఎస్ఈలో నమోదైన కంపెనీల మార్కెట్ విలువ నుంచి దాదాపు రూ.30 లక్షల కోట్ల సంపద ఆవిరైంది.మార్కెట్లు పడిపోతున్న వేగాన్ని చూస్తుంటే, 2008లో చోటుచేసుకున్న ప్రపంచ ఆర్థిక సంక్షోభం తర్వాత భారత స్టాక్ మార్కెట్లు అత్యంత దారుణమైన వార్షిక పనితీరును నమోదు చేస్తున్నట్లు కనిపిస్తోంది.ఈ ఏడాది ఇప్పటివరకు నిఫ్టీ 50 సూచీ దాదాపు 14 శాతం పతనమైంది. మార్కెట్ గణాంకాల ప్రకారం, గత 18 ఏళ్లలో ఎన్నడూ లేనంత భారీ వార్షిక క్షీణత దిశగా సూచీ సాగుతోంది. గతంలో ప్రపంచ మార్కెట్లతో పోలిస్తే మెరుగైన పనితీరు కనబరిచిన భారత మార్కెట్లలో ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) ఈ ఏడాది >>2

గ్లోబల్ సమ్మిట్‌లో రక్షాఎక్స్‌పో

పాల్గొననున్న 550కి పైగా దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు

దాదాపు 100 ఏరోస్పేస్, రక్షణ రంగ సంస్థలు రాక


29న న్యూఢిల్లీలో కర్టెన్‌రైజర్ కార్యక్రమం

ఏర్పాట్ల పురోగతిపై సిఎస్ సంజయ్ జాజు సమీక్ష



మంగళవారం అధికారులతో సమీక్ష చేస్తున్న సిఎస్ జాజు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు27: రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే డిసెంబర్ 7,8,9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ >>2



ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ఆలయానికి మంగళవారం భారీగా పోటెత్తిన భక్తజనం

100 సీట్లు గెలుస్తాం

>> ఎనిమిది మంది ఎమ్మెల్యేలలో ఒక్కరు కూడా గెలవరని అన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 40 శాతం సీట్లు తమకే వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

మహేశ్‌కుమార్‌గౌడ్ దంపతులను కలిసిన వైఎస్ శర్మిల

టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ దంపతులను ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుమార్తె వివాహానికి హాజరుకావాలని కోరుతూ వారికి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ దంపతులను వివాహ వేడుకకు ఆహ్వానించారు.

365 మండలాల్లో కరవు

>> ఉత్తర్వ్యులు రాబోయే ఆరు నెలల పాటు అమల్లో ఉంటాయని, దీనికి సంబంధించిన జాబితాను జిల్లా గెజిట్లలో ప్రచురించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. కాగా, రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, కరువు పరిస్థితులపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనుంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మధ్యాహ్నం 2.30 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆరో అంతస్తులోని గది నంబర్ 33లో ఈ సమావేశం జరగనుంది. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, వర్షపాతం లోటు నేపథ్యంలో ప్రజలు, రైతులపై పడే ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించనున్నారు. తాగునీటి సరఫరా, నీటి వనరుల పరిరక్షణ, సాగునీటికి విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక వంటి కీలక అంశాలపై రాజకీయ పార్టీల నేతల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించనున్నారు.కరువు నివారణకు అనుసరించాల్సిన వ్యూహాలు, అవసరమైన ముందస్తు చర్యలపై అఖిలపక్ష నేతల అభిప్రాయాలను ప్రభుత్వం తెలుసుకోనుంది. రాష్ట్రంలో కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ప్రభుత్వం కోరనుంది. రాష్ట్రంలో కరువు పరిస్థితులను వివరించి కేంద్ర సహాయాన్ని కోరేందుకు నవంబర్ మొదటి వారంలో అఖిలపక్ష బృందాన్ని సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి తీసుకెళ్లనున్నారు. అక్కడ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఇతర కేంద్ర మంత్రులను కలువనున్నారు. ఈనెల 29న సిఎం ఢిల్లీకి వెళ్లనున్నారు. నవంబర్ 1న ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ ర్యాలీలో పాల్గొంటారు. ర్యాలీ అనంతరం ఆయన అఖిలపక్ష బృందంతో కేంద్ర పెద్దలను కలువనున్నట్లు సమాచారం. కరువు పరిస్థితులపై రేపటి అఖిలపక్ష సమావేశానికి హాజరుకానున్న బిజెపి తెలంగాణ బృందంతెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, తీవ్రమవుతున్న కరువు పరిస్థితులపై ప్రభుత్వం బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించనున్న అఖిలపక్ష సమావేశానికి భారతీయ జనతా పార్టీ పక్షాన ప్రతినిధి బృందం హాజరుకానుంది. బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆదేశాల మేరకు బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, శాసనమండలి సభ్యులు మల్క కొమురయ్య ఈ సమావేశంలో పాల్గొని పార్టీ వైఖరిని స్పష్టంగా వినిపించనున్నారు.రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ఎద్దడి, విద్యుత్ కోతలు, పంట నష్టాలు, తాగునీటి సంక్షోభంపై భారతీయ జనతా పార్టీ చేసిన ఒత్తిడితోనే ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. క్షేత్రస్థాయిలో నెలకొన్న తీవ్ర పరిస్థితుల నేపథ్యంలో.. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా తక్షణమే కరువు మండలాలను అధికారికంగా ప్రకటించి, నష్టపోయిన అన్నదాతలకు తగిన నష్టపరిహారం అందించాలని ప్రజల పక్షాన బిజెపి గళాన్ని బలంగా వినిపించనుంది. రాజకీయాలకు అతీతంగా రైతాంగ సంక్షేమం, ప్రజల తాగునీటి అవసరాల పరిరక్షణే ధ్యేయంగా ఈ భేటీలో ప్రభుత్వం ముందు నిర్మాణాత్మక సలహాలు, సూచనలు, అభిప్రాయాలను బీజేపీ ప్రతినిధి బృందం స్పష్టంగా ఉంచనుంది.

సంపద ఆవిరి!

>> భారత మార్కెట్ల నుంచి దాదాపు 32 బిలియన్ డాలర్లు, అంటే రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ఈ నిధుల ఉపసంహరణ షేర్ల ధరలపై మరింత ఒత్తిడిని పెంచుతోంది. ఐటీసీ, మారుతీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌నిఫ్టీ 50లోని చాలా కంపెనీల షేర్లలో పతనం కనిపిస్తోంది. ఈ సూచీలోని 50 కంపెనీల్లో 38 కంపెనీల షేర్లు ఈ ఏడాది నష్టాల్లో ట్రేడవుతున్నాయి. వీటిలో 25 షేర్లు కనీసం 10 శాతం మేర పడిపోయాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో భారీగా అమ్మకాలు వెల్లువెత్తాయి.నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ ఈ ఏడాది ఇప్పటివరకు దాదాపు 8 శాతం పడిపోయింది. ఇందులో ఆరు శాతం పాయింట్ల పతనం ఒక్క గత వారంలోనే నమోదైంది.మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాల్లోని మరికొన్ని షేర్లు కూడా ఈ ఏడాది 30 నుంచి 40 శాతం మధ్య నష్టపోయి మార్కెట్ పతనంతీరును స్పష్టంచేసాయి. గత వారంలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీల్లోని షేర్లను కలిపి పరిశీలిస్తే, కేవలం ఆరు షేర్లు మాత్రమే లాభాలతో ముగిశాయి. విదేశీ పెట్టుబడిదారులు భారత ఈక్విటీ మార్కెట్లలో తమ పెట్టుబడులను తగ్గించుకుంటుండటంతో మార్కెట్లపై ఒత్తిడి కొనసాగుతోంది. అక్టోబర్ 1 నుంచి 15 మధ్య విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు (ఎఫ్‌పీఐలు) నికరంగా రూ.47,955 కోట్లను స్టాక్ మార్కెట్ నుంచి ఉపసంహరించుకున్నారు.ఈ పరిణామాలపై జియోటస్.కామ్ సీఈఓ విక్రమ్ సుబ్బురాజ్ మాట్లాడుతూ, ఈక్విటీ పెట్టుబడులపై అధిక పన్నులు, కరెన్సీ మార్పిడి ప్రభావాలు, పన్ను బాధ్యతలపై అనిశ్చితి విదేశీ పెట్టుబడిదారులకు సవాళ్లుగా మారుతున్నాయని తెలిపారు. 2024 జూలైలో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో నిర్దిష్ట లిస్టెడ్ ఈక్విటీ పెట్టుబడులపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ) రేటును 10 శాతం నుంచి 12.5 శాతానికి పెంచారు. స్వల్పకాలిక మూలధన లాభాల పన్ను (ఎస్‌టీసీజీ) రేటును 15 శాతం నుంచి 20 శాతానికి పెంచారు. ఈ మార్పుల వల్ల షేర్లను లాభంతో విక్రయించినప్పుడు పెట్టుబడిదారులకు చేతికి వచ్చే మొత్తం తగ్గుతుంది. పన్ను విధించదగిన దీర్ఘకాలిక మూలధన లాభం ప్రతి రూ.100కు, సర్‌చార్జి, సెస్‌లకు ముందు పెట్టుబడిదారుడికి ప్రస్తుతం రూ.87.50 మిగులుతుంది. గతంలో ఈ మొత్తం రూ.90గా ఉండేది. పెట్టుబడి పెట్టిన కాలంలో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడితే, తమ పెట్టుబడులను తిరిగి డాలర్లలోకి మార్చుకునే సమయంలో వారికి వచ్చే రాబడి తగ్గుతుంది.

రాష్ట్రపతి ఆమోదం రాగానే కొత్త సిజె బాధ్యతలు

కోల్‌కతా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తపబ్రత చక్రవర్తిని తెలంగాణ సిజెగా కొలీజియం సిఫారసు

తెలంగాణ తాత్కాలిక సిజె శ్యాం కోశిని ఢిల్లీ సిజెగా సిఫారసు.. గుజరాత్, ఉత్తరఖండ్‌కూ కొత్త సిజెలు

హైదరాబాద్,అక్టోబరు27,ప్రభాతవార్త: తెలంగాణ హైకోర్టుకు కొత్త సీజే రానున్నారు. కలకత్తా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ తపబ్రత చక్రవర్తిని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్య తలు నిర్వర్తిస్తున్న జస్టిస్ శ్యాం కోశిని పదోన్నతిపై ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని ప్రతిపాదించింది.



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో కొలీజియం నాలుగు హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులను నియమించేందుకు పేర్లను ఖరారు చేసింది. తెలంగాణ, ఢిల్లీ హైకోర్టులతోపాటు గుజరాత్, ఉత్తరాఖండ్ హైకోర్టులకు కూడా కొత్త ప్రధాన న్యాయమూ ర్తులను నియమించాలని కొలీజియం నిర్ణయిం చింది. గుజరాత్ హైకోర్టులో ప్రస్తుతం న్యాయ ఎమూర్తిగా సేవలందిస్తున్న జస్టిస్ మానస్ రంజన్ పాఠక్‌ను అదే హైకోర్టుప్రధాన న్యాయ మూర్తిగా నియమించాలని సిఫార్సు చేసింది. పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధీర్ సింగ్‌ను ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా నియమించాలని ప్రతిపాదించింది. ఈ సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదం తెలిపి, అధికారిక నియామక ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత సంబంధిత న్యాయమూర్తులు కొత్త బాధ్యతలు చేపట్టనున్నారు.తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా గతంలో పనిచేసిన జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్ ఈ నెల 6న పదోన్నతిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. దీంతో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానం ఖాళీ అయింది. అప్పటి నుంచి జస్టిస్ శ్యాంకోశీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తు న్నారు. ఈ నేపథ్యంలో ఆ స్థానంలో శాశ్వత ప్రధాన న్యాయమూర్తిని నియమించేందుకు కొలీజియం నిర్ణయంతీసుకుంది. కలకత్తా హైకోర్టులో సీనియారిటీ పరంగా రెండో స్థానంలో ఉన్న జస్టిస్ తపబ్రత చక్రవర్తికి తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు అప్పగించాలని సిఫార్సు చేసింది.

వారం - వర్జ్యం

28-10-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం,
శరదృతువు, కృష్ణపక్షం, స్వాతి కార్తె
తి.తదియ రా.1.07
న.కృత్తిక మ.1.26
వ.రా.3.57-తె.5.24
దు. ఉ.11.28-మ.12.14
రాహు. మ.12.00-మ.1.30
శుభ ఉ.6.30-ఉ.7.30

వార్తాఫలం

మేషం : బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. కీలక విషయాలలో ఆలోచించి ముందుకు వెళ్ళండి.

వృషభం : స్థిరమైన నిర్ణయాలు సరిగ్గా తీసుకోలేరు. ఇంటర్వ్యూలో పాల్గొంటారు. కుటుంబ కలహాలు చికాకు పరుస్తాయి.

మిథునం : స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ది పొందుతారు. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు. ఋణాలు తీరుతాయి.

కర్కాటకం : వృత్తిలో మీరు చేసే స్వయం కృత అపరాధాల వలన నష్టపోతారు. ఆకస్మిక ప్రయాణాలలో పరిచయాలు పెరుగుతాయి.

సింహం : ఖర్చులు పెరుగుతాయి. దానికి సరిపడ ఆదాయ మార్గాలను అన్వేషిస్తారు. సోదరుల నుండి సహాయం అందుతుంది.

కన్య : వీసా, పాస్‌పోర్ట్‌లకు సంబంధించిన విషయాలలో సాంకేతిక లోపాలు ఎదురవుతాయి. ప్రముఖుల కలయిక.

తుల : కీలకవిషయాలలో తొందరపాటు వద్దు. షేర్ల క్రయవిక్రయాలలో ఆశించిన లాభాలు కష్టమే. శుభవార్తలు వింటారు.

వృశ్చికం : విద్య, పారిశ్రామిక రంగాలలోని వారికి కొంతమేరకు ప్రోత్సాహకరంగా వుంటుంది. ఆర్థిక పరిస్థితి బాగుంటుంది.

ధనుస్సు : కార్యాలయంలో మీ గౌరవప్రతిష్ఠలు పెంపొందుతాయి. దైనందిన కార్యకలాపాలలో మార్పులు చోటు చేసుకుంటాయి.

మకరం : వ్యాపారంలో నూతన అంశాలను ప్రవేశ పెట్టి తద్వారా అనుకూల ఫలితాలను సాధిస్తారు. సోదరుల కలయిక.

కుంభం : ఎవరు ఆప్తులో, ఎవరు నిజమైన హితులో తెల్సుకోలేరు. ఉద్యోగంలో పని భారం అధికమవుతుంది.

మీనం : అనాలోచితంగా మీరు పెట్టిన పెట్టుబడులకు కొద్దిపాటి నష్టం వస్తుంది. పట్టుదలతో ముందుకు వెళతారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



అర్నబ్ తుఫాన్ ఎఫెక్టుతో చెన్నై సముద్రం తీరం వద్ద రోడ్డుపైకి ఎగసి పడుతున్న సముద్రపు అలలు

ఉక్కిరిబిక్కిరి

>> 125 నుంచి 135 కి.మీ. వేగంతో, గరిష్ఠంగా 150 కి.మీ. వేగంతో ప్రచండ ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలకు వాతావరణ శాఖ తుపాను హెచ్చరికలు జారీ చేయడంతో పాటు రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఇక మంగళవారం ఉదయానికి అదే ప్రాంతంలో అతి తీవ్ర తుపానుగా బలపడినట్లు వాతావరణశాఖ తెలిపింది. అనంతరం వాయవ్య దిశగా కదులుతూ బుధవారం నాటికి బాపట్లవిశాఖ మధ్య యానాంకు సమీపంలో తీరం దాటే అవకాశం కనిపిస్తోంది. ఆ సమయంలో గాలుల వేగం 115 కి.మీ నుంచి 125 కి.మీ. వరకు ఉండొచ్చు. కొన్నిసార్లు గాలుల వేగం 140 కి.మీ. వరకు పెరిగే అవకాశం ఉంది. ఈ సమయంలో సముద్రంలోని అలలు 1 నుంచి 1.5 మీటర్ల ఎత్తు వరకు ఎగసిపడతాయి. తూర్పుగోదావరి, కాకినాడ, యానాంలోని తీర సమీప ప్రాంతాలను అలలు ముంచెత్తే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అర్నబ్ అతి తీవ్ర తుపానుగా ఎక్కువ సమయం కొనసాగనుండటంతో భారీ నష్టం కలగొచ్చని అధికారులు చెప్తున్నారు. (బుధవారంఉదయం 11.30 గంటల వరకు ఉండనుంది. బుధవారం అర్ధరాత్రి 11.30 సమయంలో తుపానుగా బలహీనపడి 29వ తేదీ నాటికి తీవ్ర వాయుగుండంగా, 30వ తేదీ నాటికి అల్పపీడనంగా బలహీనపడనుంది. గోపాల్‌పూర్‌కు ఆగ్నేయంగా 490 కి.మీ., విశాఖకు తూర్పు ఆగ్నేయంగా 540 కి.మీ., శ్రీ విజయపురానికి వాయవ్యంగా 650 కి.మీ., కాకినాడకు 620, మచిలీపట్నంకు 720, బాపట్లకు 790 కి.మీ. దూరంలో ఉంది.ప్రస్తుత అంచనాల ప్రకారం యానాంకు సమీపంలో తీరం దాటే అవకాశం ఉండగా దట్టమైన మేఘాల వల్ల దిశ మారే అవకాశం లేకపోలేదని నిపుణులు చెబుతున్నారు. అదే జరిగితే నెల్లూరుమచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇది అత్యంత తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని కొన్ని వాతావరణ నమూనాలు హెచ్చరిస్తున్నాయి.

ఉత్తరాంధ్ర,కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు

అర్నబ్ తుపాను ప్రభావం ఉభయ గోదావరి జిల్లాలపై తీవ్రంగా కనిపిస్తోంది. తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా వర్షం కురుస్తోంది. ముఖ్యంగా రాజమహేంద్రవరం, కడియం మండలంలో బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షం పడుతోంది. అటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు దంచికొడుతున్నాయి. అంబాజీపేట, రావులపాలెం, అయినవిల్లి మండలాల్లో ఈదురుగాలులతో కూడిన జోరు వాన కురుస్తోంది. తుపాను ప్రభావంతో కాకినాడ జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం దంచికొడుతోంది. సముద్రం అల్లకల్లోలంగా మారి అలలు భారీగా ఎగిసిపడుతున్నాయి. తాళ్లరేవు వద్ద పరిస్థితులను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్ స్వయంగా పరిశీలించారు. తీరం వెంబడి గంటకు 30 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయి.తుపాను తీవ్రత పెరిగేకొద్దీ సముద్రం ముందుకు చొచ్చుకువచ్చే ప్రమాదం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ముఖ్యంగా కాకినాడ జిల్లా పొలెకుర్రులో 300 మీటర్లు, పొన్నాడలో 200 మీటర్లు, పేరుపాలెంలో 190 మీటర్లు, జి.వేమవరంలో 180 మీటర్ల మేర అలలు ముందుకు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసింది. కాకినాడ జిల్లా తునిలో ఈదురుగాలుల ప్రభావంతో రైల్వేస్టేషన్ వద్ద ఓ భారీ వృక్షం నేలకూలింది. చెట్టు కూలిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఆయన్ని ఆసుపత్రికి తరలించారు. గాలుల ప్రభాతంవో ఓ లాడ్జి అద్దాలు ధ్వంసమయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఏకధాటిగా వర్షం కురుస్తోంది. ఈదురుగాలులు వీస్తున్నాయి. ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు ప్రమాదకరంగా ఉన్న చెట్లు, స్తంభాలను తొలగించారు. జిల్లా వ్యాప్తంగా బలమైన గాలులు వీస్తున్నాయి. చాలాచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొంది. కేంద్రపాలిత యానాం యానాం తీర ప్రాంతంలో తుపాను తీరం దాటుతుందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో స్థానిక ఎమ్మెల్యే మల్లాడి కృష్ణారావు కోనసీమ జిల్లా పరిధిలోని ఐ.పోలవరం మండలం భైరవపాలెం, తీర్థాలమొండి గ్రామాల ప్రజలను కలిశారు. పునరావాస కేంద్రాలకు వెళ్లాలని ప్రజలకు సూచించారు. యానాంలోని 18 పాఠశాలల్ని పునరావాస కేంద్రాలుగా మార్చి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. శ్రీకాకుళం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

గ్లోబల్ సమ్మిట్‌లో రక్షాఎక్స్‌పో

>> సిటీలో గ్లోబల్ సమ్మిట్ 2026ను తెలంగాణ ప్రభుత్వం నిర్వహించనుంది. ఇందులో భాగంగానే ఈ సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం చేస్తోంది. భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7,8,9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ-గ్లోబల్ సమ్మిట్-2026లో పాల్గొనాల్సిందిగా 550కి పైగా దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు సంబంధించి వివిధ కమిటీల ద్వారా చేపడుతున్న ఏర్పాట్ల పురోగతిపై మంగళవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ అధికారులు నవీన్ మిట్టల్, హరిచందన, గౌరవ్ ఉప్పల్, సర్ఫరాజ్ అహ్మద్, కృష్ణ ఆదిత్య, అనుదీప్, శశాంక, కృష్ణ భాస్కర్, వల్లూరి క్రాంతి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడం, భారీ పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త అవకాశాలను సృష్టించడం, యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇన్వెస్ట్ తెలంగాణ-గ్లోబల్ సమ్మిట్-2026ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని తెలిపారు. సమ్మిట్‌కు విస్తృత అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో భాగంగా అక్టోబర్ 29న న్యూఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొంటారని, వివిధ దేశాల రాయబారులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, దిగ్గజ కంపెనీల అధిపతులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులతో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి, తెలంగాణలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి ఈ కార్యక్రమం కీలక వేదికగా నిలవనుందని పేర్కొన్నారు. ఇప్పటికే చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో ఇన్వెస్ట్ తెలంగాణ-గ్లోబల్ సమ్మిట్-2026పై రోడ్‌షోలను నిర్వహించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో జరగనున్న ప్రధాన సమ్మిట్‌కు 1,500కు పైగా కంపెనీలు, సంస్థల ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా నిర్వహించనున్న రక్షా ఎక్స్ పోలో పాల్గొనేందుకు ప్రపంచవ్యాప్తంగా ఏరోస్పేస్, రక్షణ రంగాలకు చెందిన సుమారు 100 కంపెనీలు, సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి తెలిపారు. సమ్మిట్‌కు హాజరయ్యే దేశీయ, అంతర్జాతీయ ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా, వసతి, సమావేశాల నిర్వహణతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ప్రతినిధికి సమన్వయ బాధ్యతలు నిర్వహించేందుకు ఒక సీనియర్ అధికారిని నోడల్ అధికారిగా నియమించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు,ఇన్వెస్ట్ తెలంగాణా-గ్లోబల్ సమ్మిట్-2026ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమ న్వయంతో పనిచేస్తూ,ఏర్పాట్లను నిర్ణీతగడువులోగా పూర్తి చేయాలని ప్రధాన కార్యదర్శి అధికారులకు సూచించారు.

నవంబర్ 2న బిజెపి మహా పాదయాత్ర

కేంద్ర హోం మంత్రి అమిత్ షా హాజరు: ఎన్.రాంచందర్‌రావు

హైదరాబాద్,అక్టోబరు27,ప్రభాతవార్త: దేశ సమగ్రతను, శాంతిభద్రతలను కాపాడే చట్టాలపై కాంగ్రెస్, ఇండీ కూటమి పక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొడుతూ భారతీయ జనతా పార్టీ సమరశంఖం పూరించిందని రాష్ట్ర బిజెపి ప్రకటించింది. రాజకీయ లబ్ధి కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ సమాజంలో అశాంతిని రేకెత్తిస్తున్న కాంగ్రెస్ వైఖరికి నిరసనగా.. "ప్రజాస్వామ్యాన్ని రక్షి ద్దాం! అరాచకవాదాన్ని అంతం చేద్దాం!!" అనే నినాదంతో నవంబర్ 2వ తేదీ(సోమవారం)న సాయంత్రం 4:00 గంటలకు హైదరాబాద్‌లో భారీ మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొంది. బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన ట్యాంక్‌బండ్‌పై స్వామి వివేకానంద విగ్రహం వద్ద ప్రారంభమయ్యే ఈ పాదయాత్ర డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగనుంది. ఈ మహా పాదయాత్రకు కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేయనున్నారు. అదేవిధంగా ఈ యాత్రలో కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బిజెఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, శాసనమండలి పక్షనేత ఏవీఎన్ రెడ్డి, మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, మహబూబ్‌నగర్ ఎంపీ, బిజెపి తమిళనాడు కో ఇంచార్జ్ డీకే అరుణ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కర్ణాటక రాష్ట్ర కోఇంచార్జ్ డా.కాసం వెంకటేశ్వర్లు, బిజెపి ఎమ్మెల్యేలు, తదితర నాయకులు పాల్గొననున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, దేశ వ్యతిరేక శక్తుల ఆట కట్టించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, జాతీయవాదులు మరియు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి ఈ మహా పాదయాత్రను విజయవంతం చేయాలని బిజెపి పిలుపునిస్తోందని రాంచందర్‌రావు పేర్కొన్నారు.

'శీతాకాలం వచ్చినా భారీగా విద్యుత్ బిల్లులు'

హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త: వర్షాకాలం ముగిసి శీతాకాలం వచ్చినా విద్యుత్ వినియోగం వేసవిని మించి నమోదవుతోంది. వర్షాభావ పరిస్థితులు, సాధారణం కంటే మించి అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో తెలంగాణ వ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరిగింది. గృహోపకరణాలు ఎక్కువసేపు పనిచేస్తుండటంతో విద్యుత్ వినియోగదారులు భారీ బిల్లులను ఎదుర్కొంటున్నారు. సాధారణంగా, వర్షాకాలంలో ఎయిర్ కండిషనర్లు, కూలర్ల వాడకం తగ్గి, గృహాలకు కొంత ఉపశమనం కలుగుతుంది. అయితే, ఈ సంవత్సరం భిన్నంగా ఉంది. పగటిపూట అధిక ఉష్ణోగ్రతలు, రాత్రిపూట తేమ కారణంగా అత్యధిక కుటుంబాలు ఎయిర్ కండిషనర్లు, కూలర్లు, ఫ్యాన్లను వాడటం కొనసాగించాల్సి వస్తోంది. వేసవి కాలంలోనే కాకుండా, వర్షాకాలం అంతటా, అక్టోబర్‌లో కూడా విద్యుత్ బిల్లులు అధికంగానే ఉన్నాయని వినియోగదారులు గగ్గోలు పెడుతూన్నరు. రాష్ట్రంలోని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని వరంగల్ జిల్లా విద్యుత్ బిల్లింగ్ గణాంకాలు ఈ ఏడాది గణనీయమైన పెరుగుదలను సూచిస్తున్నాయి. జనవరిలో రూ.177.41 కోట్లుగా ఉన్న మొత్తం బిల్లింగ్, సెప్టెంబర్‌లో రూ.367.13 కోట్లకు పెరిగి, ఈ నెలలో 313.36 కోట్లకు తగ్గింది. గత ఏడాది ఇదే నెలలతో పోలిస్తే, సెప్టెంబర్‌లో బిల్లింగ్ రూ.130.03 కోట్లు, అక్టోబర్‌లో రూ.111.98 కోట్లు పెరిగింది. అయితే, మొత్తం బిల్లింగ్‌లో పెరుగుదలను కేవలం గృహ వినియోగానికి మాత్రమే కాకుండా వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగం కూడా ఉందని విద్యుత్ శాఖ ప్రభావితం చేసి ఉండవచ్చు. గృహ విద్యుత్ వినియోగం కూడా పెరిగింది.

తెలంగాణలో భారీ వర్షపాతం

హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త: అర్నాబ్ తుపాను ప్రభావం తెలంగాణపై తీవ్రంగా చూపనుంది. ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ నెల 28వ తేదీ బుధవారం ఉదయం అర్నబ్ తుఫాను కోస్టల్ ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటనుంది. ఈ నేపథ్యంలో, ఈ నెల 28న తూర్పు తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. 28వ తేదీన రాష్ట్రంలో ప్రధానంగా ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో 100-120 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే వీలుందని హెచ్చరించింది. అంతేకాకుండా ఈ జిల్లాల్లో గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. అలాగే రాష్ట్రంలోని వరంగల్, కరీంనగర్‌తో సహా ఇతర జిల్లాల్లో 30 మిల్లీమీటర్ల వరకు మోస్తరు వర్షపాతం నమోదయ్యే వీలున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ జిల్లాల్లో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. అలాగే హైదరాబాద్, నిజామాబాద్, మహబూబ్ నగర్ సహా సంగారెడ్డి, వికారాబాద్, మల్కాజిగిరి, రంగారెడ్డి, నారాయణపేట, గద్వాల్‌లో 15 మి.మీ కంటే తక్కువ వర్షం కురుస్తుందని, దీనికి తోడు గంటకు 35 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. ఈ నెల 27 రాత్రి నుండి 28 తేదీలలో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్‌తో సహా తెలంగాణ వ్యాప్తంగా 29న వర్షపాతం తగ్గుముఖం పట్టి, తదుపరి 30వ తేదీ తర్వాత మళ్లీ పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

నేడు ఒయు క్యాంపస్‌లో నషా ముక్త్ భారత్ అవగాహన ర్యాలీ

>> ఓయూ విద్యార్థులు, ఎన్ఎస్ వాలంటీర్లు, ఐఆర్‌సీఎస్ సభ్యులు ఠాగూర్ ఆడిటోరియం నుండి ఆర్ట్స్ కాలేజీ వరకూ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా యువతలో చైతన్యం తెచ్చేందుకు చేపట్టే నషా ముక్త్ భారత్ భారీ ర్యాలీనీ ఠాగూర్ ఆడిటోరియం ముందు గవర్నర్ జెండా ఊపి ప్రారంభిస్తారు. ఉస్మానియా వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఐఆర్‌సీఎస్ రాష్ట్ర శాఖ ఛైర్మన్ ఎం.దానకిశోర్‌లు కార్యక్రమంలో పాలుపంచుకుంటారు. ఠాగూర్ ఆడిటోరియం వేదికగా ఉదయం నషా ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమం, భారీ ర్యాలీ జరగనున్న సమయంలోనే తెలంగాణ వ్యాప్తంగా 33 జిల్లాల్లో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ పై అవగాహన, చైతన్య కార్యక్రమాలు, ర్యాలీలు, పోస్టర్లు, స్టిక్కర్ల ఆవిష్కరణలు, మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞలు ఏకకాలంలో జరగనున్నాయి. విద్యార్థుల్లో దేశభక్తి, నైతిక విలువలు, దేశం పట్ల బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలనే స్ఫూర్తిని పెంపొందించే లక్ష ్యంతో రూపొందించినొపంచ పరివర్తన్ పుస్తకాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా బుధవారం ఆవిష్కరించనున్నారు. లోక్ భవన్ రోడ్‌లోని సంస్కృతి కమ్యూనిటీ భవన్‌లో నైతిక, సాంస్కృతిక శిక్షణ కోసం ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. కుటుంబ విలువలు, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమరసత, స్వదేశీ భావన, పౌర విలువలు అనే ఐదు ప్రధాన అంశాలతో ఈ పుస్తకాన్ని రూపొందించారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, ఐఎన్‌సీటీఎఫ్ జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుణవంత్ సింగ్ కొఠారి, ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, ఐఎన్‌సీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రామ్మూర్తితో పాటు ఇతర సభ్యులు పాల్గొననున్నారు. నగరంలోని సుమారు 300 పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

అర్నబ్ తుఫాన్ ప్రభావంతో విమాన సర్వీసులు రద్దు

గన్నవరం (కృష్ణా), అక్టోబరు 27, ప్రభాతవార్త : తుఫాన్ ప్రభావంతో అతిభారీ వర్షాలు, పెనుగాలులు వీచే అవకాశం ఉందన్న ఐయండి హెచ్చరికల నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి రాకపోకలు సాగించే పలు విమానసర్వీసులు రద్దయ్యాయి. మంగళవారం రాత్రి చెన్నై-విజయవాడ ఇండిగో విమానం, బెంగుళూరు- విజయవాడ విమానసర్వీసు, కడప-విజయవాడ-హైదరబాద్ విమానసర్వీసు, ఎయిరిండియా విమానసర్వీసులు హైదరాబాద్ -విజయవాడ, విజయవాడ-వైజాగ్, చెన్నై-విజయవాడ, బెంగుళూరు- విజయవాడ సర్వీసులు తుఫాన్ కారణంగా రద్దయ్యాయి. బుధవారం పలు సర్వీసులను రద్దుచేసారు. వీటిలో హైదరాబాద్-విజయవాడ మధ్య తిరిగే ఫ్లై91 ఎయిర్‌లైన్స్, ఎయిరిండియా న్యూఢిల్లీ-విజయవాడ విమానసర్వీసు, విజయవాడ విమానాశ్రయం నుండి రాకపోకలు సాగించే ఇండిగో అన్ని సర్వీసులు రద్దుచేసినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. బుధవారం 20విమానసర్వీసులు రద్దుఅయ్యాయి.

అర్నబ్ తుఫాన్ ప్రభావం

పది ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు



హైదరాబాద్ (తార్నాక), అక్టోబరు 27, ప్రభాతవార్త : అర్నాబ్ తుఫాన్ ప్రభావం తో రైల్వే రవాణాకు అంతరాయం ఏర్పడింది. తీర ప్రాంతాల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ రైల్వే అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, లింగంపల్లి, చర్లపల్లి స్టేషన్ల నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే పది ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. దీంతో ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు, ప్రచండ గాలులు వీచే అవకాశం ఉండటంతో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైళ్ల రాకపోకలు కొనసాగిస్తే పట్టాలు దెబ్బతినడం, విద్యుత్ తీగలు తెగిపడటం, చెట్లు విరిగి రైల్వే మార్గాలపై పడటం వంటి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పలు రైళ్ల సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. రద్దయిన రైళ్లలో సికింద్రాబాద్ నుంచి హౌరా వెళ్లే ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12704), సికింద్రాబాద్ నుంచి భువనేశ్వర్ వెళ్లే విశాఖ ఎక్స్‌ప్రెస్ (17016), హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728), మహబూబ్‌నగర్ నుంచి విశాఖపట్నం వెళ్లే ఎక్స్‌ప్రెస్ (12862), సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ (12740) ఉన్నాయి. అలాగే లింగంపల్లి నుంచి కాకినాడ టౌన్ వెళ్లే కోకనాడ ఎక్స్‌ప్రెస్ (12776), లింగంపల్లి నుంచి నర్సాపూర్ వెళ్లే నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ (17256), లింగంపల్లి నుంచి కాకినాడ పోర్ట్ వెళ్లే గౌతమి ఎక్స్‌ప్రెస్ (12738), నాందేడ్ నుంచి సంబల్పూర్ వెళ్లే నాగావళి ఎక్స్‌ప్రెస్ (20810), చర్లపల్లి నుంచి శ్రీకాకుళం రోడ్ వెళ్లే ప్రత్యేక రైలు (07037) సేవలను సైతం రద్దు చేశారు. టికెట్ డబ్బులు వాపసురైళ్ల రద్దయిన విషయాన్ని గమనించకుండా స్టేషన్లకు చేరుకుని ఇబ్బందులు పడవద్దని రైల్వే అధికారులు ప్రయాణికులకు సూచించారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్న వారికి నిబంధనల ప్రకారం రిఫండ్ అందుతుందని, రైల్వే కౌంటర్లలో టికెట్లు తీసుకున్న వారు సంబంధిత పీఆర్ఎస్ కౌంటర్ల ద్వారా డబ్బులు వాపసు పొందవచ్చని తెలిపారు. తుఫాన్ ప్రభావం నేపథ్యంలో ప్రయాణికులు రైళ్ల రాకపోకలకు సంబంధించిన తాజా సమాచారాన్ని ముందుగానే తెలుసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించే వరకు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కోరుతున్నారు.

ఫార్ములా ఇ కార్‌రేస్ కేసులో కెటిఆర్‌కు ఊరట

పాస్‌పోర్టు కార్యాలయం ఇచ్చిన నోటీసులపై హైకోర్టు స్టేటస్‌కో

హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త: ఫార్ములా ఇ కార్‌రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఎసిబి దాఖలు చేసిన ఛార్జిషీట్ల నేపథ్యంలో కెటిఆర్ పాస్‌పోర్టును జప్తు చేయాలని సర్కారు నుంచి అందిన వినతి మేరకు కెటిఆర్‌కు హైదరాబాద్ పాస్‌పోర్టు కార్యాల యం ఇచ్చిన నోటీసులపై హైకోర్టు మంగళవారం స్టేటస్ కో ఇచ్చింది. తన పాస్‌పోర్టు జప్తు చేసే విషయమై హైదరాబాద్ పాస్‌పోర్టు కార్యాలయ ం ఇచ్చిన నోటీసులను కెటిఆర్ హైకోర్టులో సవాల్ చేయగా దానిపై మంగళవారం నాడు విచారణ జరిగింది. కెటిఆర్ తరపు న్యాయవాదులు, సర్కారు న్యాయవాదుల మధ్య వాదనలు జరిగాయి. చివరకు హైదరాబాద్ పాస్‌పోర్టు కార్యాలయం ఇచ్చిన నోటీసులపై స్టేటస్ కో ఇస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పాటు ఈ కేసులో ప్రతివాదులందరికి హైకోర్టు నోటీసులు ఇచ్చింది. దీనిపై తదుపరి విచారణను నవంబరు ఆరవ తేదీకి వాయిదా వేసింది.

ఎసిబి ఆధ్వర్యంలో ఘనంగా అవినీతి వ్యతిరేక కార్యక్రమాలు

హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త: దేశవ్యాప్తంగా విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ఘనంగా కొనసాగుతుండగా తెలంగాణలోనూ స ర్కారీ విభాగాలు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. మంగళవారం నాడు ఎసిబి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో అవినీతి వ్యతిరేక కార్యక్రమాలు జరిగాయి. హైదరాబాద్ సహా అన్ని జిల్లాలలో ఈ కార్యక్రమాలను అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా "సత్యనిష్ఠతోనే అభివృద్ధి" అనే నినాదంతో పాటు అవినీతిని రూపుమాపేందుకు అందరు శపథం చేశారు. ప్రభుత్వ పాలనలో నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడం కోసం అందరు కృషి చేస్తామని వారు ప్రతిజ్ఞ చేశారు. ప్రజల్లో అవినీతిపై వ్యతిరేకతను పెంచడానికి అవగా హన కార్యక్రమాలు, సైకిల్ ర్యాలీలు చేబట్టారు. లంచం డిమాండ్ చేసినా లేదా అవినీతికి సంబంధించిన సమాచారం ఉన్నా పౌరులు ఎసిబి టోల్ ఫ్రీ నంబర్ 1064కు లేదా అధికారులకు ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా వాల్ పోస్టర్ల ద్వారా ప్రచారం చేశారు.

పెనుతుఫానుగా అర్నబ్

ప్రభావిత రాష్ట్రాల్లో 31 ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు

పరిస్థితిపై వ్యూహం ఖరారు

జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం డిఐజి షహేది

హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నాబ్ తుఫాను అతి తీవ్రమైన తుఫానుగా బలపడిందని జాతీ య విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్) డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డిఐజి) మోహ్సెన్ షహేది తెలిపారు. అర్నబ్ తుఫాను ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న రాష్ట్రాల్లో 31 ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను మోహా రించినట్లు వెల్లడించారు. ఢిల్లీలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ తుపాను పరిస్థితికి సంబంధించి ఒక వ్యూహాన్ని ఖరారు చేశామన్నారు. జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్‌డిఎంఎ) ఆధ్వర్యంలో క్యాబినెట్ సెక్రటరీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వ్యూహాన్ని ఖరారు చేయడం జరిగిందని చెప్పారు. దీని ప్రకారం ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, యానాం కేంద్రపాలిత ప్రాంతం, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌తో సహ ప్రభావి తమయ్యే అవకాశం ఉన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను మోహరించినట్లు వివరించారు. మొత్తం 31 ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను ఆయా రాష్ట్రాలు కోరగా, వాటిని యుద్ధప్రాతిపదికన మోహరించినట్లు తెలిపారు. కాగా అర్నాబ్ తుఫాను ఈ నెల 28 నాటికి యానాం సమీపంలో ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. గాలులు పెరిగిన తర్వాత ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, అధికారులు కోరితే సమీపంలోని తుఫాను ఆశ్రయానికి వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఇక సముద్రం చాలా అల్లకల్లోలంగా నుంచి అసాధారణంగా ఉంటుందని, తుఫాను తీరాన్ని తాకే సమయంలో 1.0 నుంచి 2.0 మీటర్ల ఎత్తున అలలు ఎగిసిపడతాయని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. కాకినాడ, యానాం సమీపంలో ఇది అత్యధికంగా ఉంటుందని దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్‌లోని 20 జిల్లాల్లో అధికారులు 2,131 తుఫాను ఆశ్రయాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. 18 జిల్లాల్లోని సుమారు 2.07 కోట్ల మంది చందాదారులకు మొబైల్ హెచ్చరికలు చేరగా, తీరప్రాంతంలోని 6.9 లక్షల మంది చందాదారులకు అలల ఉధృతి హెచ్చరికలు జారీ చేశారన్నారు. ఆ రాష్ట్రంలోని 14 జిల్లాల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్ నుండి 12 బృందాలు, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్) నుండి 10 బృందాలను మోహరించగా, ఒక్కో జిల్లా నుండి ఒక బృందాన్ని రిజర్వ్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 29 వరకు సముద్రంలోకి వెళ్లవద్దని అధికారులు మత్స్యకారులను కోరారు. మొత్తం 30,043 మత్స్య పడవలు ఒడ్డుకు తిరిగి వచ్చాయని అధికారులు తెలిపారు. ఓడరేవులలో హెచ్చరిక సంకేతాలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్, యానాంతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ తదితర రాష్ట్రాలు కూడా ఈ తుఫాను వల్ల ప్రభావితం కానున్నాయని వెల్లడించారు.

కాలుష్యంపై కన్నెర్ర జేసిన జనం

జవహర్‌నగర్ డంపింగ్ కాలుష్యంపై ప్రభుత్వం మేలుకోవాలి : బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు

ఎంపి ఈటల జనసంకల్ప పాదయాత్రకు భారీగా మద్దతు

ఘట్‌కేసర్, అక్టోబరు 27, ప్రభాతవార్త: జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుపై క్యాపింగ్ నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగా కాలుష్యం పెరిగిపోయి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని బిజెపి రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లో మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ జవహర్‌నగర్ డంపింగ్ యార్డు తొలగించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన జవహర్‌నగర్ జన సంకల్ప పాదయాత్రలో రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా చెరువును పరిశీలించి మత్స్యకారులు, రైతులు, బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ కాలుష్యం వల్ల ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు విషతుల్యంగా మారడమే కాకుండా నగరమంతా దుర్వాసన వ్యాపించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఎంపి ఈటల రాజేందర్ నాయకత్వంలో ఈ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేకపోవడంతో ఇక దీనిని ఒక ప్రజాఉద్యమంగా మార్చాల్సిన సమయం ఆసన్నమైనదని ఆయన తెలిపారు. డంపింగ్‌యార్డుపై గతంలోనే కొంపల్లి మోహన్‌రెడ్డి ఎన్‌జిటిలో కేసు వేసి కాలుష్య నివారణకు ప్రయత్నించారని గుర్తు చేశారు. ఈటల పాదయాత్ర ద్వారా ప్రభుత్వం నిద్ర మేలుకొని ప్రజల ఆరోగాన్ని దష్టిలో పెట్టుకొని డంపింగ్‌యార్డుకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు. మన హక్కుల సాధన కోసం నవంబర్ 2వ తేదీన ట్యాంక్‌బండ్‌పై జరిగే పాదయాత్రలో కేంద్రమంత్రి అమిత్‌షా పాల్గొంటారని, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులందరూ విధిగా తమ ఓటును నమోదు చేసుకొని ఈపోరాటంలో భాగస్వా ములు కావాలని రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా జెఎసి ఏర్పాటు చేసుకుని పోరాటం చేస్తున్నారని తెలిపారు. డంపింగ్ యార్డ్‌కి వ్యతిరేకంగా, నిబంధనలు పాటించాలని సుప్రీంకోర్టు లక్ష రూపాయల ఫైన్ కూడా వేసిందని, తన కంటే ముందు ఇక్కడ రేవంత్‌రెడ్డి ఎంపీగా పని చేశారని కోట్లాడే బిడ్డకు ఓటు వేయాలని ప్రశ్నించే గొంతుకు ఓటు వేయాలని చెప్పి ఇక్కడి ప్రజలు గెలిపించారని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతు ముఖ్యమంత్రి అయ్యాడు కాబట్టి సమస్య పరిష్కారం అవుతుం దని భావించామని కానీ రెండేళ్లయిన ఎలాంటి స్పందన లేదని జవహర్‌నగర్ కమిటీలో భారతీయ జనతాపార్టీ ఎంపీగా ఉండి కూడా జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుపై పార్లమెంటులో ప్రశ్నించానని, సమస్యలు సంపూర్ణంగా అర్థమై వాటి పరిష్కారం కోసం మేము ఈపాదయాత్ర చేస్తున్నామని ఎంపీ రాజేందర్ స్పష్టం చేశారు.



పాదయాత్రలో బిజెపి రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, ఎంపి ఈటల రాజేందర్ తదితరులు



శబరిమల యాత్ర వర్చువల్ క్యూ బుకింగ్ రేపటి నుంచి

రోజుకు 80,000 మంది భక్తులకు అనుమతి

మూడు మార్గాల ద్వారా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి

పతనంతిట్ట, అక్టోబరు 27: అయ్యప్ప భక్తులకు శుభవార్త. 2026-27 శబరిమల మండలమకరవిళక్కు యాత్ర సీజన్‌కు సంబంధించి వర్చువల్ క్యూ బుకింగ్ అక్టోబరు 29, గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది. ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టిడిబి) సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. వర్చువల్ క్యూ, స్పాట్ బుకింగ్ ద్వారా రోజుకు గరిష్టంగా 80,000 మంది భక్తులను మాత్రమే అనుమతిస్తారు. భక్తులు అధికారిక వెబ్‌సైట్ 'ఎస్ఎబిఎఆర్ఐఎంఎఎల్ఎ ఒఎన్ఎల్ఐ ఎన్ఇ.ఒఆర్‌జి' ద్వారా తమ దర్శన స్లాట్‌లను బుక్ చేసుకోవచ్చు. వర్చువల్ క్యూ బుకింగ్ పూర్తిగా ఉచితం. నిలక్కల్‌పంబ మార్గంలో అత్యధికంగా రోజుకు 60,000 ఆన్‌లైన్ బుకింగ్ స్లాట్లు అందుబాటులో ఉంటాయి. ఎరుమేలి అటవీ మార్గం, వండిపెరియార్ సత్రం మార్గాలకు కూడా ఆన్‌లైన్ బుకింగ్ సౌకర్యం కల్పించబడింది. ఈ మార్గాల్లో ఒక్కొక్కదానికి రోజుకు 3,000 మంది భక్తుల చొప్పున అనుమతి ఉంటుంది. అదనంగా, నిలక్కల్, ఎరుమేలి, వండిపెరియార్‌లలో 'స్పాట్ బుకింగ్' (నేరుగా వచ్చి బుక్ చేసుకునే) కేంద్రాలు కూడా పనిచేస్తాయి. నిలక్కల్ స్పాట్ బుకింగ్ కేంద్రం ద్వారా రోజుకు 10,000 మంది భక్తులు, అలాగే ఎరుమేలి, వండిపెరియార్‌సత్రం కేంద్రాల ద్వారా రోజుకు 2,000 మంది చొప్పున భక్తులు దర్శనానికి అనుమతి పొందవచ్చు. పంబలో ఉన్న స్పాట్ బుకింగ్ కేంద్రాన్ని కేరళ హైకోర్టు నిలిపివేసింది. ఈ ఏర్పాట్ల ద్వారా, మూడు ఆన్‌లైన్ మార్గాలు, మూడు స్పాట్ బుకింగ్ కేంద్రాలను కలిపి మొత్తం రోజుకు 80,000 స్లాట్లు అందుబాటులో ఉంటాయి. (ప్రతి కేంద్రానికి నిర్ణయించిన పరిమితులకు లోబడి). వర్చువల్ క్యూ బుకింగ్ పూర్తిగా ఉచితమని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు స్పష్టం చేసింది. యాత్ర సమయంలో స్పాట్ బుకింగ్ సౌకర్యాలు చాలా పరిమితంగా ఉంటాయని అధికారులు తెలిపారు.

రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో

అఖిల భారత పోలీసు టి.20 క్రికెట్ టోర్నమెంట్

డిసెంబరు 10 నుంచి 21 వరకు హైదరాబాద్‌లో నిర్వహణ

హైదరాబాద్, అక్టోబరు 27: రాష్ట్ర పోలీసు శాఖ అఖిల భారత పోలీసు టి.20 (పురుషులు) టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. వచ్చే డిసెంబరు నెల 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఎనిమిది మైదానాల్లో ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ టోర్నమెం ట్ అఖిల భారత పోలీసు టి.20 టోర్నమెంట్ మూడవది కావడం గమనార్హం. ఈ టోర్నమెంట్‌లో దేశంలోని అన్ని రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన మొత్తం 35 జట్లు పాల్గొననున్నాయి. కాగా ఈ టోర్నమెంట్ నిర్వహణపై మంగళవారం డిజిపి సి.వి.ఆనంద్ తన కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమీక్షి ంచారు. ప్రతిష్ఠాత్మకమైన జాతీయస్థాయి పోలీసు క్రికెట్ టోర్నమెంట్‌కు తెలంగాణ ఆతిథ్య ం ఇవ్వడం సంతోషకరమని డిజిపి ఈ సందర్భంగా పేర్కొన్నారు. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. టీ20 ఫార్మాట్‌లో జరిగే ఈ పోటీల్లో ప్రతి మ్యాచ్ 20 ఓవర్ల పాటు సాగనుందని ఆయన తెలిపారు. క్రీడాకారుల రవాణా, భోజన వసతి, మైదానాల నిర్వహణ, భద్రత, మ్యాచ్‌ల సమన్వయం తదితర అంశాలపై డిజిపి ఉన్నతాధికారులతో చర్చించి తగిన సూచనలు చేశారు. ప్రతి విభాగం సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. పలు కమిటీలకు బాధ్యతలు టోర్నమెంట్ నిర్వహణ కోసం అడ్మినిస్ట్రేషన్, రవాణా, మీడియా ప్రచారం, భద్రత, సాంకేతిక, మ్యాచ్‌ల సమన్వయం, ఆర్థిక వ్యవహారాల కమిటీలను ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించారు. జాతీయస్థాయి పోటీలకు హైదరాబాద్ వేదిక కానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను సకాల ంలో పూర్తి చేసి టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని డిజిపి అధికారులకు దిశానిర్దేశం చేశారు. కాగా ఈ టోర్నమెంట్ కోసం ఎనిమిది మై దానాలను ఎంపిక చేశారు. ఇందులో ఆరు మైదానాలు రెగ్యులర్‌వి కాగా మరో రెండు రిజర్వ్‌గా ఎంపిక చేశారు. మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో గల క్రికెట్ క్రికెట్ మైదానాలను ఎంపిక చేసినట్లు కమిటీ సభ్యులు డిజిపి ఆనంద్‌కు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే పోలీసు క్రీడా కారుల వసతి కోసం హిమాయత్‌సాగర్‌లోని తెలంగాణ పోలీసు అకాడమీలో ఏర్పాట్లు చేయనున్నారు. ఏడాది క్రితం తెలంగాణ పోలీసు విభాగ ం అఖిల భారత పోలీసు ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించడం తెలిసిందే.

తెలంగాణ ప్రభుత్వం
నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, గద్వాల్-509 125

క్ర.సం.1. టెండర్ నెం మరియు తేదీ: 21/SE/IC/Gdl/2026-27, తేదీ: 22.10.2026,(నాలుగవ పిలుపు). పనిపేరు: పీజేపీ-జోగులాంబ గద్వాల్ జిల్లాలోని ధరూర్ మండలం, రేవులపల్లి గ్రామంలోని PJP ఆనకట్ట ఎడమ మరియు కుడి ఫ్లైపుల ఉన్న ఎలివేటెడ్ టవర్లలో పాత లిఫ్టుల పునరుద్ధరణ మరియు వాటి స్థానంలో కొత్త లిఫ్టుల ఏర్పాటు చేయుటకు సంబంధించిన పని. పని విలువ రూ.లక్షల్లో : రూ.55.87. టెండర్ డాక్యుమెంట్ లభించు తేదీ: 28.10.2026 ఉ.11.00 గంటల నుండి 11.11.2026 మ.03.00 గంటల వరకు. టెండర్ స్వీకరించు తేదీ: 28.10.2026 ఉ.11.00 గంటల నుండి 11.11.2026 సా.05.00 గంటల వరకు. సంబంధిత పర్యవేక్షక ఇంజనీర్ వారి చిరునామా: పర్యవేక్షక ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, గద్వాల్. మిగతా వివరములకు తెలంగాణ రాష్ట్ర 'ఇ'ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ "https://tender.telangana.gov.in//నందు చూడగలరు.
సం/-. పర్యవేక్షక ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, గద్వాల్-509125.
DIPR.NO. 12558-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 27.10.2026


చైనీస్ ఇ-సిగరెట్ల దుకాణంపై ఈగల్ దాడులు

ఇద్దరు కేరళ వాసుల అరెస్టు

రూ.10 కోట్ల ఇ-సిగరెట్ల వ్యాపార లింకులు రట్టు

ఆన్‌లైన్‌లో ఆర్డర్ సేకరణ, ర్యాపిడోతో హోండెలివరీ

హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త: టీనేజర్లను, యువతకు ధూమపానం ముసుగులో నికోటిన్ సహా ప్రమాదకర రసాయనాలతో నింపివున్న చైనీస్ ఈ సిగరెట్లు విక్రయిస్తూ వారి జీవితాలను నాశనం చేస్తున్న ఈ సిగరెట్ల దుకాణాలపై ఈగల్ పోలీసులు మరోసారి దాడులు నిర్వహించారు. సైనిక్‌పూరిలో ది స్మోక్ పేరిట రహస్యంగా కొనసాగుతున్న ఈ సిగరెట్ల అడ్డాపై ఈగల్ అధికారులు స్థానిక పోలీసులతో కలిపి దాడు లు నిర్వహించగా కేరళ కు చెందిన ఇద్దరు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా 39 ఈ సిగరెట్లను జప్తు చేయగా పది కోట్ల రూపాయల వ్యాపార లి ంకులను రట్టు చేశారు. కేరళకు చెందిన ఉబయ్స్ (20) అనే వ్యక్తి సైనిక్‌పూరిలో గత ఆగస్టు నెల నుంచి ఈ సిగరెట్ల దుకాణం నిర్వహిస్తున్నా డు. నెలకు 50 వేల రూపా యల అద్దె చెల్లిస్తూ ఉబయ్స్ ఈ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఇతను తన సహాయకుడిగా కేరళకు చెందిన ఉస్సే నర్ (19) అనే యువకుడి ని నియమించుకున్నాడు. కాగా ఈ దుకాణానికి ఈ సిగరెట్ల సరఫరాదారుడు కేరళ్లకు చెందిన అర్షద్ అనే వ్యక్తి. అర్షద్‌తో ఉబయ్స్‌కు బెంగళూ రులో పరిచయం ఏర్పడింది. ఇతను ఈ సిగరెట్ల బడా స్మగ్లర్. ఇతనిపై అనేకచోట్ల కేసులున్నాయి. గతంలో ఉబయ్స్ బెంగళూరులో పనిచేసిన సమయంలో పరిచయం కాగా ఆ సమయంలో ఈ సిగరెట్ల గురించి తెలిసింది. దీని తరువాత గత జూలై నెలలో ఉబయ్స్ హైదరాబాద్‌కు మ కాం మార్చి సొంతంగా వ్యాపారం మొదలుపెట్టాడు.



చైనీస్ ఇ-సిగరెట్ల దుకాణంపై దాడుల సందర్భంగా పట్టుబడిన ఇ-సిగరెట్లు.

ఆన్‌లైన్‌లో ఆర్డర్ తీసుకుని, ఫోన్ పే ద్వారా డబ్బులు తీసు కుని, సరుకును ర్యాపిడో ద్వా రా హోం డెలివరి చేస్తుంటాడు ఉబయ్స్. ఈ క్రమంలో స్వల్ప వ్యవధిలోనే 45 మంది ఖాతాదారులను ఇతను సమకూర్చుకున్నాడు. ఇదే సమ యలో అర్షద్‌తోనూ వ్యాపారం చేస్తున్నాడు. మొత్తం మీద పది కోట్ల రూపాయల వ్యాపార డీలింగ్ ఇతను కలిగి వున్నాడని ఈగల్ తేల్చింది. ఫోన్ పే ద్వారా వచ్చిన డబ్బులు కేరళలోని కాసగడ్‌లో గల కెనరా బ్యాంకు ఖాతాకు మళ్లించసాగాడు. ఇప్పటి వర కు ఉబయ్స్ 50 వేల ఈ సిగరెట్లు విక్రయించినట్లు ఈగల్ పోలీసులు తేల్చారు. హైదరాబాద్‌లో గత ఆగస్టు నెల నుంచి 26 మందికి ర్యాపిడో ద్వారా ఇతను ఈ సిగరె ట్లను హోం డెలివరీ చేశాడు. ఉబయ్స్ గురించి సమాచారం అందగానే దాడులు చేసిన ఈగల్ పోలీసులు అతన్ని ప ట్టు కున్నారు. అతని సహా యకుడు ఉస్సే నర్‌ను కూడా అరెస్టు చేశారు. ఈ కేసులో కీలక నిందితుడు అర్షద్ కోసం గాలిస్తున్నారు. ఉబయ్స్ నుంచి ఈ సిగరెట్లను కొన్న వారి కోసం, ర్యాపిడో ద్వారా హోం డెలివరీ పొందిన వారి కోసం ఆరా తీస్తున్నారు. ఈ తరహా వ్యాపారాలపై ఉ క్కుపాదం మోపుతామని ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా హెచ్చరించారు.

రికవరీ అధికారి కార్యాలయం - I/II
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ హైదరాబాద్ (DRT 1)
3వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్ అబిడ్స్, హైదరాబాద్- 500001
ఫారం నెం. 14
(రెగ్యులేషన్ 33(2)ను చూడుము)
రిజిస్టర్డ్ ఏ/డి దస్తీ విఫలం అయినా కారణంగా ప్రచురించబడుతుంది
డిమాండ్ నోటీసు
ఆదాయపు పన్ను చట్టం, 1961లోని రెండవ షెడ్యూల్‌లోని రూల్ 2 మరియు రికవరీ ఆఫ్ డెట్స్ & బ్యాంక్రప్టసీ యాక్ట్, 1993లోని సెక్షన్లు 25 నుండి 28 క్రింద నోటీసు.
RC/166/2025 24-07-2026
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
వర్సెస్
మెస్సర్స్ అలమేలు మంగా ఇంటర్నేషనల్ బేకర్స్ ప్రైవేట్ లిమిటెడ్
దిగువ వారికి,
(CD 1) మెస్సర్స్ అలమేలు మంగా ఇంటర్నేషనల్ బేకర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రతినిధిగా మేనేజింగ్ డైరెక్టర్, విల్లా నం.138, నెం.7-30, మై విల్లాస్, చెంగిచర్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లా-500076, రంగారెడ్డి, తెలంగాణ - మరియు సర్వే నెం.564/ఎ, 564/ఎఎ, 564/ఇ, 588, రాఘవపురం గ్రామం, బీబీనగర్ మండలం, యాదాద్రి, భువనగిరి జిల్లా - 508126.
(CD 2) శ్రీ పి. రామ్ సుభాష్ తండ్రి సుధాకర్ రెడ్డి పి, వయస్సు 54 సంవత్సరాలు, పురుషుడు, విల్లా నం.138, నం.7-30, మై విల్లాస్, చెంగిచెర్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి- 500076.
(CD 3) శ్రీమతి పి.రత్న ప్రియ భర్త శ్రీ రామ్ సుభాష్, వయస్సు: 52 సంవత్సరాలు, స్త్రీ, విల్లా నం.138, నం. 7-30, మై విల్లాస్, చెంగిచెర్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి- 500076.
(CD 4) శ్రీమతి జి. అరుణ వయస్సు: 21 సంవత్సరాలు, స్త్రీ, విల్లా నం.138, నం.7-30, మై విల్లాస్, చెంగిచెర్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి-500076.
(CD 5) నమో బాలాజీ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధిగా డైరెక్టర్, 12-11/1457/1, బౌద్ధనగర్, జామ్ ఏఐ ఉస్మానియా, వారాసిగూడ, సికింద్రాబాద్-500061 మరియు సర్వే నెం. 564/ఎ, 564/ఎఎ, 564/ఇ, 588, రాఘవపురం గ్రామం, బీబీనగర్ మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా- 508126
OA/432/2024లో ప్రిసైడింగ్ ఆఫీసర్, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ హైదరాబాద్ (DRT 1) వారిచే జారీ చేసిన ఆదేశాల ప్రకారం జారీ చేయబడిన రికవరీ సర్టిఫికేట్ ప్రకారం రూ.7,81,72,486/- (ఏడు కోట్ల ఎనభై ఒక్క లక్షల డెబ్బై రెండు వేల నాలుగు వందల ఎనభై ఆరు రూపాయలు మాత్రమే) మరియు విడిపించుకునేంత వరకు తేదీ 19-11-2024 నుండి వర్తింపుతో సంవత్సరానికి సాధారణ వడ్డీ % వంతున వ్యాజ్య కాలములో మరియు భవిష్యత్తు వడ్డీ (రికవరీ సర్టిఫికేట్ ప్రకారం) మరియు వ్యయాలు రూ.1,88,105/- (ఒక లక్ష ఎనభై ఎనిమిది వేల నూట ఐదు రూపాయలు మాత్రమే)లను మీరు బకాయి పడి ఉన్నారని (ఉమ్మడిగా మరియు విడిగా/ పూర్తిగా/ పరిమితముగా) ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.
2. నోటీసు అందిన 15 రోజులలోపు పైన తెలిపిన మొత్తాన్ని చెల్లించాలని మీరు ఇందుమూలంగా సూచించబడుతున్నారు. విఫలమైనచో, బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థల చట్టం, 1993 మరియు దాని క్రింద ఉన్న రూల్స్ క్రింద ఉన్న డెట్స్ డ్యూ రికవరీని అనుసరించి వసూలు చేయబడుతుంది.
3. తదుపరి విచారణ తేదీలో లేదా అంతకు ముందు మీ ఆస్తుల వివరాలను అఫిడవిట్‌లో ప్రకటించాలని మిమ్మల్ని ఆదేశించడమైనది.
4. తదుపరి విచారణల కొరకు 17-12-2026న ఉ.10:30 గం.లకు దిగువ సంతకందారు సమక్షములో హాజరు కావాలని మిమ్మల్ని ఇందుమూలంగా ఆదేశించడమైనది.
5. పైన తెలిపిన మొత్తానికి అదనంగా, మీరు ఈ క్రింది వాటిని కూడా చెల్లించాల్సి ఉంటుంది:
(ఎ) సర్టిఫికేట్ / అమలు ప్రక్రియల యొక్క ఈ నోటీసు తర్వాత వెంటనే ప్రారంభమయ్యే కాలానికి చెల్లించాల్సిన సదరు వడ్డీలు.
(బి) ఈ నోటీసు మరియు వారెంట్లు మరియు ఇతర ప్రక్రియలు మరియు బకాయి ఉన్న మొత్తాన్ని తిరిగి పొందడానికి తీసుకున్న అన్ని ఇతర చర్యల సర్వీస్‌కు సంబంధించి వెచ్చించిన అన్ని వ్యయాలు, ఛార్జీలు మరియు ఖర్చులు.
స్వయముగా నా చేతితో మరియు ట్రిబ్యునల్ ముద్రతో, ఈ తేదీ: 24-07-2026న ఇవ్వడమైనది.
రికవరీ అధికారి
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, హైదరాబాద్ (DRT 1)

ఇన్నోడేటా కంపెనీ 550 మందిపై ఆకస్మిక వేటు

న్యూఢిల్లీ, అక్టోబరు 27: భారతీయ ఐటీ రంగంలో ఉద్యోగుల అభద్రతా భావం మళ్లీ పరాకాష్టకు చేరింది. గ్లోబల్ డేటా ఇంజినీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సేవల సంస్థ ఇన్నోడేటా ఇండియా సంస్థ ఎవరూ ఊహించని షాక్ ఇచ్చింది. తమ కంపెనీలో పని చేస్తున్న వందలాది మంది ఉద్యోగుల తలరాతలను ఒక్క పూటలోనే తలకిందులు చేసింది. సోమవారం ఉదయం యథావిధిగా ఆఫీసు పనిలో లాగిన్ అయిన ఉద్యోగులకు, లంచ్ సమయానికి దారితీసిన పరిణామాలు ఊహించని షాక్ ఇచ్చాయి. ఎలాంటి

ఉదయం లాగిన్.. లంచ్‌టైమ్‌కల్లా లేఆఫ్

ముందస్తు సమాచారం లేకుండా దాదాపు 550 మంది భారతీయ సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తూ అధికారిక సిస్టమ్స్, ఇమెయిళ్లు, హెచ్ఆర్ పేరోల్ అకౌంట్లను లాకౌట్ చేసేసినట్లు ఓ జాతీయ మీడియా పేర్కొంది. ఈ ఊహించని తొలగింపుల పర్వం సాగిన తీరు ఐటీ వర్గాలను భయాందోళనలకు గురి చేస్తోంది. సోమవారం ఉదయం ఉద్యోగులు రోజువారీ పనుల కోసం సిస్టమ్స్ లలో లాగిన్ అయి అటెండెన్స్ నమోదు చేసుకున్నారు. లంచ్ సమయానికి ఫిలిప్పీన్స్ బ్రాంచ్‌లోని ప్రాసెస్ అనలిస్టులు, టీమ్ లీడర్లను జూమ్ గ్రూప్ కాల్ ద్వారా ఒకేసారి తొలగిస్తున్నట్లు వార్తలు బయటకు వచ్చాయి. ఈ రూమర్ల తీవ్రతను అర్థం చేసుకునే లోపే, భారత్‌లోని ఇన్నోడేటా ఉద్యోగుల లాప్‌టాప్‌లు, ఆఫీస్ ఐడీలు ఒకదాని తర్వాత ఒకటి సడెన్‌గా లాగౌట్ అయిపోయాయి. ఏం జరుగుతుందో తెలియక అభద్రతకు గురైన ఉద్యోగులు వెంటనే ఒక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసుకోగా సాయంత్రానికి అందులో ఏకంగా 500 మందికి పైగా బాధిత ఉద్యోగులు చేరడం ఈ లేఆఫ్స్ తీవ్రతకు అద్దం పడుతోంది. ఎప్పటిలాగే మేము రోజూ వారీ పనిని మొదలు పెట్టాం. మధ్యాహ్నం టైంలో ఉద్యోగాల తొలగింపుల వార్తలు ఒక్కసారిగా గుప్పుమన్నాయి. ఆ వెంటనే ఒకరి తర్వాత ఒకరి కంపెనీ ల్యాప్ టాప్స్ నుంచి యాక్సెస్ కోల్పోయాము. ఐడీలు డీ యాక్టివేట్ అయ్యాయి. ఆ తర్వాత వ్యక్తిగత ఇమెయిల్ ఖాతాలకు లేఆఫ్స్ మెయిల్స్ వచ్చాయని ఉద్యోగులు తెలిపారు. కంపెనీ అధికారులు నేరుగా మాట్లాడకుండానే, సిస్టమ్స్ లాక్ చేసిన తర్వాత ఉద్యోగుల వ్యక్తిగత ఇమెయిల్ ఐడీలకు లేఆఫ్స్ లేఖలు పంపించినట్లు సమాచారం.

వార్త

మీ బిడ్డను కొట్టడానికి ముందు బిడ్డ చేసిన తప్పుకు మీరు కారణం కాదన్న విషయాన్ని నిర్ధారించుకోండి.

- ఒమల్లె ఆస్టిన్

ఐరోపాలో అశాంతి పర్వం!


నిన్నగాక మొన్న ఫ్రాన్స్‌లో ఏం జరిగింది? రేపు ఏం జరుగబోతోంది. ఎవరూ చెప్పలేం.అంతేకాదు ఫ్రాన్స్‌తోపాటు అల్బేనియా, ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్‌లోజనం హాహాకారాలు చేస్తుంటే పాలకులు చేష్టలుడిగి చూస్తున్నారు. సామాన్య ప్రజానీకం అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. 'జెన్‌జి' నిరసనలు పెచ్చుపెరిగి చాలా దేశాలు ఎక్కడికక్కడ సర్దుకున్నాయి. కానీ ఫ్రాన్స్‌వంటి దేశాల తమ ప్రజానీకానికి సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో దిక్కుతోచక చుక్కల్లోకి చూస్తున్నాయి. రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉంటుందనిపించే ఈ దేశాల్లో మొదలైన అలజడి ప్రధానంగా సామాజిక అంశాల మీదనే ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు వచ్చింది. పెరుగుతున్న కుటుంబ ఖర్చులు, ప్రజాసేవలపై తీవ్ర ఒత్తిడి, ఆర్థిక అసమానతలు, ప్రభుత్వంలో అవినీతి అంశాలపై ప్రజల్లో అశాంతి గూడుకట్టుకొంది. ఐరోపా దేశాల్లో ముఖ్యంగా ఇలాంటి అంశాలపై పాలకులు ప్రజల్ని సమాధానపరిచే పరిస్థితుల్లేవు. ఆయా దేశాల్లో ఒకరు కాదు ఇద్దరు కాదు వేలాది మంది, లక్షలాది మంది నిరసనల్లో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నంలో భాగంగా పోలీసులు భాష్పవాయువు, వాటర్ కేన్లను ప్రయోగించారు. నిరసనకారులు దేనినీ లక్ష్యపెట్టడం లేదు. ఫ్రాన్స్‌లో భారీ స్థాయిలో వెల్లువెత్తిన నిరసనల్లో జీవన వ్యయం పెరుగుదల, గృహవసతి కానరాకపోవడం, పాఠశాలలకు నిధుల కేటాయింపు, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా లక్షలాది మంది ర్యాలీలు నిర్వహించారు. మూడు రోజుల క్రితం ఒక్కసారిగా ఐరోపాలో 5 ప్రధాన దేశాల్లో నిరసన వెల్లువెత్తింది. దాదాపు 4.10 లక్షల మంది నిరసనల్లో పాల్గొన్నారని ఫ్రాన్స్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వశాఖ అంచనావేసింది. సిఎన్‌జిటి కార్మిక సంఘం మాత్రం నిరసనకారుల సంఖ్య 8లక్షల వరకు ఉంటుందని అంచనా. ఆయా దేశాల్లో కొన్నిసమాంతర సమస్యలు ఉన్నప్పటికీ, మరికొన్ని దేశాలు ప్రత్యేక సమస్యలతో తట్టుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. 2026లో యూరోపియన్ యూనియన్‌లో ద్రవ్యోల్బణం 3.1 శాతం ఉండొచ్చునని కమిషన్ అంచనా వేసింది. యూరప్ అంతటా ఒకే రకమైన అశాంతి కాదు. వలసలపై భిన్నాభిప్రాయాలు కూడా పట్టిపీడిస్తున్నాయి. యూరప్ చరిత్రలో విప్లవాలు, ఉద్యమాలు, పోరాటాలు నిరసనలు కొత్తేమీకాదు.ప్రజల వ్యక్తిగత మనుగడపై ప్రభావితం చేసే అంశాలున్నాయి.కనుక ప్రభుత్వాలు అణచివేత దృక్పథంతో కాకుండా ప్రజల్లో శాంతినెలకొనే మార్గంలో ఆలోచించాలి. పరిశ్రమల అభివృద్ధి కారణంగా పట్టణాలకు వలసలు పెరిగాయి. చాలాప్రాంతాల్లో ఉపాధి, గృహ వసతి వంటి అంశాల్లో అసంతృప్తి తలెత్తింది. ఆహార పదార్థాలు ధరలు పెరుగుదల కూడా ప్రజల్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టివేసింది. యూరప్ దేశాలలో ప్రస్తుతం వ్యక్తమవుతున్న అసంతృప్తి, నిరసనలు, సామాజిక అశాంతిపై అక్కడ సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న జీవన పోరాటాలు, సామాజిక వైరుధ్యాలతో ప్రజానీకం కుదేలౌతోంది. కోవిడ్ అనంతర పరిణామాలు, ఇంధన ధరల పెరుగుదల, నిరంతరం పెరుగుతున్న ద్రవ్యోల్బణంవల్ల సామాన్యుల కొనుగోలు శక్తి పడిపోయింది. ధరలు తగ్గినా, గతంలో పెరిగిన ధరలస్థాయి నుండి ప్రజలకు ఎటువంటి ఉపశమనం లభించడం లేదు. ఫ్రాన్స్, బెల్జియం వంటి దేశాలలో బడ్జెట్ లోటు పెరిగిపోవడంతో ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను కుదించాల్సి వస్తోంది. ఇది ప్రభుత్వాలకూ, ప్రజలకూ మధ్య అగాధాన్ని పెంచింది. యూరప్‌లో సాధారణప్రజలు రోజువారీ బతుకుదెరువు కోసం పడుతున్నపాట్లు వర్ణనాతీతం. ప్రధానంగా క్రింది సమస్యలు వారి జీవితాలను అస్తవ్యస్తం చేస్తున్నాయి. స్పెయిన్ (మాడ్రిడ్), పోర్చుగల్ (లిస్బన్), ఫ్రాన్స్‌లలో అద్దెలు విపరీతంగా పెరిగిపోయాయి. సంపాదనలో సింహభాగం ఇంటి అద్దెలకే సరిపోతుండటంతో, యువత, వృద్ధులు కూడా రోడ్డున పడే పరిస్థితి వచ్చింది. పెరుగుతున్న జీవన వ్యయానికి తగినట్లుగా వేతనాలు పెరగడం లేదు. ఇటలీ వంటిదేశాలలో ద్రవ్యోల్బణం పెరిగిపోవడంతో ఉద్యోగులు,ఉపాధ్యాయులు పూటగడవడం కష్టమవుతోందని ఆందోళన బాటపట్టారు. దిగజారిపోతున్న ప్రభుత్వ సేవలు, విద్య, వైద్యరంగాలకు నిధుల కోత విధించడంవల్ల సామాన్య ప్రజలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందడం గగనమైంది. ఫ్రాన్స్‌లో పాఠశాలల్లో మౌలిక వసతులు కరవవడంతో విద్యార్థులు రోడ్డెక్కాల్సి వచ్చింది. తొలుత విద్యార్థులు, కార్మికులు చేసిన శాంతియుత నిరసనలకు సరైన సమాధానం దొరక్క క్రమంగా తీవ్రరూపం దాల్చి, కొన్నిప్రాంతాలలో అసాంఘిక శక్తులు ప్రవేశించడం వల్ల హింసకు దారితీశాయి. జనం విధ్వంసానికి కూడా వెనుకాడలేదు. ఫ్రాన్స్, ఇటలీ దేశాలలోని ప్రధాన నగరాలలో (పారిస్, మార్సెలై,మిలన్) ప్రభుత్వ భవనాలకు నిప్పుపెట్టడం, దుకాణాలను లూటీ చేయడం వంటి అసాధారణ సామాజిక విచ్ఛిన్నకర ఘటనలు జరిగాయి. ఇది సమాజంలో పెరుగుతున్న నైతిక పతనాన్ని, నిరాశా నిస్పృహలను సూచిస్తుంది. పాలకులు, యువత మధ్యతీవ్రమైన అగాధం ఏర్పడింది.సంప్రదాయ రాజకీయ వ్యవస్థ తమ గోడును పట్టించుకోవడం లేదనే తీవ్ర ఆగ్రహంతో యువత వ్యవస్థపైనే తిరుగుబాటు బావుటా ఎగరేసింది. కుటుంబాల ఆర్థిక స్తోమత లేనిదే సొంత ఇల్లు లేదా స్థిరమైన జీవితం ఇవేమీ సాధ్యపడకపోవడం యువతలో మానసిక అభద్రతా భావాన్ని పెంచింది.యూరప్‌లో జరుగు తున్న ఈ పరిణామాలు కేవలం ఆర్థిక సమస్యలకు సంబంధించినవి మాత్రమేకావు, అవి దెబ్బతిన్న సామాజిక ఒప్పందానికి అద్దం పడుతున్నాయి. ప్రభుత్వాలు తక్షణమే గృహ వసతి, ద్రవ్యోల్బణం యువత ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టకపోతే, ఈ సామాజిక అశాంతి ప్రజాస్వామ్య వ్యవస్థలకే మునుపెన్నడూ లేని విధంగా పెను సవాలుగా మారుతుంది.

ముందు ముందు గొప్ప లాభాలను పొందడం కోసం చురుకైన వ్యక్తులు చిన్న చిన్న చికాకులతో సర్దుకుపోతుంటారు.



హచిన్‌సన్

గౌరవం అన్నది పదవులు,హోదాలు పొందడంలో లేదు. పదవులకు, గౌరవాలకు మనం అర్హులం అనే భావనలోనే గౌరవం ఉంటుంది.



అరిస్టాటిల్

ప్రజావాక్కు

సొంతింటి కల నెరవేరేదెప్పుడు?

సొంతిల్లు అంటే నాలుగు గోడలు, ఒక పైకప్పు మాత్రమే కాదు. అది మనిషికి భద్రత, ఆత్మగౌరవం, స్వేచ్ఛ, స్థిరత్వం అందించే జీవిత పునాది.అయితే నగరాల్లో పెరుగుతున్న ఇంటి ధరలు, అద్దెలు సామాన్య కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. సంపాదనలో గణనీయమైన భాగం అద్దెకే వెచ్చించాల్సి రావడంతో విద్య, వైద్యం, పొదుపు వంటి కీలక అవసరాలకు వెచ్చించే సామర్థ్యం తగ్గిపోతుంది. అద్దెఇంట్లో నివసించే కుటుంబాలకు ఇల్లు ఖాళీ చేయాల్సి వస్తుందేమోననే అభద్రత కూడా వెంటాడుతుంది. ఇల్లు లేనివారి పరిస్థితి మరింత దయనీయం.మండేఎండలు,చలి,వర్షాలకు తలదాచుకునే గూడు లేక వీధుల్లో జీవించాల్సిన పరిస్థితి మానవ గౌరవానికే సవాలు. నిద్రించడానికి సురక్షితమైన స్థలం లేకపోవడం నుంచి ఆరోగ్య పరిరక్షణ వరకు వారి జీవితం నిత్యం అనిశ్చితితోనే సాగుతుంది. అందుకే సొంతింటిని విలాసంగా కాకుండా గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన ప్రాథమిక భరోసాగా చూడాలి.

- సి.సాయిరుత్విక్, శ్రీకాకుళం

కాలాన్ని వృధా చేయొద్దు

సాధారణంగా కొందరు పనిలేనివారు, వెళ్తున్న వారిని ఆపి, వాళ్ళ వ్యక్తిగత విషయాలను అడిగి తెలుసుకుంటూ కాలాన్ని వృధా చేస్తుంటారు. అసందర్భపు,అప్రస్తుత సంభాషణలతో అమూల్యమైన సమయాన్నికేవలం కాలక్షేపం కోసం వృధా చేయడం అంత మంచిదికాదు. అవసరమైన మాటలు మాట్లాడుకుంటే ఉపయోగమేకాని, అనవసరమైన మాటలతో ఎంతో విలువైన కాలాన్ని వృధా చేయడం మూర్ఖత్వమే అవుతుంది. డబ్బు పోయినా, ఆస్తులు పోయినా తిరిగి సంపాదించుకోవచ్చు. కానీగడిచిపోయిన కాలం మాత్రం తిరిగి రాదని గుర్తుంచుకోవాలి.

- కె. నాగేంద్ర, హైదరాబాద్

చర్యలు తీసుకోవాలి

పెద్ద అనారోగ్యం ఆకస్మికంగా దండెత్తినప్పుడు, చేతిలో ఉన్నదంతా హరించుకుపోయి,ఎన్నోకుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. జనసామాన్యానికి ఆరోగ్య భద్రత లభింపచేయటానికి, ప్రభుత్వాసుపత్రులకి తగినన్ని నిధులు కేటాయించి, నిపుణులు, ఆధునిక వైద్య ఉపకరణాలు, ఔషధాలు నిత్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి.

- మా. శ్రీ. రాజు, పాల్వంచ

పెరుగుతున్న లంచాల వసూళ్లు

భారతంలో ప్రభుత్వ ఆసుపత్రులలో అటెండర్లు, డాక్టర్లు, కింది స్థాయి సిబ్బంది నిరుపేదలను అడుగడుగున వైద్యం పేరుతో, ప్రవేశం పేరుతో, సమయపాలన పేరుతో అడ్డగోలు లంచాలు వసూలు చేస్తున్నారు. ఇవి చూసి కూడా పెడచెవిన పెడుతున్న పైఅధికారుల నిర్లక్ష్యం ఎక్కువైపోయింది. అనారోగ్య సమస్యలతో డబ్బులులేక దిక్కుతోచని స్థితిలో ప్రభుత్వ ఆసుపత్రుల వైపుమొగ్గు చూపుతుంట వసూళ్ల పేరుతో నిరుపేద కుటుంబాల రక్తం తాగుతున్నారు డాక్టర్లు,సిబ్బంది. అధికారుల పర్యవేక్షణ నిరంతరం జరుగుతూనే ఉండాలి. ఎప్పటికప్పుడు ఫిర్యాదులను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

- ఎం.శివకుమార్, కాకునూరు

సర్పంచుల ఆగడాలు

సర్పంచులు అధికార పలుకుబడితో అరాచకాలు,అలజడులు, అవినీతి, అక్రమాలు,ప్రజలపై దాడులు,దౌర్జన్యాలు చేస్తున్నారు. కొన్ని గ్రామాలలో తండ్రి సర్పంచ్‌కొడుకు వార్డు మెంబర్ అండతో గ్రామాలలో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్నారు.ఇందిరమ్మ ఇండ్లు కుటుంబ సభ్యులకే పెట్టుకుంటున్నారు. సంక్షేమపథకాలు సర్పంచి కుటుంబాలకే అంకితం అవుతున్నాయి. సర్పంచ్ కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలపైచుట్టుప్రక్కల గ్రామప్రజలపై దాడులుచేస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ప్రజలపై అక్రమ కేసులు పెడుతున్నారు. గ్రామ పంచాయతీకి చెందిన బిల్లులు అధికంగా డబుల్ రేట్లతో బిల్లులు పెడుతున్నారు. ఇట్టి వారిని గుర్తించి నోటీసులు ఇచ్చి సస్పెండ్ చేయాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

చైనా ఆధిపత్యాన్ని కట్టడి చేయాలి

బ్రిక్స్ సమావేశం ముగిసింది. అయితే బ్రిక్స్ కొన్ని స్పష్టమైన ఉద్దేశాలను ప్రసరింపజెస్తోంది. అమెరికా ఏకచక్రాధిపత్యం ఇంకా ఎంత మాత్రం చెల్లనేరదు. చైనా ఆధిపత్యాన్ని కట్టడి చేస్తాం అని చెప్పకనే భారత్ చెప్పేసింది. ఇంకా భారత్ ఒక విషయంలో బ్రిక్స్‌కు ఎప్పటికి రుణపడి ఉండాలి. భారత్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించినస్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమానికి నిధులు అందించే బ్రిక్స్‌దేశాల అభివృద్ధి బ్యాంకు కు భారత్ ఎప్పటికి రుణపడి ఉండాలి. ఎందుకంటే ఇది భారత్‌లో స్వచ్ఛతను నెలకొల్పడమే కాదు, భారత పౌరుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాదు ఆర్థిక వ్యవస్థ పెంపుదలలో ఈ కార్యక్రమం ప్రధాన పాత్ర పోషిస్తున్నది.

- బి. అవినాష్, జనగామ

రహదారి భద్రత ఆర్థికాభివృద్ధికీ సవాలే!

2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలు, గాయాలను 50 శాతం తగ్గించాలన్న లక్ష్యాన్ని సాధించాలంటే తాత్కాలిక చర్యలు సరిపోవు. రహదారి భద్రతను రవాణా, పట్టణాభివృద్ధి, పారిశ్రామిక ప్రణాళికల్లో భాగం చేయాలి. కొత్త రహదారుల నిర్మాణంతోపాటు పాత రహదారుల నిర్వహణ, భద్రతా తనిఖీలు, నిబంధనల అమలు, అత్యవసర వైద్యసేవలకు తగిన నిధులు కేటాయించాలి. ఈ లక్ష్య సాధనకు కాలపరిమితితో కూడిన కార్యాచరణను రూపొందించి, దాని అమలును క్రమం తప్పకుండా సమీక్షించాలి. భారతదేశానికి వేగవంతమైన రవాణా వ్యవస్థ ఎంత అవసరమో, సురక్షితమైన ప్రయాణం కూడా అంతే అవసరం. రోడ్డు ప్రమాదాలను అభివృద్ధి ప్రక్రియలో తప్పనిసరిగా ఎదురయ్యే నష్టాలుగా భావించకూడదు. సరైన రహదారి రూపకల్పన, కఠినమైన నిబంధనల అమలు, సమర్థవంతమైన వైద్యసేవల ద్వారా ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ప్రజల ప్రాణాలను కాపాడటాన్ని అభివృద్ధి లక్ష్యాల్లో అంతర్భాగంగా మార్చినప్పుడే రహదారుల విస్తరణ దేశానికి ఆర్థిక, సామాజిక ప్రయోజనాలను అందిస్తుంది.

దుంగ జయరాం

భారతదేశంలో రహదారుల విస్తరణ ఆర్థికాభివృద్ధికి కీలకం. అవి మార్కెట్లను అనుసంధానిస్తాయి, సరకు రవాణాను వేగవంతం చేస్తాయి,ఉపాధి అవకాశాలను పెంచుతాయి. కానీ రహదారులపై భద్రతకు తగిన ప్రాధాన్యం లేకపోతే, అభివృద్ధి వల్ల కలిగే ప్రయోజనాలు ప్రమాదాల కారణంగా దెబ్బతింటాయి. ప్రాణనష్టం, ఉత్పాదకత తగ్గడం, కుటుంబాలపై ఆర్థిక భారం పెరగడం దేశ ప్రగతికే అవరోధాలుగా మారతాయి. అందువల్ల రహదారుల అభివృద్ధిలో ప్రయాణ వేగంతోపాటు ప్రజల భద్రతకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం 2025లో దేశవ్యాప్తంగా 5,13,563 రోడ్డు ప్రమాదాలు సంభవించి 1,83,382 మంది ప్రాణాలు కోల్పోయారు. 2024లో 4,87,707 ప్రమాదాలు జరిగి 1,77,175 మంది మరణించారు. ఆ ఏడాది జాతీయ రహదారులపై 64,772 మంది, రాష్ట్ర రహదారులపై 39,277 మంది ప్రాణాలు కోల్పోయారు. రోడ్డుప్రమాదాల్లో మరణించిన వారిలో ద్విచక్ర వాహనదారులు 46.2శాతం, పాదచారులు 20.6శాతం ఉన్నారు. ఈ గణాంకాలు దేశంలో రహదారి భద్రతను మెరుగుపరచాల్సిన అత్యవసర పరిస్థితిని తెలియజేస్తున్నాయి. ప్రమాదాల ప్రభావం బాధితుల కుటుంబాలకే పరిమితం కాదు. సంపాదించే వ్యక్తిని కోల్పోయిన కుటుంబాలు ఆదాయాన్ని కోల్పోతాయి. తీవ్రంగా గాయపడినవారి చికిత్స, పునరావాసానికి పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుంది. సంస్థలు ఉద్యోగుల నష్టం, సరకు రవాణాలో జాప్యం, వాహనాల మరమ్మతులు, బీమా వ్యయాల రూపంలో నష్టపోతాయి. ప్రభుత్వాలపై వైద్యసేవలు, పునరావాసం కోసం అదనపు భారం పడుతుంది. కాబట్టి ప్రమాదాల నివారణకు చేసే ఖర్చును అనవసర వ్యయంగా చూడకూడదు. అది ప్రజల ప్రాణాలను కాపాడటంతోపాటు దేశ ఆర్థిక నష్టాలను తగ్గించే పెట్టుబడి. ప్రమాదాలన్నింటికీ వాహనదారుల నిర్లక్ష్యమే కారణం కాదు. ప్రమాదకరమైన మలుపులు, తగిన వెలుతురు లేకపోవడం, సూచిక బోర్డుల కొరత, రహదారుల పక్కన ఆక్రమణలు, పాదచారుల కోసం సురక్షితమైన మార్గాలు లేకపోవడం కూడా ప్రమాదాలకు దారితీస్తాయి. ఈ లోపాలను రహదారుల నిర్మాణ దశలోనే గుర్తించి పరిష్కరించాలి. జాతీయ, రాష్ట్ర రహదారులపై భద్రతా తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించి, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించాలి. అక్కడి పరిస్థితులకు అనుగుణంగా రహదారి రూపకల్పనను సవరించడం, వెలుతురు మెరుగుపరచడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలి.అతివేగం ప్రమాదాలకు ప్రధాన కారణాల్లో ఒకటి. 2024లో అతివేగంతో సంబంధం ఉన్న విభాగంలో 3,45,024 ప్రమాదాలు నమోదయ్యాయి. మద్యం లేదా మాదక ద్రవ్యాల ప్రభావంలో వాహనాలు నడపడం, తప్పుదిశలో ప్రయాణించడం, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ ఉపయోగించడం వంటి ఉల్లంఘనలను కూడా అరికట్టాలి. ఇందుకోసం నిరంతర తనిఖీలు, వేగాన్నిగుర్తించే కెమెరాలు, నిబంధనలు ఉల్లంఘించినవారిపై నిష్పక్షపాత చర్యలు అవసరం. డ్రైవింగ్ లైసెన్సులు ఇచ్చే ముందు



వాహనం నడిపే నైపుణ్యంతోపాటు ట్రాఫిక్ నియమాలపై అవగాహనను కూడా పరీక్షించాలి. నిబంధనలు కఠినంగా ఉండటమే కాదు, వాటి అమలు కూడా నిరంతరంగా జరగాలి. పాదచారులు, ద్విచక్ర వాహనదారుల భద్రతకుప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రమాదాల్లో వీరు అధికంగా ప్రాణాలు కోల్పోతున్నందున ఫుట్‌పాత్‌లు, సురక్షితమైన రోడ్డు దాటే మార్గాలు, పాఠశాలలు,ఆసుపత్రుల సమీపంలో వేగ నియంత్రణ ఏర్పాట్లు అవసరం. హెల్మెట్లు, సీటు బెల్టుల వినియోగంపై నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి. రహదారులను ప్రధానంగా వేగంగావెళ్లే వాహనాల కోసమే రూపొందించే ధోరణి మారాలి. నడిచేవారు, సైకిల్‌పై వెళ్లేవారు, ద్విచక్ర వాహనదారులు కూడా సురక్షితంగా ప్రయాణించగలిగేలా ప్రణాళికలు రూపొందించాలి. వాణిజ్య రవాణా రంగంలో డ్రైవర్ల పని వేళలు, విశ్రాంతి, వాహనాల నిర్వహణపై పర్యవేక్షణ అవసరం. ఎక్కువ గంటలు విశ్రాంతి లేకుండా వాహనాలు నడపడం, వాహనాల మరమ్మతులను నిర్లక్ష్యం చేయడం, నిర్ణీత పరిమితికి మించి సరకు ఎక్కించడం ప్రమాదాల ముప్పును పెంచుతాయి. రవాణాసంస్థలు డ్రైవర్లకు తగిన విశ్రాంతి కల్పించాలి. వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలను నిజాయితీగా నిర్వహించాలి. ఖర్చులు తగ్గించాలనే ఉద్దేశంతో భద్రతా ప్రమాణాలను పక్కనపెట్టకూడదు. ప్రమాదం జరిగినప్పుడు బాధితులకు త్వరగా వైద్య సహాయం అందడంప్రాణాలను కాపాడటంలో కీలకం. ఎక్కువ ప్రమాదాలు జరిగే రహదారుల వెంట అంబులెన్సులు, అత్యవసర వైద్యసేవలు, ప్రమాద బాధితులకు చికిత్స అందించే ప్రత్యేక కేంద్రాలు అందుబాటులో ఉండాలి. బాధితులను ఆసుపత్రులకు తరలించడంలో ఆలస్యాన్ని తగ్గించేందుకు సమన్వయ వ్యవస్థను బలోపేతం చేయాలి. అలాగే ప్రమాదాల సమాచారాన్ని క్రమబద్ధంగా సేకరించి విశ్లేషించాలి. ఏ ప్రాంతాల్లో, ఏ కారణాలతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయో తెలుసుకుని, ఆ సమాచారాన్ని భద్రతా చర్యల రూపకల్పనకు ఉపయోగించాలి. రహదారి భద్రతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రస్తావిస్తున్న నాలుగుప్రధాన అంశాలు అవగాహన, రహదారులు, వాహనాల ప్రమాణాల మెరుగుదల, నిబంధనల అమలు, అత్యవసర వైద్యసేవలు సమగ్ర విధానానికి పునాది కావాలి. అయితే వాటి అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, పోలీసు శాఖలు, రహదారుల నిర్మాణ సంస్థల మధ్య సమన్వయం అవసరం. ప్రతి విభాగం బాధ్యతను స్పష్టంగా నిర్ణయించాలి. చేపట్టిన చర్యల సంఖ్యను కాకుండా, ప్రమాదాలు, మరణాలు, తీవ్ర గాయాలు ఎంతవరకు తగ్గాయన్నదాని ఆధారంగా పనితీరును అంచనా వేయాలి. 2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలు, గాయాలను 50 శాతం తగ్గించాలన్న లక్ష్యాన్ని సాధించాలంటే తాత్కాలిక చర్యలు సరిపోవు. రహదారి భద్రతను రవాణా, పట్టణాభివృద్ధి, పారిశ్రామిక ప్రణాళికల్లో భాగం చేయాలి. కొత్త రహదారుల నిర్మాణంతోపాటు పాత రహదారుల నిర్వహణ, భద్రతా తనిఖీలు, నిబంధనల అమలు, అత్యవసర వైద్యసేవలకు తగిన నిధులు కేటాయించాలి. ఈ లక్ష్య సాధనకు కాలపరిమితితో కూడిన కార్యాచరణను రూపొందించి, దాని అమలును క్రమం తప్పకుండా సమీక్షించాలి. భారతదేశానికి వేగవంతమైన రవాణా వ్యవస్థ ఎంత అవసరమో, సురక్షితమైన ప్రయాణం కూడా అంతే అవసరం. రోడ్డు ప్రమాదాలను అభివృద్ధి ప్రక్రియలో తప్పనిసరిగా ఎదురయ్యే నష్టాలుగా భావించకూడదు.సరైన రహదారి రూపకల్పన,కఠినమైన నిబంధనల అమలు, సమర్థవంతమైన వైద్యసేవల ద్వారా ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ప్రజల ప్రాణాలను కాపాడటాన్ని అభివృద్ధి లక్ష్యాల్లో అంతర్భాగంగా మార్చినప్పుడే రహదారుల విస్తరణ దేశానికి ఆర్థిక, సామాజిక ప్రయోజనాలను అందిస్తుంది.

పారిస్ పర్యావరణ ఒప్పందంపై చిత్తశుద్ధి అవసరం

సి.హెచ్.ప్రతాప్


వాతావరణ మార్పు ఇక భవిష్యత్తు ప్రమాదం కాదు. అసాధారణ వర్షాలు, వరదలు, కరవులు, వేడిగాలులు ఇప్పటికే వ్యవసాయం, ప్రజారోగ్యం, జలవనరులు, ఉపాధిపై ప్రభావం చూపుతున్నాయి. 2015లో కుదిరిన పారిస్ ఒప్పందం ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదలనురెండు డిగ్రీల సెల్సియస్‌కు చాలా దిగువన ఉంచుతూ,1.5 డిగ్రీలకు పరిమితం చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే పదేళ్ల తర్వాత కూడా దేశాల హామీలకు, క్షేత్రస్థాయి కార్యాచరణకు మధ్య అంతరం కొనసాగుతోంది. ఇప్పుడు అవసరమైనది మరిన్ని ప్రకటనలు కాదు, అమలు చేయగల స్పష్టమైన కార్యాచరణ. ప్రధాన సవాలు ఇంధనపరివర్తన. బొగ్గు, చమురు, సహజవాయువుపై ఆధారపడిన విద్యుత్, రవాణా, పారిశ్రామిక వ్యవస్థలను ఒక్కసారిగా మార్చడం సాధ్యం కాదు. అదే సమయంలో మార్పును వాయిదా వేస్తే ఉద్గారాలు పెరుగుతూనే ఉంటాయి. సౌర, పవన విద్యుత్ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, సమర్థమైన విద్యుత్ గ్రిడ్‌లు, స్వచ్ఛ రవాణా, తక్కువ కార్బన్ పరిశ్రమల్లో పెట్టుబడులు అవసరం. ఈ పరివర్తన కార్మికుల ఉపాధిని దెబ్బతీయకుండా పునఃశిక్షణ, ప్రత్యామ్నాయ జీవనోపాధితో కూడిన న్యాయమైన మార్పుగా సాగాలి. రెండో సవాలు వాతావరణ ఆర్థిక సహాయం. చారిత్రకంగా అత్యధిక ఉద్గారాలకు కారణమైన అభివృద్ధి చెందిన దేశాలు తమ బాధ్యతకు తగిన వేగంతో నిధులు, సాంకేతిక పరిజ్ఞానం అందించలేదన్న అసంతృప్తి కొనసాగుతోంది. ఏటా 100 బిలియన్ డాలర్ల సహాయం అందించాలన్న లక్ష్యం ఆలస్యంగా నెరవేరింది. అందులోనూ అధిక భాగం రుణాల రూపంలో వస్తే, వాతావరణ సంక్షోభానికి పరిమితంగా కారణమైన అభివృద్ధి చెందుతున్న దేశాలే అప్పుల భారాన్ని మోయాల్సి వస్తుంది. అందువల్లసహాయం ప్రధానంగా గ్రాంట్లు, తక్కువ వడ్డీనిధులు, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ రూపంలో అందాలి. నిధులు ఎక్కడి నుంచి వచ్చాయి, ఎవరికి చేరాయి, ఏ ఫలితాన్ని ఇచ్చాయన్నది పారదర్శకంగా వెల్లడించాలి. మూడో సవాలు ఉద్గారాల తగ్గింపుతోనే సమస్య పరిష్కారమవుతుందనే భావన.వాతావరణ ప్రభావాలు ఇప్పటికే మొదలయ్యాయి. అందువల్ల నివారణతో పాటు అనుసరణ చర్యలు సమాన ప్రాధాన్యం పొందాలి.నీటి కొరతను తట్టుకునే పంటలు,సూక్ష్మ సాగునీటి పద్ధతులు, చెరువుల పునరుద్ధరణ, నగరాల్లో వర్షపు నీటి పారుదల, వేడిగాలుల కార్యాచరణ ప్రణాళికలు, తీరప్రాంత రక్షణ, అందరికీ చేరేముందస్తు హెచ్చరికవ్యవస్థలు అవసరం. విపత్తు సంభవించిన తర్వాత పరిహారం ఇవ్వడం కంటే ముందుగానే నష్టాన్ని తగ్గించడం ఆర్థికంగానూ, సామాజికంగానూ మేలు. నాలుగో సవాలు అంతర్జాతీయ విశ్వాసం. కొన్ని దేశాలు ప్రకటించిన లక్ష్యాలను తరచుగా మార్చడం,శిలాజ ఇంధనాలకు రాయితీలు కొనసాగించడం, వాతావరణ నిధుల విషయంలో స్పష్టత లేకపోవడంపారిస్ వ్యవస్థ విశ్వసనీయతను బలహీనపరుస్తోంది. కాబట్టి ప్రతి దేశం తన లక్ష్యాలకు వార్షిక కార్యాచరణ పథకం రూపొందించి,పురోగతిని కొలవగల సూచికలతో బహిర్గతం చేయాలి. భారత్‌కు ఈమార్పు ఒకబాధ్యత మాత్రమే కాదు, అభివృద్ధి అవకాశమూ. పునరుత్పాదక విద్యుత్, హరిత హైడ్రోజన్, విద్యుత్ వాహనాలు, శక్తిసామర్థ్య భవనాలు, వాతావరణ అనుకూల వ్యవసాయం, కొత్త పెట్టుబడులు,ఉపాధికి దారితీయగలవు.ఒప్పందం ప్రపంచానికి గమ్యాన్నిచూపింది. కానీ గమ్యంతెలిసినంత మాత్రాన ప్రయాణం పూర్తికాదు. అభివృద్ధి చెందిన దేశాలు చారిత్రక బాధ్యతకు తగిన నిధులు, సాంకేతికత అందించాలి. భూమి వేడెక్కుతున్న వేగం కంటే ప్రపంచ కార్యాచరణ వేగం పెరగాలి.

నీటి పొదుపే భవిష్యత్తుకు రక్షాకవచం!



కాలగిరి శ్రీనివాసరెడ్డి

ప్రకృతి వనరులు సమృద్ధిగా ఉన్నప్పుడు వాటి విలువ తెలియదు. కొరత ఏర్పడినప్పుడే ఒక్క నీటి చుక్క, ఒక్క యూనిట్ విద్యుత్, ఒక్క గింజ ఆహారం, కష్టపడి సంపాదించిన ఒక్క రూపాయి విలువ అర్థమవుతుంది. తెలంగాణలో నీటి కొరతపై వ్యక్తమవుతున్న ఆందోళన కేవలం రైతుల సమస్య కాదు. ఇది వ్యవసాయం, ఆహార భద్రత, విద్యుత్ వినియోగం, కుటుంబ బడ్జెట్, గ్రామీణ ఉపాధి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలతో ముడిపడిన సంక్షోభం. నీటిని కాపాడుకోవడం అంటే జీవితాన్ని కాపాడుకోవడం. వనరులను పొదుపుగా వినియోగించడం అంటే భవిష్యత్తును భద్రపరచుకోవడం! వర్షపాతం లోటు, జలాశయాల్లో తగ్గుతున్న నిల్వలు, భూగర్భజలాలపై పెరుగుతున్న ఒత్తిడి వ్యవసాయ రంగానికి సవాళ్లుగా మారుతున్నాయి. అక్టోబర్ 16న ప్రచురితమైన నివేదిక ప్రకారం, సంభావ్య ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యతపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. యాసంగిలో వరి సాగును వాయిదా వేయాలని రైతులకు సూచించింది. అయితే ఎల్‌నినో ప్రభావంతో కరవు తప్పదని ముందుగానే నిర్ధారించలేం. వర్షపాతం, జలాశయాల నిల్వలు, భూగర్భజలాల పరిస్థితిని బట్టి శాస్త్రీయంగా నిర్ణయాలు తీసుకోవాలి. వరి సాగు తెలంగాణలో అనేక కుటుంబాలకు ప్రధాన ఆదాయ వనరు. విత్తనాలు, ఎరువులు, కూలీలు, యంత్రాల అద్దెలు, విద్యుత్, నీటిపారుదల కోసం రైతులు ముందుగానే పెట్టుబడి పెడతారు. పంట దశలో నీరు అందకపోతే పెట్టుబడి ప్రమాదంలోపడుతుంది. సాగు విస్తీర్ణం తగ్గితే వ్యవసాయ కూలీల ఉపాధి, ధాన్యం కొనుగోలు, రవాణా, మిల్లింగ్, విత్తనాలు, ఎరువుల వ్యాపారాలపైనా ప్రభావం పడుతుంది. అందువల్ల వరి సాగును తగ్గించాలని చెప్పడమే పరిష్కారం కాదు. ఏ ప్రాంతానికి ఎంత నీరు అందుబాటులో ఉంది? ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ ఉందా? విత్తనాలు సకాలంలో అందుతాయా? రైతు నష్టపోతే పరిహారం, పంటల బీమా, రుణ ఉపశమనం ఎలా కల్పిస్తారు? ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. నేల స్వభావం, వాతావరణం, సాగు ఖర్చులు, మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకుని వ్యవసాయ శాస్త్రవేత్తలు పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఇతర అనుకూల పంటలపై ప్రాంతాలవారీగా సూచనలు ఇవ్వాలి. రైతును ఒంటరిగా వదిలేయకుండా నీటి నిర్వహణ, ప్రత్యామ్నాయాలు, ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత. పళ్లు తోముకునేటప్పుడు, చేతులు కడుక్కునేటప్పుడు కుళాయిని అవసరం లేకుండా తెరిచి ఉంచకూడదు. స్నానానికి అవసరమైనంత నీటినే వాడాలి. వాహనాలను పైపుతో కాకుండా బకెట్, గుడ్డతో శుభ్రం చేయాలి. ఇంటి ప్రాంగణాన్ని నీటితో కడగడానికి బదులుగా చీపురు ఉపయోగించాలి. కుళాయిలు, పైపులు, ఫ్లష్ ట్యాంకుల్లో లీకేజీలను వెంటనే సరిచేయాలి. కూరగాయలు, పండ్లు కడిగిన సురక్షితమైన నీటిని మొక్కలకు ఉపయోగించవచ్చు. వర్షపు నీటిని నిల్వ చేయడం, నిపుణుల సూచనలతో ఇంకుడు గుంతలు నిర్మించడంద్వారా భూగర్భజలాల పునరుద్ధరణకు తోడ్పడవచ్చు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు నీటి సరఫరాలో లీకేజీలను అరికట్టి, ట్యాంకర్ల పంపిణీలో పారదర్శకత పాటించాలి. నీటి నిల్వలు, సరఫరా సమయాలు, అత్యవసర ఏర్పాట్లపై



ప్రజలకు సమాచారం అందించాలి. తాగునీటి భద్రత విషయంలో రాజీ పడకూడదు. బోర్లు, మోటార్ల ద్వారా నీటిని తోడేందుకు విద్యుత్ అవసరం. నీటి కొరతతో మోటార్లను ఎక్కువసేపు నడపడం,లోతైన బోర్లు వేయడం వల్ల విద్యుత్ ఖర్చులు, భూగర్భజలాలపై ఒత్తిడి పెరుగుతాయి. ఇళ్లలో అవసరం లేని లైట్లు, ఫ్యాన్లు ఆపివేయాలి. విద్యుత్ ఆదా చేసే దీపాలు వాడాలి.పగటి వెలుతురును వినియోగించాలి. ఫ్రిజ్ తలుపును పదేపదే తెరవకూడదు. వ్యవసాయంలో మోటార్ల వినియోగం, పైపుల లీకేజీలు, నీటిపారుదల సమయాలను పర్యవేక్షించాలి. అయితే వైద్యపరికరాలు,తాగునీటి పంపులు, అత్యవసర సేవలకు అవసరమైన విద్యుత్‌ను పొదుపు పేరుతో నిర్లక్ష్యం చేయకూడదు. నీటి కొరత పంట దిగుబడులను ప్రభావితం చేస్తే కొన్ని ఆహార పదార్థాల ధరలు పెరిగే అవకాశం ఉంది. అయితే ధరలు ఉత్పత్తి, నిల్వలు, సరఫరా, మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. కుటుంబ అవసరానికి తగినంత ఆహారమే వండాలి. శుభకార్యాలు, సమావేశాల్లో ఆహార వృథాను తగ్గించాలి. సురక్షితంగా నిల్వ చేసిన మిగులు ఆహారాన్ని వినియోగించాలి. పాడైన ఆహారాన్ని తినకూడదు. బియ్యం, పప్పులు, నూనె, ఇతర నిత్యావసరాలను అవసరానికి అనుగుణంగా కొనాలి. అధికంగా కొనుగోలు చేసి పాడుచేసుకోవడం పొదుపు కాదు. గడువు తేదీలు, నిల్వ పద్ధతులను గమనించాలి. ప్రభుత్వం ధాన్యం నిల్వలు, ప్రజా పంపిణీ వ్యవస్థ, ధరల పరిస్థితిని పర్యవేక్షించి పేద కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలి. నీటి ట్యాంకర్ల ఖర్చులు, ధరల పెరుగుదల, వ్యవసాయ ఆదాయం తగ్గడం కుటుంబ బడ్జెట్‌పై భారం మోపవచ్చు. ప్రతి కుటుంబం నెలవారీ ఆదాయం, తప్పనిసరి ఖర్చులు, అప్పులు, పొదుపులను లెక్కించుకోవాలి. అవసరం లేని కొనుగోళ్లు, అనవసర చందాలు, అధిక వడ్డీ అప్పులను తగ్గించాలి. అత్యవసర పరిస్థితుల కోసం సాధ్యమైనంత మొత్తాన్ని క్రమంతప్పకుండా పొదుపు చేయాలి.అయితే మందులు, పోషకాహారం, పిల్లల చదువు, సురక్షిత తాగునీటి ఖర్చులను తగ్గించకూడదు. రైతులు కూడా నీటి లభ్యతపై స్పష్టత లేకుండా భారీ అప్పులతో సాగు ప్రారంభించకుండా అధికారుల సలహా తీసుకోవాలి. పంటల బీమా, రుణ సదుపాయాలు, ప్రభుత్వ పథకాల వివరాలు తెలుసుకోవాలి. నీటి సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో ప్రజల బాధ్యత ఎంత ముఖ్యమో ప్రభుత్వాల బాధ్యత కూడా అంతే ముఖ్యం. జలాశయాల నిర్వహణ, చెరువుల పునరుద్ధరణ, కాలువల మరమ్మతులు,వర్షపునీటి సంరక్షణ, భూగర్భజలాల పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. తాగునీటికి ప్రాధాన్యం ఇస్తూనే రైతుల నష్టాన్ని తగ్గించే సాగు ప్రణాళిక రూపొందించాలి. కేంద్ర సహాయం అవసరమైతే కోరడంతో పాటు రాష్ట్రంలోని వనరులను సమర్థంగా వినియోగించాలి. ప్రజలు పొదుపు పేరుతో భయాందోళనలకు గురై నిత్యావసరాలను అధికంగా నిల్వ చేసుకోవడం సరి కాదు. అవసరాన్ని అంచనా వేసి బాధ్యతాయుతంగా వినియోగించడమే నిజమైన పొదుపు. నీరు, విద్యుత్,ఆహారం, డబ్బు, ప్రతి వనరుకూ విలువ ఇవ్వాలి.పాఠశాలలు, గ్రామ సభలు, కాలనీల్లో నీటి సంరక్షణపై అవగాహన పెంచాలి. ఆహారాన్ని వృథా చేయకూడదు. డబ్బును ఆలోచించి ఖర్చు చేయాలి. ఈ నాలుగు సూత్రాలు ప్రతి ఇంటి జీవన విధానంగా మారాలి. ఈరోజు కాపాడిన నీటిచుక్క రేపటి దాహాన్ని తగ్గించవచ్చు. ఈరోజు ఆదా చేసిన రూపాయి కష్టకాలంలో అండగా నిలవవచ్చు. సంక్షోభాన్ని భయంగా కాకుండా బాధ్యతాయుతమైన మార్పుకు హెచ్చరికగా స్వీకరిద్దాం. ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వ సమర్థ నిర్వహణ కలిసిన ప్పుడే తెలంగాణ నీటి భద్రతతో పాటు వ్యవసాయ, ఆర్థిక భవిష్యత్తును కాపాడుకోగలదు.

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు

మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)




సిఇసిపై దాఖలైన పిటిషన్ల విచారణ షురూ

ఇసికి నోటీసులు, విచారణ వచ్చేనెల 17కు వాయిదా

న్యూఢిల్లీ, అక్టోబరు 27: సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పనితీరును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు భారత ఎన్నికల సంఘానికి (ఈసీ) నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్లపై సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 17కు వాయిదా వేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించింది. ఎన్నికల సంఘం దాఖలు చేసిన అఫిడవిట్‌పై తమ స్పందన తెలియజేసేందుకు పిటిషనర్లకు రెండు వారాల గడువు ఇచ్చింది. విచారణ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ దోలా సేన్ తరఫున సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి వాదనలు వినిపించారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం6లో మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం వ్యవహరించిన తీరుపై ఆమె అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఫారం6లో మార్పులకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చినట్లు ఈసీ పత్రికా ప్రకటనలో పేర్కొందని ఆమె ఆరోపించారు. దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి.. పరిశీలిస్తామని తెలిపారు. మరోవైపు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు సంబంధించిన నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఎన్నికల సంఘం తన అఫిడవిట్‌లో పేర్కొంది. ఫారం6ను మూడు సర్ ఉత్తర్వుల ద్వారా మార్చారన్న ఆరోపణను కూడా తోసిపుచ్చింది. ఎన్నికల సంఘం పనితీరులో పారదర్శకత, ఓటర్ల జాబితా నిర్వహణకు ఉపయోగించే ఈఆర్వోనెట్ వ్యవస్థలో అధికారాల కేంద్రీకరణ, ఓటర్ల పేర్ల నమోదు, తొలగింపులపై ఈ పిటిషన్లు దాఖలయ్యాయి. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలను పట్టించుకోకుండా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారంటూ గతంలో వచ్చిన వార్తల నేపథ్యంలో ఈ వివాదం మరింత చర్చనీయాంశమైంది. అయితే, సర్‌కు సంబంధించిన తుది నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఈసీ స్పష్టం చేసింది.

రూ.9,507 కోట్లు తీసుకోండి.. దాడులు ఆపండి!

హౌతీలకు సౌదీ బంపర్ ఆఫర్



రియాద్, అక్టోబరు 27: తమ దేశంపై దాడులను నిలిపివేస్తే, హౌతీలకు 1 బిలియన్ డాలర్ల సుమారు రూ. 9,507కోట్లు ఆర్థిక సాయం అందిస్తామని సౌదీ ప్రతిపాదించినట్లు గల్ఫ్ దౌత్య వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ఈ శాంతి చర్చలకు ఇరాన్ మధ్యవర్తిత్వం వహించడం, సమావేశం టెహ్రాన్‌లో జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. సౌదీ రక్షణ మంత్రి ప్రిన్స్ ఖలీద్ బిన్ సల్మాన్ ఇటీవలే టెహ్రాన్‌కు వెళ్లి ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో పాటు తుర్కియే నిఘా విభాగాధిపతి ఇబ్రహీం కాలిన్, పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ వంటి కీలక ప్రాంతీయ నేతలు కూడా పాల్గొన్నట్లు సమాచారం. సౌదీ మంత్రి తన వెంట సైనిక రవాణా విమానంలో 1 బిలియన్ డాలర్ల నగదును టెహ్రాన్‌కు తీసుకొచ్చారని ఒక దౌత్యవేత్త చెప్పినప్పటికీ, సౌదీ అధికారులు మాత్రం నిధుల బదిలీని ధ్రువీకరించలేదు. సౌదీ అరేబియా లోని విమానాశ్రయాలు, చమురు క్షేత్రాలపై హౌతీలు చేస్తున్న దాడులు, హార్ముజ్ జల సంధిలో సృష్టిస్తున్న ఆటంకాల నేపథ్యంలో శాంతిని నెలకొల్పేందుకు ఇరాన్ ఈ మధ్యవర్తిత్వానికి ముందు కొచ్చినట్లు తెలుస్తోంది. ఖతార్, పాకిస్థాన్ చేస్తున్న శాంతి ప్రయత్నాలకు మద్దతుగా, ఉద్రిక్తతలను తగ్గించేందుకే ఈ పర్యటన జరిగిందని సౌదీ విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మూడేళ్ల క్రితం కుదిరిన ఒక అవగాహనను అమలు చేయడంలోనే ప్రధాన సమస్య ఉందని సౌదీ అధికారి ఒకరు సూచించారు. ఆ ఒప్పందం ప్రకారం సౌదీపై దాడులు ఆపినందుకు ప్రతిగా, హౌతీల నియంత్రణలో ఉన్న ప్రాంతాల్లో జీతాలు, మౌలిక సదుపాయాల కోసం రియాద్ ఆర్థిక సహాయం అందించాల్సి ఉంది.

పదిలక్షల మంది వస్తే మా వ్యాపారాలెట్లా?

రాహుల్, ఖర్గేలకు ట్రేడర్ల మరో లేఖ



న్యూఢిల్లీ, అక్టోబరు 27: సీఈసీ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో కాంగ్రెస్ పార్టీ నవంబర్ 1న మెగా ర్యాలీ కి పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. అయితే దీపావళి పండగ వేళ ఈ ఆందోళన కారణంగా తాము నష్టపోతామని, ర్యాలీని వాయిదా వేసుకోవాలని దేశ రాజధానిలోని వ్యాపార సంఘాలు అభ్యర్థించాయి. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కి లేఖ రాశాయి. దీనిపై కాంగ్రెస్ పార్టీగానీ, రాహుల్‌గాంధీగానీ సానుకూలంగా స్పందించకపోవడంతో ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ మరోసారి లేఖ రాసింది. పది లక్షల మంది నిరసనకారులు ఢిల్లీకి వస్తే వ్యాపారం ఎలా చేసుకోవాలని ప్రశ్నించింది. దీపావళి పండగ సీజన్‌లో ర్యాలీ నిర్వహించడంవల్ల రామ్‌లీలా మైదానం పరిసరాల్లో దాదాపు రూ.10 వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం పడవచ్చని పేర్కొన్నది. ర్యాలీని నవంబర్ 10కి వాయిదా వేయాలని విజ్ఞప్తి చేసింది. లేదంటే వాణిజ్య ప్రాంతాలకు దూరంగా నిరసన ప్రదేశాన్ని మార్చాలని లేఖలో కోరింది. ఈ లేఖ ప్రతిని రాహుల్‌తోపాటు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గేకు కూడా పంపామని, దీనిపై ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో చర్చించాలని కోరామని సీటీఐ ఛైర్మన్ బ్రిజేశ్ గోయల్ తెలిపారు. అక్టోబర్ 31, నవంబర్ 1 తేదీల్లో రామ్‌లీలా ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేయడం, రోడ్లను మూసివేయడం వంటి చర్యలవల్ల వినియోగదారులు దుకాణాలకు వచ్చే అవకాశం ఉండదని ఆందోళన వ్యక్తంచేశారు. ఇరుకైన ఢిల్లీ వీధులల్లోకి లక్షలమంది నిరసనకారులు, 20 వేల వాహనాలు రావడంవల్ల వ్యాపారం జరగదన్నారు. ఈనెల 10న జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో సుమారు 4 వేల మంది పాల్గొనడం వల్ల దిల్లీ అంతటా రాకపోకలకు అంతరాయం కలిగిందని తెలిపారు. దీనివల్ల వ్యాపారులకు రూ.3 వేల కోట్ల నష్టం వాటిల్లిందని వెల్లడించారు.

మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్‌కు వ్యతిరేక పవనాలు!



వాషింగ్టన్, అక్టోబరు 27: అమెరికా మధ్యంతర ఎన్నికలకు మరో వారం రోజులే గడువు ఉండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని రిపబ్లికన్ పార్టీకి ఈ ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగలవచ్చని ప్రధాన సర్వేలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా ప్రతినిధుల సభలో డెమొక్రాట్లు స్పష్టమైన ఆధిక్యం సాధించే అవకాశం కనిపిస్తోంది. ప్రముఖ విశ్లేషక సంస్థ రియల్ క్లియర్ పాలిటిక్స్ అంచనా ప్రకారం, ప్రతినిధుల సభలో డెమొక్రాట్లు సుమారు 227 సీట్లు గెలుచుకునే అవకాశం ఉంది.˝కుక్ పొలిటికల్ రిపోర్ట్ సైతం డెమొక్రాట్లకు 220 సీట్లు దక్కవచ్చని, సభపై పట్టును నిలుపుకోవడంలో రిపబ్లికన్లకు అవకాశాలు సన్నగిల్లాయని విశ్లేషించింది. అలాగే సీబీఎస్ న్యూస్ అంచనా ప్రకారం డెమొక్రాట్లకు 229 సీట్లు దక్కవచ్చు. అయితే, సెనేట్ విషయంలో మాత్రం ఫలితాలు హోరాహోరీగా ఉండవచ్చని, దీనిపై వివిధ సర్వే సంస్థలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయని తెలుస్తోంది.

ట్రంప్ పనితీరు పట్ల కేవలం 38.2 శాతం మంది మాత్రమే సానుకూలంగా ఉండగా, 60.2 శాతం మంది వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ అనుసరిస్తున్న విధానాల వల్ల తమ ఆర్థిక పరిస్థితి దిగజారిందని 57 శాతం మంది ఓటర్లు అభిప్రాయపడుతున్నారు. టారిఫ్ యుద్ధాల ప్రభావం, గాలన్ పెట్రోల్ ధర సుమారు 4.28కి, డీజిల్ ధర 6.28కి పెరగడం, 3.7 శాతం ద్రవ్యోల్బణం, ఇరాన్‌తో నెలకొన్న దౌత్యపరమైన వివాదాలు ఓటర్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు ట్రంప్ తన పట్టును కాపాడుకునేందుకు రిపబ్లికన్ల ప్రాబల్యం ఉన్న రాష్ట్రాలపైనే ప్రధానంగా దృష్టి సారించి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా సుమారు 3 కోట్ల మంది ఓటర్లు తమ ముందస్తు ఓటింగ్ హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో ప్రతినిధుల సభ లేదా సెనేట్‌లో గనుక రిపబ్లికన్ పార్టీ అధికారాన్ని కోల్పోతే, ట్రంప్ తన మిగిలిన రెండేళ్ల పదవీ కాలంలో తన విధానాలను, అజెండాను అమలు చేయడం అత్యంత క్లిష్టతరంగా మారుతుంది.

డేటా పరిరక్షణ చట్టం ప్రమాదకరం!

సుప్రీంలో వాదనలు వినిపించిన మీడియా సంస్థలు

కేంద్రానికి నోటీసులు జారీచేసిన సర్వోన్నత న్యాయస్థానం



న్యూఢిల్లీ, అక్టోబరు 27: డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం, 2023లోని కీలక నిబంధనలు జర్నలిజం మనుగడకే ప్రమాదకరంగా మారాయంటూ దేశంలోని ప్రముఖ మీడియా సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం, మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. జర్నలిజానికి ప్రత్యేక మినహాయింపులు ఇవ్వకపోవడం వల్ల దర్యాప్తు కథనాలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని, ప్రచురితమైన వార్తలను తొలగించాల్సి వస్తుందని, రహస్య సోర్సుల వివరాలు బయటపెట్టాల్సి వస్తుందని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని 21 ప్రముఖ మీడియా సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. కేంద్ర ప్రభుత్వ వాదన వినకుండా చట్టంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. పౌరుల హక్కులు, మీడియా హక్కుల మధ్య సమతుల్యత సాధించాల్సిన అవసరం ఉందని సీజేఐ సూర్యకాంత్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తదుపరి విచారణను నవంబర్ 17కు వాయిదా వేస్తూ, ఈ అంశంపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ఇతర పిటిషన్లతో కలిపి విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ వాదనలు వినిపిస్తూ, ఈ చట్టం "ముందస్తు సెన్సార్‌షిప్" విధించేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. "ఒక వార్తా కథనం రాయాలంటే, అందులోని వ్యక్తుల అనుమతి కోసం ఎదురుచూడాల్సి వస్తే, ఇక వార్త అనే భావనకే అర్థం ఉండదు. ఈ చట్టం వల్ల న్యూస్ రూమ్‌లు మూతపడతాయని ఆమె కోర్టుకు వివరించారు. గతంలో తీసుకొచ్చిన డేటా పరిరక్షణ చట్టాల ముసాయిదాలలో జర్నలిజానికి మినహాయింపులు ఉండేవని, కానీ తుది చట్టంలో వాటిని తొలగించారని ఆమె గుర్తు చేశారు. చట్టంలోని సెక్షన్ 7, 17(2), 18, 19, 27, 29, 36, 37, 44(3)లతో పాటు, డిపిడిపిరూల్స్, 2025లోని 16, 17, 23 నిబంధనలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19(1)లకు విరుద్ధంగా ఉన్నాయని, వాటిని రద్దు చేయాలని పిటిషనర్లు కోరారు. ఈ నిబంధనల ప్రకారం, ప్రచురితమైన కథనాలపై వ్యక్తులు అభ్యంతరం తెలిపితే, వారి డేటాను తొలగించాల్సి వస్తుంది. ఇది చారిత్రక రికార్డులను సైతం మార్చే ప్రమాదం ఉందని వారు వాదించారు. అలాగే, సెక్షన్ 36 ప్రకారం, ప్రభుత్వం ఎలాంటి జ్యుడీషియల్ పర్యవేక్షణ లేకుండా మీడియా సంస్థల నుంచి సమాచారం కోరవచ్చని, ఇది రహస్య సోర్సుల గోప్యతకు భంగం కలిగిస్తుందని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.250 కోట్ల వరకు జరిమానా విధించడం చిన్న, ప్రాంతీయ మీడియా సంస్థల మనుగడను ప్రశ్నార్థకం చేస్తుందని తెలిపారు. ఇదే చట్టంలోని సెక్షన్ 44(3) ద్వారా సమాచార హక్కు చట్టం, 2005లోని సెక్షన్ 8(1)ని సవరించడాన్ని కూడా పిటిషనర్లు సవాల్ చేశారు. ఈ సవరణ వల్ల, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కూడా వ్యక్తిగత సమాచారాన్ని పొందడం కష్టతరం అవుతుందని, ఇది పారదర్శకతకు గొడ్డలిపెట్టు అని వాదించారు. 2023లో ఆమోదం పొందిన ఈ చట్టానికి సంబంధించిన నిబంధనలను ప్రభుత్వం 2025లో నోటిఫై చేసింది. 2027 మే నుంచి పూర్తిస్థాయిలో అమలులోకి రానుంది.

కొత్త పెళ్లి కూతురే.. లోకోపైలట్‌గా విధులకు హాజరు



ముంబయి, అక్టోబరు 27: కొత్తగా పెళ్లయిన ఓ మహిళా లోకో పైలట్, సంప్రదాయబద్ధంగా చీరకట్టు, చేతి నిండా గాజులు, నుదుట సిందూరంతో విధులకు హాజరైన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వృత్తి పట్ల ఆమెకున్న నిబద్ధతను, అదే సమయంలో సంప్రదాయాన్ని గౌరవించిన తీరును నెటిజన్లు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. ఈ ఘటన ఆధునిక మహిళలు తమ వృత్తిపరమైన బాధ్యతలను, సాంస్కృతిక విలువల మధ్య ఎలా సమన్వయం చేసుకుంటున్నారో చెప్పడానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయబడిన ఈ వీడియోలో, సదరు మహిళా లోకో పైలట్ రైలు ఇంజిన్ క్యాబిన్‌లో ఉండి, తన విధులను నిర్వర్తిస్తూ కనిపించారు. కొత్త పెళ్లికూతురిగా తలపై కొంగు కప్పుకొని, చేతికి ఎర్ర గాజులు ధరించి ఆమె ఏకాగ్రతతో రైలును ఆపరేట్ చేస్తున్న దృశ్యాలు అందరి దృష్టిని ఆకర్షించాయి. వివాహం జరిగిన కొన్ని రోజులకే, రైలు నడపడం వంటి అత్యంత కీలకమైన, బాధ్యతాయుతమైన వృత్తికి ఎలాంటి ఆటంకం లేకుండా ఆమె హాజరుకావడం స్ఫూర్తిదాయకమని పలువురు కామెంట్లు చేస్తున్నారు. ఈ వీడియో చూసిన చాలా మంది, వివాహం అనేది మహిళల కెరీర్‌కు అడ్డుకట్ట కాదని, ముఖ్యంగా పురుషులతో సమానంగా రాణిస్తున్న క్లిష్టమైన రంగాలలో కూడా మహిళలు తమ వృత్తిని కొనసాగించవచ్చనే సందేశాన్ని ఈ ఘటన ఇచ్చిందని అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు సంప్రదాయాన్ని పాటిస్తూనే, మరోవైపు వృత్తి ధర్మాన్ని నెరవేర్చడం ఎందరో మహిళలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొంటున్నారు. ఈ వీడియో మరోవైపు రైల్వే శాఖలో సిబ్బందికి ఉండే డ్రెస్ కోడ్, భద్రతా నిబంధనలపై కూడా కొత్త చర్చకు దారితీసింది.

డిక్షనరీ డాట్‌కామ్ అత్యుత్తమ ఆంగ్లపదంగా 'మాక్సింగ్'




న్యూఢిల్లీ, అక్టోబరు 27: ఈ ఏడాది ఉత్తమ ఆంగ్లపదంగా డిక్షనరీ.కామ్ మ్యాక్సింగ్ పదాన్ని వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపిక చేసింది. అందం నుంచి ఆరోగ్యం వరకు, నిద్ర నుంచి పని వరకు ప్రతి విషయంలోనూ సాధ్యమైనంత మెరుగైన ఫలితాలు సాధించాలనే ఆలోచనను ఈ పదం ప్రతిబింబిస్తోంది. మ్యాక్సింగ్ అనే పదం మ్యాక్సిమైజింగ్ నుంచి వచ్చింది. అంటే ఒక పనిని లేదా జీవితంలోని ఓ అంశాన్ని సాధ్యమైనంత మెరుగుపరచుకోవడం. ఏదైనా విషయంలో అత్యుత్తమ స్థాయికి చేరుకోవడానికి ప్రయత్నించడాన్ని ఈ పదంతో సూచిస్తున్నారు. మొదట గేమింగ్ ప్రపంచంలో వినిపించిన ఈ పదం ఇప్పుడు సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. తమ రూపాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చుకోవడానికి ప్రయత్నించడాన్ని లుక్స్ మ్యాక్సింగ్ అంటారు. మంచి నిద్ర కోసం ప్రత్యేక అలవాట్లు పాటించడాన్ని స్లీప్ మ్యాక్సింగ్ అని, వ్యాయామం ద్వారా శారీరక దృఢత్వాన్ని పెంచుకోవడాన్ని జిమ్ మ్యాక్సింగ్ అని పిలుస్తున్నారు. ఉద్యోగాల్లో కృత్రిమ మేధ (ఏఐ) సాధనాలను వీలైనంత ఎక్కువగా ఉపయోగించడాన్ని టోకెన్ మ్యాక్సింగ్ అంటున్నారు. ఇలా ఏ అంశానికి సంబంధించిన పదానికైనా మ్యాక్సింగ్‌ను జోడించి కొత్త పదాలు సృష్టిస్తున్నారు. గేమింగ్ నుంచి సోషల్ మీడియా వరకు ఈపదం వెనుక గేమింగ్ ప్రపంచంతో సంబంధం ఉంది. వీడియో గేమ్‌లలో ఓ పాత్ర బలాలను పెంచి, బలహీనతలను తగ్గించడం ద్వారా విజయావకాశాలను మెరుగుపరుచుకునే వ్యూహాన్ని ˝మిన్‌మ్యాక్సింగ్˝ అంటారు. అక్కడి నుంచి మ్యాక్సింగ్ అనే వాడుక ఇతర రంగాలకూ విస్తరించింది. ముఖ్యంగా లుక్స్ మ్యాక్సింగ్ ద్వారా ఈ పదం ఆన్‌లైన్ చర్చల్లో బాగా ప్రాచుర్యం పొందింది. 2026లో ఈ పదం ఒక్క రూపానికే పరిమితం కాకుండా ఆరోగ్యం, ఉద్యోగం, జీవనశైలి, వినోదం వంటి అనేక రంగాల్లో వినిపిస్తోంది.

మెలానియా ట్రంప్ మధ్యవర్తిత్వంతో రష్యా - ఉక్రెయిన్ కాల్పుల విరమణ

కీవ్, అక్టోబరు 27: రష్యా-ఉక్రెయిన్ మధ్య నాలుగేళ్లకుపైగా జరుగుతోన్న యుద్ధంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా ఆక్రమణలో ఉన్న ఉక్రెయిన్‌కు చెందిన ఒలెష్కీ నగరంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి కాల్పుల విరమణ ప్రారంభమైంది. ఈ సీజ్‌ఫైర్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సతీమణి మెలానియా ట్రంప్ మధ్యవర్తిత్వం వహించడం గమనార్హం. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైంది. అప్పుడే ఉక్రెయిన్‌కు చెందిన ఖేర్సన్ ప్రాంతాన్ని రష్యా తన అధీనంలోకి తీసుకుంది. ఒలెష్కీ నగరం ఖేర్సన్ ప్రాంతంలోనిదే. యుద్ధం కారణంగా ఆ నగరం తీవ్ర మానవతా సంక్షోభం ఎదుర్కొంటోంది. సెప్టెంబరులో న్యూయార్క్‌లో జరిగిన ఐరాస సర్వసభ్య సమావేశాల సమయంలో ఒలెష్కీ పరిస్థితిపై ఇరు దేశాలకు చెందిన ప్రతినిధులతో మెలానియా సంప్రదింపులు జరిపారు. ఆ చర్చలు విజయవంతమైనట్లు గత వారం వైట్‌హౌస్ ప్రకటించింది. యుద్ధం కారణంగా ఒలెష్కీ నుంచి పలువురు ప్రజలు ఇతర ప్రాంతాలకు తరలిపోయారు. అక్కడ మిగిలిన వృద్ధులు, పిల్లలు ఆహారం, మంచినీరు, మందుల కొరతతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

హైసెక్యూరిటీ బ్లాక్‌కు లారెన్స్ బిష్ణోయ్ తరలింపు



గాంధీనగర్, అక్టోబరు 27: బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ పై కాల్పుల ఘటన నేపథ్యంలో ఆ దాడి వెనుక గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ఉన్నారనే వార్తలు జోరందుకున్నాయి. కొన్నేళ్లుగా అతడు జైల్లోనే ఉన్నప్పటికీ బయట అతడి అనుచరులు సాగిస్తున్న నేర కార్యకలాపాలు కలకలం సృష్టిస్తున్నాయి. ఈ క్రమంలో అతడిపై దాడి జరగవచ్చుననే అనుమానంతో అధికారులు అతడిని మరింత కట్టుదిట్టమైన భద్రత ఉండే జైలుగదికి మార్చినట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం లారెన్స్ బిష్ణోయ్ గుజరాత్‌లోని సబర్మతి సెంట్రల్ జైలులో ఉన్నాడు. మొన్నటివరకు 10సెల్డ్ బ్లాక్‌లో ఉన్న అతడిని ఇప్పుడు హైసెక్యూరిటీ ఉండే 200 బ్లాక్ కు మార్చినట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ బ్లాక్‌ను మొత్తం నాలుగు భాగాలుగా విభజించారు. ఒక్కో సెక్షన్‌లో 50 మంది ఖైదీల చొప్పున మొత్తం 200 మంది ఉంటారు. ఒక్కో సెల్ 7.5 11 అడుగుల పరిమాణంలో ఉంటుంది. ఖైదీల మధ్య ఎలాంటి సంభాషణ జరగకుండా ఇక్కడ నిరంతర నిఘా పెట్టారు. 2008 బాంబు పేలుళ్ల దోషులు కూడా ఇదే బ్లాక్‌లో శిక్ష అనుభవిస్తున్నారు. ఇప్పుడు లారెన్స్ బిష్ణోయ్‌ను కూడా 200 బ్లాక్‌లోని గదికి మార్చారు. పంజాబ్‌కు చెందిన లారెన్స్ బిష్ణోయ్ 201012 నుంచి నేర కార్యకలాపాలకు పాల్పడుతున్నాడు.

హత్యలు, దోపిడీ వంటి నేరాల్లో అతడిపై పలు కేసులు నమోదయ్యాయి. 2014లో అక్రమాయుధాల కేసులో అరెస్టయ్యాడు. పంజాబ్‌లోని కొన్ని జైళ్లతోపాటు ఢిల్లీలోని తిహార్ జైలులో అతడిని కొంతకాలం నిర్బంధించారు. అయితే జైల్లో నుంచే అతడు నేర కార్యకలాపాలను సాగించాడు. జైలు ఫోన్ నుంచే దోపిడీ కోసం బెదిరింపు ఫోన్ కాల్స్ చేయడం, తన నెట్‌వర్క్‌కు ఆడియో, వీడియో సందేశాలు పంపడం లాంటివి చేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఓసారి కస్టడీలో ఉండగానే అతడు మీడియాకు ఇంటర్వ్యూ ఇవ్వడం కూడా వివాదాస్పదమైంది. ఆ తర్వాత మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన కేసులో లారెన్స్ బిష్ణోయ్‌ను గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ 2023లో అదుపులోకి తీసుకుని సబర్మతి సెంట్రల్ జైలుకు తరలించింది. అప్పటి నుంచి ఇదే జైల్లో ఉన్నాడు.

రిజర్వాయరు తనిఖీచేసిన సిఎం విజయ్



చెన్నై, అక్టోబరు 27: తమిళనాడులో ఈశాన్య రుతుపవనాలు, తుపాను హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి విజయ్ క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. 2015 నాటి చెన్నై వరద విపత్తు పునరావృతం కాకుండా చూసేందుకు ఆయన చెన్నై శివారులోని చెంబరంబాక్కం రిజర్వాయర్‌ను స్వయంగా తనిఖీ చేశారు. నీటిమట్టం, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రిజర్వాయర్‌ను 24 గంటలూ పర్యవేక్షించాలని, నీటి విడుదల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని విజయ్ ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, వరద ముంపునకు తావివ్వకుండా నీటిని దశలవారీగా నియంత్రిత పద్ధతిలో విడుదల చేయాలని సూచించారు. నీటిని విడుదల చేసే ముందు ప్రజలకు సమాచారం ఇవ్వడంతో పాటు, పోలీసు, రెవెన్యూ, చెన్నై నగర పాలక సంస్థలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. 2015లో భారీ వర్షాల సమయంలో చెంబరంబాక్కం నుంచి అకస్మాత్తుగా నీటిని విడుదల చేయడం వల్లే చెన్నై నగరం ఘోర విపత్తును చవిచూసిందన్న విమర్శలున్నాయి. ఆ ఘటనలో 400 మందికి పైగా మరణించగా, లక్షలాది ఇళ్లు నీట మునిగాయి. ఈ నేపథ్యంలో సీఎం విజయ్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ విషయంపై తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రతినిధి ఎం.సత్యకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2015లో నాటి ముఖ్యమంత్రి జయలలిత అనుమతి కోసం అధికారులు ఆలస్యం చేయడం వల్లే విపత్తు సంభవించింది. అలాంటిది మళ్లీ జరగకూడదు. ముఖ్యమంత్రే స్వయంగా రిజర్వాయర్‌కు రావడం అధికారులకు బలమైన సందేశం. మాకు అధికారులపై నమ్మకం లేదు, ఆటలు ఆడవద్దని హెచ్చరిస్తున్నామని ఆయన అన్నారు.

సంక్షిప్త వార్తలు

థేని జిల్లా సబ్ జైలునుంచి 17 మంది ఖైదీల పరార్



చెన్నై, అక్టోబరు 27: తమిళనాడులోని తేని జిల్లా సబ్ జైలు నుంచి 17 మంది ఖైదీలు పరారయ్యారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో ఆండిపట్టి సమీపంలోని తెక్కంపట్టి జైలులో ఈ ఘటన చోటుచేసుకుంది. జైలు సిబ్బందిపై దాడి చేసి ఖైదీలు తప్పించుకున్నారు. ఈ పరిణామంతో రాష్ట్రవ్యాప్తంగా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. తేని నుంచి దిండిగల్ వరకు హైఅలర్ట్ ప్రకటించి.. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. తెక్కంపట్టి జైలులో ఉన్న ఖైదీలు అనారోగ్యంగా ఉందని చెప్పి జైలు సిబ్బందిని సెల్లోకి రప్పించారు. ఆపై సిబ్బందిపై దాడి చేసి అక్కడి నుంచి తప్పించుకున్నట్లు పోలీసులు తెలిపారు.

రాహుల్ సోషల్‌మీడియాలో శివుడి విభూతి తిలకం పిక్ పోస్ట్


న్యూఢిల్లీ, అక్టోబరు 27: శివుడి విభూతి తిలకం పిక్‌ను రాహుల్ గాంధీ తన ఎక్స్‌లో ఇవాళ పోస్టు చేశారు. దానికి సత్యం శివం సుందరం అని రాశారు. అయితే 2018 నాటి పరువునష్టం కేసులో సుల్తాన్‌పూర్ కోర్టు అతన్ని నిర్దోషిగా సోమవారం తేల్చిన విషయం తెలిసిందే. త్రిపుండ్రం తిలకం పోస్టు వెనుక ఉన్న మర్మం స్పష్టంగా తెలియడంలేదు. కానీ ఓటర్ల జాబితా సవరణ సర్ ప్రక్రియకు చెందిన పిల్‌ను సుప్రీంకోర్టు విచారణ చేపట్టనున్న నేపథ్యంలో ఆయన పోస్టు చేసి ఉంటారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

దేశంలోనే అతిపెద్ద జిల్లా కచ్



అహ్మదాబాద్, అక్టోబరు 27: దేశంలో భౌగోళికంగా అతిపెద్ద జిల్లాగా గుజరాత్ రాష్ట్రంలోని కచ్ జిల్లా నమోదయింది. సుమారు 45,674 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఇది దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. దీని విస్తీర్ణం ఎంత పెద్దదంటే, మన దేశ రాజధాని ఢిల్లీ కంటే ఏకంగా 31 రెట్లు అధికం. అంతేకాదు హర్యానా, కేరళ, గోవా వంటి రాష్ట్రాల మొత్తం భూభాగం కంటే కూడా కచ్ జిల్లా పెద్దది కావడం విశేషం. కచ్ జిల్లా గుజరాత్ మొత్తం విస్తీర్ణంలో దాదాపు 23 శాతం ఆక్రమించింది. కేవలం మన దేశంలోని రాష్ట్రాలతోనే కాదు, కొన్ని దేశాలతో పోల్చినా ఇది పెద్దదిగా నిలుస్తుంది.

న్యూయార్క్ అటార్నిజనరల్ పదవికి భారత సంతతి మహిళ పోటీ



న్యూయార్కు, అక్టోబరు 27: అమెరికా ఎన్నికల్లో భారత సంతతికి చెందిన మరో మహిళ కీలక పదవికి పోటీ పడుతున్నారు. న్యూయార్క్ అటార్నీ జనరల్ (ఏజీ) పదవికి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా సరిత కోమటిరెడ్డి బరిలోకి దిగారు. నవంబర్ 3న జరగనున్న ఈ ఎన్నికల్లో ఆమె ప్రస్తుత డెమోక్రటిక్ ఏజీ లెటిటియా జేమ్స్‌కు గట్టి సవాలు విసురుతున్నారు. భారతీయ వలసదారుల కుమార్తె అయిన సరిత, తనను తాను క్రైమ్ ఫైటర్‌గా అభివర్ణించుకుంటూ ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గతంలో ఫెడరల్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసిన అనుభవంతో, న్యూయార్క్‌లో నేరాలను అరికట్టడమే తన ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.

నరమాంసభక్షకుడిని అరెస్టు చేసిన ఉగాండా భద్రతా దళాలు!

కంపాలా, అక్టోబరు 27: ఉగాండా దేశాన్ని తీవ్ర భయాందోళనలకు గురిచేసిన ఓ నరమాంస భక్షకుడిని, సీరియల్ కిల్లర్‌ను భద్రతా దళాలు అరెస్ట్ చేశాయి. గత 15 ఏళ్లలో ఏకంగా 38 మందిని అత్యంత కిరాతకంగా చంపి, వారి మాంసాన్ని తిన్నాడనే భయంకరమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ వ్యక్తిని ముజురిజి మోసెస్ అని గుర్తించారు. మసాకా, ఇబందా, కాజో జిల్లాల్లో 2010 నుంచి 2025 మధ్య కాలంలో ఈ ఘాతుకాలకు పాల్పడినట్లు అధికారులు తెలిపారు. ఈ అరెస్ట్‌ను ఉగాండా చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్, జనరల్ ముహూజి కైనెరుగబా ఎక్స్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు.

నెతన్యాహును గెలిపించాలంటూ ట్రంప్ సోషల్‌మీడియా ప్రచారం

టెల్‌అవీవ్, అక్టోబరు 27: ఇజ్రాయెల్ఎ న్నికల్లో బెంజమిన్ నెతన్యాహుకు ఓటువేసి గెలిపించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్‌మీడియాలోప్రచారం ముమ్మరంగా చేసారు. అలాగే నెతన్యాహు కూడా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనకు మద్దతు ప్రకటించడాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, తాను తిరిగి అధికారంలోకి వస్తే ఇరాన్‌పై సైనిక చర్యను పునఃప్రారంభించే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. ట్రంప్ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, "మనం ప్రారంభించిన పనిని పూర్తి చేయాలి ప్రధానిగా బీబీ నెతన్యాహుకే ఓటు వేయండి అని పిలుపునిచ్చారు.

బిసి సంక్షేమ శాఖ పథకాల అమలులో పారదర్శకత, వేగం పెంచాలి



మంగళవారం సచివాలయంలో బిసి సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త: సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆ శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. దీని పరిధిలో అమలవుతున్న పథకాలు, గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఆత్మగౌరవ భవనాలు, నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ, బీసీ వర్గాలకు స్వయం ఉపాధి అవకాశాల కల్పన తదితర అంశాలపై అధికా రులతో సమీ క్షించారు. మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యా నిధి పథకం అమలుపై మంత్రి సమీక్షించారు. ఈ పథకం ద్వారా అర్హులైన మెరిట్ విద్యార్థులకు పూర్తి పారదర్శకతతో పెండింగ్ లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికా రులను ఆదేశించారు. 38 ఆత్మగౌరవ భవనాలకు సంబంధించిన జీవోల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు, బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇంటింటా కుట్టు మిషన్ల పథకం అమలుపై మంత్రి సమీక్షించారు. ఈ పథకానికి మహిళల నుంచి మంచి స్పందన లభించిందని, సుమారు 4.80 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. డిసెంబరు 9న లబ్ధిదారులకు కుట్టుమిషన్లు అందించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, టెండర్ ప్రక్రియతో పాటు ఇతర అవసరమైన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద వచ్చిన దరఖాస్తుల వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందే వారిలో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించే అంశంపై ప్రభుత్వం తో చర్చిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 327 గురుకుల పాఠశాలల్లో కేవలం 26 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా, మిగి లిన 301 పాఠశాలలు ప్రైవేట్ భవనాల్లో కొనసాగు తున్నాయని పేర్కొన్నారు. 37 గురుకులాలకు సొంత స్థలాలు ఉన్నందున వాటిలో భవనాల నిర్మాణానికి అను మతులు, నిధులు మంజూరు చేసే అంశంపై ప్రభుత్వం తో చర్చిస్తామని తెలిపారు. గురుకులాలకు కూడా సొంత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. నవంబర్ మొదటి వారంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రెటరీ, కమిషనర్, జిల్లా కలెక్టర్లు, ఆర్సీవోలు, ప్రిన్సిపాళ్లతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గురుకులాల సమస్యల పరిష్కారంపై సమీక్షించనున్నట్లు తెలిపారు. బీసీ స్టడీ సర్కిళ్లలో సంస్కరణలు చేపట్టి నిరుద్యోగులకు ఉద్యోగాలే లక్ష్యంగా నాణ్యమైన శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ అంశంపై ఐదుగురు సభ్యుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా సమర్థవంతమైన డైరెక్టర్ల నియామకానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయాదేవి, మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల కార్యదర్శి సైదులు, అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, పద్మ, మామిడి హరికృష్ణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డిజిపి కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన డిజిపి సివి ఆనంద్

డిజిపి కార్యాలయంలో రక్తదాన శిబిరం

హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా డిజిపి కార్యాలయంలో మంగళవారం నా డు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని డిజిపి సి.వి. ఆనంద్ ప్రారంభించారు. అక్టోబరు 21 నుంచి 31 వరకు పోలీసు శాఖ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తుండడం తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటి వరకు పలు కార్యక్రమాలు చేబట్టగా మంగళవారం నా డు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో డిజిపి సహా ఉన్నతాధికారులు, ఇతర అధికారులు, కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పా ల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి ఆనంద్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం నిరంతరం శ్రమించే పోలీసులు అత్యవసర స మయాల్లో రక్తదానం ద్వారా కూడా ప్రాణదాతలుగా నిలుస్తున్నారని తెలిపారు. ప్రజా భద్రతతో పాటు ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం పోలీసుల సామాజిక బాధ్యతకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల డిజి మహేశ్ భగవత్, అదనపు డిజి అకున్ సబర్వాల్, మల్టీ జోన్ 2, ఐజి షానవాజ్ ఖాసీం, రెడ్‌క్రాస్ సొసైటీ డైరెక్టర్ పిచ్చిరెడ్డితో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నల్గొండ-వరంగల్-ఖమ్మం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కొల్లి సత్యనారాయణ

హైదరాబాద్, అక్టోబరు 27,ప్రభాతవార్త: నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల్లో పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్)అభ్యర్థిగా ప్రముఖ న్యాయవాది కొల్లి సత్యనారాయణ పోటీ చేయనున్నారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు ఆయనకు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ప్రజాసంఘాల నేతలు మాట్లాడుతూ గతంలో పిడిఎఫ్ నుంచి గెలుపొందిన చుక్కారామయ్య, ప్రొఫెసర్ నాగేశ్వర్ లాగానే కొల్లి సత్యనారాయణ కూడా ప్రజాసమస్యలపై గొంతెత్తి పోరాటం చేస్తారన్న నమ్మకం ఉందని కావున అయన్ను ఎంఎల్‌సి అభ్యర్థిగా ప్రకటిస్తున్నామని తెలిపారు. పట్టభద్రులు కొల్లి సత్యనారాయణకు మొదటిప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. కాగా కొల్లి సత్యనారాయణ ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన వ్యక్తి. ఈయన 42ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. ప్రముఖ సీనియర్ న్యాయవాది బోడపూడి రాధాకృష్ణ శిష్యుడైన ఈయన రాజ్యసభ మాజీ సభ్యుడు వై.రాధాకృష్ణమూర్తి అన్న కుమారుడు. గతంలో మూడుసార్లు స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యుడిగా పనిచేశారు.ప్రస్తుతం అఖిల భారత న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు.కాగా ఇటీవల కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు సైతం సిసిఎం కార్యాలయానికి వెళ్ళి ఎంఎల్‌సి ఎన్నికల్లో మద్దతివ్వాలని కోరగా అప్పుడు సానుకూలంగా స్పందించి ఇప్పుడు పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతు ప్రకటించడం కొసమెరుపు.

మళ్లీ సమ్మెకు దిగిన ఉస్మానియా జూడాలు

హైదరాబాద్ (అఫ్జల్‌గంజ్), అక్టోబరు 27, ప్రభాతవార్త: ప్రభుత్వ ఆసుపత్రుల్లో నెలకొన్న మౌలిక సదుపాయాల కొరత,అవసరమైన వైద్య పరికరాలు, మందులు, ఇతర కీలక వైద్య వనరుల లేమి కారణంగా రోగులకు వైద్యులు అందించే వైద్య సేవలల్లో ఇబ్బందులు ఎదురువుతున్నాయి.దీంతో మంగళవారం నుంచి ఉస్మానియా ఆసుపత్రిలో జూనియర్ వైద్యులు సమ్మెకు దిగారు.అదే సమయంలో రెసిడెంట్ వైద్యుల క్లినికల్, శిక్షణ, విద్యాభ్యాసం, విధులు నిర్వహించే పరిస్థితులపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుంది. ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులల్లో 10 రోజులల్లో సమస్యలను పరిష్కరిస్తామని హామి ఇవ్వడంతో మొదట దశ సమ్మెను విరమించిన విషయం తెలిసిందే. 15 రోజులు కావస్తున్నప్పటికి జూనియర్ వైద్యు లకు ఇచ్చిన హామిలను అమలు చేయక పోతే ఆందోళనను కొనసాగించ వచ్చున్నారు.క్షేత్రస్థాయిలో ఆశించిన మార్పులు కనిపించడం లేదని, రోగులకు వైద్య సేవలకు,రెసిడెంట్ వైద్యుల విద్యాభ్యాసం, క్లినికల్ శిక్షణకు సంబంధించిన ప్రధాన సమస్యలు ఇంకా అసంపూర్తిగా మిగిలి పోయాయని, ఈ పరిస్థితుల్లో, సమస్యల పరిష్కారంలో స్పష్టమైన విధానం కనిపించక పోలేదని జూనియర్ వైద్యులు వాపోయారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులపై మాకు ఇంకా నమ్మకం ఉందని, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఇచ్చిన హామీలను ఆచరణలోకి తీసుకువస్తాడని నమ్మకంతో ఉన్నట్లు జూడాలు తెలిపారు. ఉస్మానియా మెడకల్ కళాశాల, అనుబంధంగా ఉన్న ఆసుపత్రుల్లో స్పష్టమైన మార్పులు, మెరుగైన వైద్య సేవలను అందించ డానికి మందులను, వైద్యపరికరాలను అందుబాటులో ఉంచాలన్నారు. లేనిపక్షంలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలంటే వసతులను కల్పించాలని, లేనిపక్షంలో తమ నిరసన ఉధృతం చేస్తామని తెలిపారు.



మస్కట్‌లో ఆర్మూర్ వాసి ఆచూకీ కనుగొనాలంటూ సిఎం ప్రజావాణి స్టేట్ ఇన్‌చార్జి గద్వాల విజయలక్ష్మికి విజ్ఞప్తి చేశాక శాలువాతో సన్మానించిన బాధిత కుటుంబసభ్యులు.

ఆర్మూరు వాసి ఆచూకీకి చర్యలు తీసుకోండి

సిఎం ప్రజావాణి స్టేట్ ఇన్‌చార్జి విజయలక్ష్మికి వినతి

హైదరాబాద్ (బేగంపేట), అక్టోబరు 27, ప్రభాతవార్త: మస్కట్‌లో ఆర్మూర్ వాసి అదృశ్యం కావడంపై ఆయన ఆచూకీ కనుగొనాలని సిఎం ప్రజా వాణిలో బాధితుని కుటుంబసభ్యులు విజ్ఞప్తి చేసారు. జిఎడి ద్వారా ఓమన్ దేశ ఎంబసీకి లేఖ రాసి బాధిత కుటుంబానికి సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి ౹ బాసటగా నిలిచారు. ఓమన్ దేశం మస్కట్ సిటీలో రెండు నెలల కిందట అదృశ్యమైన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణానికి చెందిన చెందిన ఆకుల రాజ్ కుమార్ అనే వ్యక్తి ఆచూకీ కనుగొని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మంగళవారం సీఎం ప్రజావాణికి బాధిత కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేసారు. ఈ సమస్యపై రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్‌పర్సన్, సీఎం ప్రజావాణి స్టేట్ ఇన్‌చార్జ్ గద్వాల్ విజయలక్ష్మి ౹ స్పందించారు.ఈ విషయంపై జీఏడీ ద్వారా ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయానికి లేఖ పంపించి, అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ కనుగొనేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.బాధిత కుటుంబ సభ్యులకు,మిస్సింగ్ అయిన వ్యక్తి భార్య స్వాతికి ధైర్యం చెప్పి, అండగా ఉంటామని గద్వాల్ విజయలక్ష్మి ౹ భరోసా ఇచ్చారు. ఆర్మూర్ కు చెందిన ఉజ్వల ట్రస్ట్ చైర్మన్ మీనీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో మున్నూరు కాపు సంఘం నాయకులు తేలు పెద్ద ఒడ్డెన్న, నడ్పి ఒడ్డెన్న సీఎం ప్రజావాణికి వచ్చారు.వారి తో పాటు ఈ కార్యక్రమంలో ఎన్.ఆర్.ఐ. సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి కూడా పాల్గొన్నారు.

సిఎం ప్రజావాణిలో 140 దరఖాస్తులు

మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్ లో మంగళవారం నిర్వహించిన 264వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో 140 దరఖాస్తులు అందాయి.సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి ౹ దరఖాస్తులు స్వీకరించి ఎండార్స్ మెంట్స్ చేసి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు.వాటిలో రెవెన్యూ శాఖకు 29 దరఖాస్తులు, మున్సిపల్ శాఖకు 20, హోం శాఖకు 17, ఇతర శాఖలకు 74 దరఖాస్తులు అందాయి. ఈ ప్రజావాణి కార్యక్రమంలో స్టేట్‌నోడల్ అధికారి కే. విద్యాసాగర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏ.సీ.పీ. ఉమేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో 'క్లైమెట్ ఛేంజ్'పై ప్రత్యేక సదస్సు

ఎల్‌నినో ప్రభావం.. ప్రపంచ దేశాల అనుభవాలపై చర్చ

హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త: డిసెంబరు 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026. దేశ విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వివిధ రంగాల నిపుణులు హాజరయ్యే అంతర్జాతీయ సదస్సు ఈసారి ఇన్వెస్ట్ తెలంగాణ ప్రధాన థీమ్‌తో పాటు 'క్లయిమేట్ ఛేంజ్‌ను ప్రత్యేక సబ్ థీమ్‌గా చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. వాతావరణ మార్పులపై ఈ ప్రత్యేక సెమినార్ నిర్వహించాలని, వాతావరణ శాఖ నిపుణులతో పాటు వివిధ యూనివర్సిటీలు, సంబంధిత రంగాల్లో పని చేసే నిపుణులను సదస్సుకు ఆహ్వానించాలని సూచన. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో తలెత్తుతున్న సవాళ్ల, వాటిని ఎదుర్కొనేందుకు వివిధ దేశాలు చేపడుతున్న చర్యలు, అనుసరిస్తున్న విధానాలపై ఈ వేదికగా ప్రత్యేక చర్చలు.
ప్రధానంగా వర్షాభావం, నీటి కొరత, వ్యవసాయ సంక్షోభం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, విద్యుత్ అవసరాలు, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై దృష్టి. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే చేపట్టిన ముందస్తు చర్యలను ప్రపంచ వేదికపై వివరించే అవకాశం. ఇతర దేశాల్లో విజయవంతమైన విధానాలు, ఆధునిక సాంకేతిక పరిష్కారాలు, అంతర్జాతీయ అనుభవాలను అధ్యయనం చేసేలా సెమినార్ నిర్వహించాలని సీఎం సూచన. పెట్టుబడుల ఆక ర్షణతో పాటు పర్యావరణ అనుకూల పరిశ్రమలు, గ్రీన్ ఎనర్జీ, సుస్థిర అభివృద్ధి అంశాలకు సదస్సు లో ప్రాధాన్యం. గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా రక్షా ఎక్స్‌పో-2026, ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్టార్టప్‌ల ప్రదర్శనలు, పారిశ్రామిక విధానాల ఆవిష్కరణలు, పెట్టుబడి భాగస్వామ్య ఒప్పందాలకు వేదిక. ఇప్పటికే హైదరాబాద్‌లో రక్షా ఎక్స్‌పో కర్టెన్ రైజర్ నిర్వహణ. అక్టోబర్ 29న న్యూఢిల్లీలో గ్లోబల్ సమ్మిట్ ప్రచార కార్యక్రమం. జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థలను తెలంగాణకు ఆహ్వానించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొందించిది.

సీడ్ గార్డెన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త: దేశంలోనే మొట్టమొదటిగా తెలంగాణలో ఏర్పాటు చేయతలపెట్టిన సీడ్ గార్డెన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. హైదరాబాద్‌లో మంగళవారం పామాయిల్ కంపెనీ ప్రతినిధులు మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు, రైతులకు నాణ్యమైన మొక్కలు అందించేలా పనిచేయాలన్నారు. ఇప్పటికే ఆయిల్‌పామ్ సాగు చేపడుతున్న జిల్లాల్లో లక్ష్యాలను రెట్టింపు చేసి వాటిని సాధించేలా పనిచేయాలని సూచించారు.
ఆయిల్‌పామ్ సాగు విస్తరణతో పాటు, రైతులకు నాణ్యమైన మొక్కలను అందించడం ముఖ్యమన్నారు. అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన, షార్ట్ వెరైటీ మొక్కలను అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగు అభివృద్ధికి నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి కీలకమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రభుత్వం, కంపెనీలు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు మరింత ప్రయోజనం చేకూర్చాలని తెలిపారు. అంతకుముందు ప్రతినిధులు ఖమ్మం జిల్లాలోని సమీకృత ఆయిల్‌పామ్ యూనిట్‌కు పారిశ్రామికవేత్తల ప్రోత్సాహక విధానం కింద లభించే ప్రయోజనాలకు అదనంగా ప్రత్యేక ప్రోత్సాహక ప్యాకేజీ మంజూరుకు చొరవ తీసుకోవాలని కోరారు. అలాగే యూనిట్‌కు అవసరమైన రహదారి విస్తరణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీడ్ గార్డెన్‌ను ఏర్పాటు చేసేందుకు అదనంగా 35 ఎకరాల భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో ఆయిల్ ఫెడ్ ఎండి యాస్మిన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

దేశానికి ఉపన్యాసాలిచ్చే ముందు రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని చదవాలి : బూర నర్సయ్యగౌడ్

హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త: రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకుని ప్రజల ముందు ప్రదర్శించడం వల్ల రాజ్యాంగంపై అవగాహన ఉన్నట్లు కాదని, దాని నిబంధనలను అర్థం చేసుకుని గౌరవించినప్పుడే రాజ్యాంగ పరిరక్షకులుగా గుర్తింపు లభిస్తుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డా. బూర నర్సయ్యగౌడ్ అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని రాహుల్ గాంధీ కోరడం ఆయనకు రాజ్యాంగ ప్రక్రియపై ఉన్న అవగాహనను ప్రశ్నించేలా ఉందని విమర్శించారు.
రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వ్యక్తులపై చర్యలు తీసుకోవడానికి నిర్దిష్టమైన విధానాలు ఉంటాయని, వాటిని పక్కనపెట్టి రాజకీయ డిమాండ్లు చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(5) ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించే విషయంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించడానికి వర్తించే విధానాన్ని అనుసరించాల్సి ఉంటుందని ఆయన వివరించారు. దీనికి సంబంధించిన ప్రక్రియను ఆర్టికల్ 124(4) నిర్దేశిస్తుందని తెలిపారు. నిరూపిత దుర్వ్యవహారం లేదా అసమర్థత వంటి రాజ్యాంగబద్ధమైన కారణాలు ఉండాలి. పార్లమెంట్ ఉభయ సభల్లో నిర్దేశిత ప్రత్యేక మెజారిటీతో తీర్మానం ఆమోదం పొందిన అనంతరమే రాష్ట్రపతి తొలగింపు ఉత్తర్వులు జారీ చేయగలరని స్పష్టం చేశారు.
ప్రధానమంత్రి అయినా, ప్రతిపక్ష నేత అయినా, ఏ రాజకీయ పార్టీ అయినా



మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపి డా. బూర నర్సయ్యగౌడ్

తమ వ్యక్తిగత లేదా రాజకీయ కోరికల మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించలేరని డా. బూర నర్సయ్య గౌడ్ అన్నారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కాపాడటానికే రాజ్యాంగం ఇటువంటి రక్షణలను కల్పించిందని వివరించారు. రాహుల్‌గాంధీకి ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై నిజంగా అభ్యంతరాలు ఉంటే, నిర్దిష్టమైన ఆరోపణలు, విశ్వసనీయమైన ఆధారాలతో సంబంధిత రాజ్యాంగబద్ధమైన ప్రక్రియను అనుసరించాలని సూచించారు. తీవ్రమైన ఆరోపణలు చేసేటప్పుడు ఆధారాలు చూపించాలి తప్ప, రాజకీయ నాటకీయతకు ప్రాధాన్యత ఇవ్వకూడదని హితవు పలికారు.

వరి విత్తనాల విక్రయానికి సెల్ఫ్ డిక్లరేషన్ లేదు

వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి

హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త : రబీ సీజనుకు సంబంధించి విత్తనాలు కొనుగోలు విషయంలో ఎలాంటి సెల్ఫ్ డిక్లరేషన్ అవసరం లేదని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి గోపి స్పష్టం చేశారు. ఈ విషయమై వరి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వరి కొనుగోలులో సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలనే ఆంక్షలు అమలవుతున్నాయని వచ్చిన వార్తలపై మంగళవారం ఆయన ఒక ప్రకటనలో వివరణ ఇస్తూ రైతుల నుంచి స్వయం అంగీకార పత్రం (సెల్ఫ్ డిక్లరేషన్) తీసుకున్న తర్వాతే వరి విత్తనాలు విక్రయించాలని విత్తన డీలర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు వార్తలో పేర్కొనడం పూర్తిగా అవాస్తవమన్నారు. ఇలాంటి ఉత్తర్వులు గానీ, సూచనలు గానీ శాఖ జారీ చేయలేదని తెలిపారు. ఎవరైనా డీలర్లు సెల్ఫ్ డిక్లరేషన్ కోసం ఒత్తిడి చేసినా, నకిలీ విత్తనాలు అమ్మిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదే సమయంలో నాణ్యత లేని విత్తనాలు విక్రయించినా సంబంధిత మండల, జిల్లా వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.
అటువంటి డీలర్లపై విత్తన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతులు యాసంగిలో వరి సాగును తగ్గించుకుంటే మంచిదన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో, యాసంగిలో నీటి లభ్యత, భూగర్భ జలమట్టాలు, విద్యుత్ డిమాండ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రైతులు తక్కువ నీటితో, స్వల్ప కాల పరిమితి గల, పండే ప్రత్యామ్నాయ పంటలను పండించాలని సూచించారు.
రైతులకు అవసరమైన అన్ని రకాల పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయ పంటల విత్తనాలను సరిపడా అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

ఎల్‌నినో ప్రత్యామ్నాయ ప్రణాళిక

రైతు సంఘాలకు కస్టమ్ హైరింగ్ సెంటర్లు

వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్

హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త : ఎల్ నినో, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యమ్నాయ ప్రణాళిను రూపొందిస్తున్నట్లు వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్ తెలిపారు. రైతు నేస్తం కార్యక్రమ సందర్భంగా మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యమ్నాయ పంటల సాగు, నేల సంరక్షణ తదితర అశాల అమలు సంబంధించి కాంటింజెన్సీ ప్లాన్‌లో పొందుపరచినట్లు తెలిపారు. పంట పండించడం ఒక ఎత్తయితే, పండిన పంటను మంచి ధరకు అమ్ముకోవడం మరో ఎత్తన్నారు. రైతులంతా కలిసి రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడినా, మహిళా స్వయం సహాయక సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సభ్యులుగా చేరినా ఈ ఇబ్బందులు తగ్గుతాయన్నారు. సంఘటితంగా ఉంటే పంటకు డిమాండ్ పెరగడంతో పాటు, మంచి ధర కూడా దక్కుతుందని తెలిపారు. ఈ సంఘాల్లోని రైతులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి, చిన్న, సన్నకారు రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష ౹ ంగా వ్యవసాయ శాఖ పనిచేస్తోందన్నారు. పథకాల లబ్ధిదారుల ఎంపికలో క్షేత్రస్థాయి అధికారులు ఈ సంఘాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని ఆయన సూచించారు. అలాగే వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. చిన్న, సన్నకారు రైతులు యంత్రాలను కొనుక్కోనవసరం లేకుండా హైరింగ్ సెంటర్ల ద్వారా అద్దెకు తీసుకోవడంతో ఖర్చు తగ్గడంతో పాటు, ఆ సంఘాలకు ఆదాయం వస్తుందని తెలిపారు. వ్యవసాయ శాఖ డైరక్టర్ డాక్టర్ బి. గోపి మాట్లాడుతూ భూమి అభివృద్ధి, విత్తనం-నాటడం, అంతరకృషి, సస్యరక్షణ, కోత-నూర్పిడి, కోత అనంతర పనులు, పంట అవశేషాల నిర్వహణ అనే ఏడు విభాగాల్లో 37 రకాల యంత్రాలను హైరింగ్ సెంటర్లలో అందుబాటులో ఉంటాయన్నారు. యాసంగికి సాగుకు సంబంధించి నవంబర్ మొదటి పక్షం వరకు పప్పుధాన్యాలు, నూనెగింజలు విత్తుకోవచ్చన్నారు. నవంబర్ 16 తర్వాత పెసర, మినుము, జొన్న, పొద్దుతిరుగుడు, వేరుశనగ మాత్రమే అనుకూలమని స్పష్టం చేశారు. నీటి లభ్యతను బట్టి పంటను ఎంచుకోవాలని చెప్పారు. కుసుమ, శనగ, పెసర, మినుము తక్కువ నీటితో పండుతాయని, జొన్న, పొద్దుతిరుగుడు, వేరుశనగకు తగినంత నీరు అవసరమని తెలిపారు. పూత, కాయ నిండే దశల్లో తప్పనిసరిగా నీరు అందించాలని, సిఫారసు చేసిన రకాలనే అధికారిక డీలర్ల నుంచి కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు సంఘాలుగా ఏర్పడి, ప్రభుత్వ పథకాలను, మార్కెటింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పసుపు క్వింటాకు రూ.19వేలు

హైదరాబాద్,అక్టోబరు27,ప్రభాతవార్త: మహబుబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో పసుపునకు రికార్డుస్థాయిలో ధర నమోదైంది. ఈ మార్కెట్‌కు కాడిరకం పసుపును ఏడుగురు రైతులు 69 బస్తాల్లో, గోళరకం ముగ్గురు రైతులు 30 బస్తాల్లో తీసుకువచ్చారు.
ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈనామ్) విధానంలోని ఈవేలంలో కాడిరకం పసుపు క్వింటాకు గరిష్ఠంగా రూ.19,253, కనిష్ఠంగా రూ.15,589, సగటున రూ.19,252, గోళరకం గరిష్ఠంగా రూ.18,566, కనిష్ఠంగా రూ.8,506, సగటున రూ.17,469 ధరలతో వ్యాపారులు ఖరీదులు చేశారు. ఈ మార్కెట్‌కు రెండురోజుల సెలవుల కంటే ముందు ఈ నెల 22న పసుపు విక్రయానికి రాగా క్వింటాకు రూ.13,319 వరకే ధర నమోదైంది. మార్కెట్‌కు వచ్చిన పసుపు నాణ్యత బాగుండడంతో క్రితం మార్కెట్‌తో పోలిస్తే ఒకేసారి క్వింటాకు రూ.6వేలు పెరిగి రూ.19 వేల ధర రావడం గమనార్హం.

దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జిపై నుంచి దూకి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



రాజేశ్ (ఫైల్)

హైదరాబాద్ (సైబరాబాద్ ప్రతినిధి), అక్టోబరు 27, ప్రభాతవార్త: దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడిని విశాఖకు చెందిన రాజేశ్ (25)గా గుర్తించారు. మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశ్ నాచారంలోని హాస్టల్లో ఉంటున్నాడు. సోమవారం మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో మిత్రులను కలిసేందుకు వచ్చాడు. అనంతరం కేబుల్ బ్రిడ్జి వద్దకు వెళ్లి దుర్గం చెరువులోకి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. రాజేశ్ సోదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహం కోసం దుర్గం చెరువులో ఎన్డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చేపట్టాయి. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఆర్థిక ఇబ్బందులతో కూకట్‌పల్లిలో కుమార్తెతోపాటు దంపతుల ఆత్మహత్య

హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), అక్టోబరు 27, ప్రభాతవార్త: కెపిహెచ్‌బి కాలనీ మూడో ఫేజ్‌లో ఆర్థిక ఇబ్బందులతో దంపతులు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కాగా సంఘటన స్థలంలో రెండేళ్ల చిన్నారి మృతి చెంది పడి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. చిన్నారిని గొంతు నులిమి ఆపై దంపతులు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమ బెంగాల్‌కు చెందిన గోపీనాథ్, సమంత కెపిహెచ్‌బి కాలనీ ఐదో ఫేసులో నివాసం ఉంటున్నారు. గోపీనాథ్ రెస్టారెంట్‌లో షెఫ్‌గా పనిచేస్తుండగా సమంత హౌస్ వైఫ్ ఇంట్లో ఉంటుంది. అయితే ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణమని భావిసు ్తన్నట్లు పోలీసులు తెలియజేశారు. తమ చావుకు ఎవరూ కారణం కాదని, ఇతరులను వివరాలు అడగవద్దని గోడపై బెంగాల్ రాశారు. ఈ మేరకు కేసును కేపిహెచ్బి పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పశుసంవర్ధక అధికారి సస్పెన్షన్

రైతుల్లో అవగాహన కల్పించడంలో విఫలం

హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త : ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవడంపై రాష్ట్ర సర్కార్ సీరియస్‌గా తీసుకుంది. పశుగ్రాస విత్తనాలపై ప్రభుత్వం అందిస్తున్న 75 శాతం సబ్సిడీ గురించి ఒక పాడి రైతుకు తెలియదని తేలడంతో, అందుకు కారణమైన సంబంధిత పశు సంవర్ధక శాఖ మండల అధికారిపై సస్పెన్షన్ వేటుతో పాటు, వ్యవసాయ శాఖ ఏఈఓ కు కూడా షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈ నెల 26వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోని మార్చాల గ్రామంలో పర్యటించిన ఉన్నతాధికారులు రైతు తాజుద్దీన్‌కు చెందిన వ్యవసాయ చెరువును, కృష్ణయ్య 3.5 ఎకరాల్లో నడుపుతున్న పాడి క్షేత్రాన్ని పరిశీలించారు. ప్రస్తుత ఎల్ నినో, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ కార్యకలాపాలు, నీటి వినియోగం, పశుపోషణ, పశుగ్రాసం లభ్యత, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పశుగ్రాసం విత్తనాల మూలం గురించి అడగ్గా, ప్రభుత్వ రాయితీ పథకం గురించి తనకు తెలియదని, అందుకే వాటిని వ్యక్తిగతంగా కొనుగోలు చేస్తున్నానని కృష్ణయ్య తెలిపారు. ఈ నేపథ్యంలో మండల పశుసంవర్ధక అధికారి డాక్టర్ నాగరాజును సస్పెండ్ చేయడంతో పాటు, వ్యవసాయ శాఖ ఏఈఓ సురేష్‌కు షోకాజ్ నోటీసులకు ఆదేశించారు.



మళ్లీ నెతన్యాహుకే మొగ్గు!

పోలింగ్ 70 శాతం దాటుతుందని అంచనా

టెల్అవీవ్, అక్టోబరు 27: ఇజ్రాయెల్‌లో కొనసాగుతున్న ఎన్నికల పోలింగ్ బెంజమిన్ నెతన్యాహు ఆధ్వర్యంలోని లీకుడ్ పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారింది. మంగళవారం జరిగిన ఎన్నికల్లో గతంలో ఎన్నడూలేనంతగా పోలింగ్‌శాతం నమోదయిందని ఎన్నికల అధికారులు ప్రకటించారు. సాయంత్రం నాలుగు గంటల సమయానికే ఇజ్రాయెల్ వ్యాప్తంగా 55.7శాతం పోలింగ్ నమోదయినట్లు ఎన్కిల అధికారులు రపకటించారు. ఉదయం పదిగంటలనుంచే ఇజ్రాయెలీ ప్రజలు ఓటుహక్కు వినియోగించుకునేందుకు క్యూలు కట్టారు. విధ్వంసకర శక్తులు పోలింగ్‌ను అడ్డుకునే కుట్రలుచేస్తున్నాయని, ప్రజాస్వామ్య వాదులు సమిష్టిగా ఎదుర్కొనాలంటూ ప్రస్తుత ప్రధాని లీకుడ్ అధినేత బెంజిమిన్ నెతన్యాహు పిలుపునిచ్చారు. అరబ్బు ఓటర్లపైనే నెతన్యాహు విమర్శలుచేయడంతో పరిస్థితి కొంత ఉద్రిక్తంగా మారింది. మొత్తం 73.31,981 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఉత్సాహంగా కనిపించారు. మొదటి నాలుగు గంటల్లోనే 31.5శాతం పోలింగ్ నమోదయిందని కేంద్ర ఎన్నికల కమిటీ ప్రకటించింది. 1977లో జరిగిన ఎన్నికల తర్వాత అత్యంత గరిష్టస్థాయిలోపోలింగ్‌నమోదయిందని రాజకీయ పరిశీలకులు పేర్కొం టున్నారు. ఉదయం పదిగంటలకు 16.68శాతం నమోదయిన పోలింగ్ క్రమేపీ సాయంత్రానికి 55 శాతం దాటేసింది. మరింతగా మారి 70శాతాన్ని దాటుతుందని నెతన్యాహు విధేయులు వెల్లడించారు. 77 ఏళ్ల బెంజమిన్ నెతన్యాహు మరోసారి పదవిలోకి వచ్చేందుకు సిద్ధం అవుతున్నారు. 19 ఏళ్లనుంచి ఆయన ఈపదవిలో కొనసాగుతున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌సైతం నెతన్యాహును గెలిపించాలని సోషల్‌మీడియా ప్రచారంచేసారు. ప్రత్యర్థి మాజీ ఆర్మీ చీఫ్ గాడి ఈసెన్‌కాట్ కూడా గట్టిపోటీ ఇస్తున్నారు. యుద్ధంలో ఆయన కుమారుడితోపాటు ఇద్దరు మేనల్లుళ్లు కూడా చనిపోయిన సానుభూతిని ఆయన ఈ ఎన్నికల్లో సొమ్ముచేసుకుంటున్నారు. ఇక మాజీ ప్రధాని నఫ్తాలీ బెన్నెట్ యాయిర్ ల్యాపిడ్ విపక్ష కూటమితో కలిసి గట్టిపోటీ ఇస్తున్నారు. ప్రధానపోటీ నెతన్యాహు, ఈసెన్‌కాట్‌ల మధ్యనే ఉంటుందని తెలుస్తోంది. వచ్చేనెలనాల్గవ తేదీనే అధికారికంగా ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తారు. పోలింగ్‌సరళిని బట్టి బుధవారం సాయంత్రానికే విజేత ఎవరన్నది నిర్ణయించవచ్చని ఎన్నికల పరిశీలకులు పేర్కొంటున్నారు.



టీమిండియా మాజీ ఆటగాడు యువరాజ్ సింగ్‌తో అభిషేక్ శర్మ.

సార్.. తమరు అద్భుతంగా ఆడారు!

శిష్యుడు అభిషేక్ సెంచరీపై యువి పొగడ్తలు

హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త: తన శిష్యుడు అభిషేక్ శర్మ న్యూజిలాండ్‌పై రికార్డు శతకంతో చెలరేగిన వేళ, భారత మాజీ డాషింగ్ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ సోషల్ మీడియా వేదికగా ఆసక్తికరంగా స్పందించాడు. ఒకవైపు తన రికార్డును గుర్తుచేస్తూ సరదాగా ఆటపట్టి స్తూనే, మరోవైపు శిష్యుడి అద్భుత ప్రదర్శనను మనసారా ప్రశంసించాడు. ఈ గురుశిష్యుల మధ్య జరిగిన సంభాషణ ఇప్పుడు క్రీడాభిమానుల ను ఆకట్టుకుంటోంది. న్యూజిలాండ్‌తో మంగళవారం జరిగిన మూడో టీ 20 మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 15 బంతుల్లో హాఫ్ సెంచరీ, 35 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి న్యూజిలాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. మరో యువ కెరటం వైభవ్ సూర్యవంశీ (18 బంతుల్లో 45 పరుగులు)తో కలిసి జట్టుకు అద్భుత ఆరంభాన్నిచ్చాడు. వీరిద్దరి ధాటికి భారత్ కేవలం ఐదు ఓవర్లలోనే 100 పరుగులు చేసి రికార్డు సృష్టించింది. ఈ అద్భుత ఇన్నింగ్స్ అనంతరం అభిషేక్ తనదైన శైలిలో మెడిటేషన్‌తో సెలబ్రేట్ చేసుకున్నాడు. అభిషేక్ ఇన్నింగ్స్ అనంతరం సోషల్ మీడియా వేదికగా స్పందించిన యువరాజ్ సింగ్, తొలుత సరదాగా టీజ్ చేశాడు. "నువ్వు 12 బంతుల్లో 50 ప రుగులు ఇంకా చేయలేదు.. అంటూ 2007 టీ20 ప్రపంచకప్‌లో తన రికార్డును గుర్తు చేశాడు. అందుకు అభిషేక్ శర్మ స్పందిస్తూ...అలాంటి ఫీట్లు చేయడం అంత సులభం కాదు.. ఇలాంటివి ఎప్పుడో కానీ సాధ్యం కావు... అన్ని వేళలా అలా ఆడాలంటే కష్టం" అని వినమ్రంగా స మాధానం ఇచ్చాడు. వెంటనే మరో ట్వీట్‌లో యువీ తన శిష్యుడిపై ప్రశంసల వర్షం కురిపించాడు. "నేను 30 లేదా 34 బంతుల్లో 100 పరు గులు చేయలేను. సార్, మీరు అద్భుతంగా ఆడారు... గొప్ప ఇన్నింగ్స్... సెంచరీ సాధించే క్రమంలో తమరు సింగిల్స్ కూడా తీశారు.. అంటూ కామెంట్స్ చేశాడు. అంతేకాదు, యువీ ఇతర ఆటగాళ్లపైనా తన స్పందన తెలియజేశాడు. మరో ఎండ్‌లో వైభవ్ సూర్యవంశీ కూడా అదరగొ ట్టాడని కొనియాడాడు. సంజూ శాంసన్ జట్టు కోసం మూడో స్థానంలో ఆడటం గొప్ప విషయం అని అభినందించాడు

కేరళ ఆయుర్వేదానికి విశిష్ట గుర్తింపు

సంప్రదాయ వైద్యానికి శాస్త్రీయ పరిశోధనలు తోడవ్వాలి

కనక్కూర్ ధన్వంతరి ఆలయంలో మహాయాగానికి హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,అక్టోబరు27,ప్రభాతవార్త: ఆరోగ్యమే మానవ జీవితంలో అత్యంత విలువైన సంపద అని, భారతీయ ఆయుర్వేద వారసత్వాన్ని పరిరక్షి స్తూ శాస్త్రీయ పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. కేరళంలోని కనక్కూర్ ధన్వంతరి ఆలయంలో నిర్వహించిన ధన్వంతరి మహాయాగానికి హాజరైన ఆయన, ఆరోగ్య పరిరక్షణ, ఆయుర్వేద ప్రాధాన్యత, ప్రజారోగ్యం, సామాజిక బాధ్యతలపై ప్రసంగించారు. ఆరోగ్యం అంటే కేవలం వ్యాధులు లేకపోవడం మాత్రమే కాదని, శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, భావోద్వేగ స్థిరత్వం, సంతృప్తికరమైన జీవితం కూడా అందులో భాగమేనని భట్టి విక్రమార్క అన్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిళ్లను ఎదుర్కొనేందుకు ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని సూచించారు. ధన్‌తేరస్‌ను బంగారం కొనుగోలు చేసే పర్వదినంగానే కాకుండా, ధన్వంతరి జయంతిగా దాని అసలైన ప్రాముఖ్యతతో గుర్తించాలని ఆయన అన్నారు. పాలసముద్ర మథనంలో అమృత కలశంతో ఆవిర్భవించిన దేవతల వైద్యుడు భగవాన్ ధన్వంతరి ఆరోగ్యం, జీవరక్షణకు ప్రతీకగా నిలుస్తారని పేర్కొన్నారు. ధన్వంతరిని ఆరాధించడం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబ, సమాజ శ్రేయస్సుకు కూడా ప్రతీక అని వివరించారు. భారతీయ వైద్య వారసత్వంలో ఆయుర్వేదానికి విశిష్ట స్థానం ఉందని, ఔషధ మొక్కలపై సంప్రదాయ పరిజ్ఞానం, ప్రత్యేక చికిత్సా విధానాలతో కేరళం దేశవిదేశాల్లో గుర్తింపు పొందిందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ ఆలయంలో 11 రోజులపాటు నిర్వహిస్తున్న ధన్వంతరి మహాయాగం ఆరోగ్య ప్రాధాన్యతను, భారతీయ వైద్య సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి దోహదపడుతుందని అన్నారు.

వ్యాధుల చికిత్సతోపాటు నివారణ, సమతుల్యమైన జీవనశైలి, సరైన ఆహారం, ప్రకృతితో సామరస్యంగా జీవించడం వంటి అంశాలకు సంప్రదాయ వైద్య విధానాలు ప్రాధాన్యతనిచ్చాయని గుర్తుచేశారు. అయితే ఆయుర్వేదాన్ని బాధ్యతాయుతంగా ఆచరిస్తూ, శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించాలని, రోగులకు సురక్షి తమైన వైద్య సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం అభివృద్ధి విధానాల్లో ప్రధానంగా ఉండాలని అన్నారు. ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైద్య విద్య, పరిశోధన, వ్యాధుల నివారణ, ప్రజారోగ్య అవగాహన కార్యక్రమాలకు నిరంతర పెట్టుబడులు అవసరమని పేర్కొ న్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు సమాజం అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వృద్ధులు, దివ్యాంగులు, బలహీన వర్గాల పట్ల సానుభూతితో వ్యవహరించాలని, ప్రాణాలను కాపాడేందుకు నిరంతరం శ్రమిస్తున్న వైద్యులు, పరిశోధకులు, ఆరోగ్య కార్యకర్తల సేవలను గౌరవించాలని అన్నారు. మన్నత్తు పద్మనాభన్, శ్రీ నారాయణ గురు, అయ్యంకాళి వంటి సామాజిక సంస్కర్తలు సమాజంలో జ్ఞానాన్ని విస్తరించేందుకు, ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో జీవించేలా కృషి చేశారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. నాయర్ సర్వీస్ సొసైటీ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూనే యువతలో శాస్త్రీయ దృక్పథం, నూతన ఆవిష్కరణలు, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలని సూచించారు. ఆరోగ్యం పర్యావరణంతో ముడిపడి ఉందని, అడవులు, ఔషధ మొక్కలు, స్వచ్ఛమైన నీరు, జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడం భావితరాల శ్రేయస్సుకు అవసరమని పేర్కొన్నారు.

దేశంలో శాంతి, సమాజంలో సామరస్యం నెలకొనాలని, ప్రతి కుటుంబం ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలని ఆకాంక్షి ంచారు. ధన్వంతరి మహాయాగ నిర్వాహకులు, ఆలయ అధికారులు, స్వచ్ఛంద సేవకులు, మొదటగా విచ్చేసిన భక్తులందరికీ మలయాళంలో డిప్యూటీ సీఎం శుభాకాంక్షలు తెలిపారు.



ధన్వంతరి ఆలయంలో మంగళవారం నిర్వహించిన మహాయాగానికి హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జ్యోతి వెలిగిస్తున్న దృశ్యం

మార్చిలోగా 'స్కిల్స్ వర్సిటీ'

రూ.230 కోట్లతో ఆధునిక నిర్మాణాలు

పరిపాలనా భవనం, ప్రవేశ ద్వారం నమూనాలు రెడీ

వర్సిటీ ప్రాంగణంలోనే ఇన్వెస్ట్ సదస్సు వేదికలు

హైదరాబాద్,అక్టోబరు27,ప్రభాతవార్త: యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని వచ్చే యేడాది మార్చి నెలాఖరులోగా అందుబాటులోకి తీసుకు రావాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మిస్తున్న ఈ విశ్వవిద్యాలయంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన పరిపాలనా భవనం, తరగతి గదులు, విద్యార్థినీ విద్యార్థుల వసతిగృహాలు, ఆచార్యుల నివాసాలను నిర్మించనున్నారు. ఇందుకోసం సుమారు రూ.230 కోట్ల వ్యయంతో పనులు చేపట్టేందుకు టీజీఐఐసీ అధికారులు కార్యాచరణ రూపొందిం చారు. తొలుత అనుకున్న డిజైన్లకు అదనంగా పలు ఆధునిక సదుపాయాలను చేర్చడంతోపాటు, పరిపాలనా భవనం, ప్రధాన ప్రవేశ ద్వారం కోసం ప్రత్యేక నమూనాలను సిద్ధం చేశారు.

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులకు మరో ప్రాధాన్యం ఏర్పడింది. డిసెంబరు 7 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు ఈ విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని వేదికగా ఎంపిక చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామికాభివృద్ధికి కొత్త అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా నిర్వహించే ఈ సదస్సుకు దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామి కవేత్తలు, పెట్టుబడ దారులు, వివిధ రంగాల ప్రతినిధులు హాజ రయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సదస్సు నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లతోపాటు విశ్వవిద్యాలయ నిర్మాణ పనులను సమాంతరంగా వేగవంతం చేస్తున్నారు.

యూనివర్సిటీలోని పరిపాలనా భవనం, తరగతి గదుల బ్లాక్‌లను సదస్సులో వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగించనున్నారు. ఒక్కో సమావేశానికి వందల మంది హాజరయ్యే అవకాశం ఉన్నందున వేదికలు విశాలంగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. సమావేశాల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చడంతోపాటు, సందర్శకులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని మైదానంలో పారిశ్రామిక ఉత్పత్తులు, సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడి అవకాశాలను ప్రదర్శిం చేందుకు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు.

ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సును యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెల రోజుల కిందట అధికారులను ఆదేశించారు. దీంతో నిర్మాణ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సదస్సుకు అవసరమైన వేదికలు, సమావేశ మందిరాలు, ఇతర మౌలిక సదుపాయాలను నవంబరు 15లోగా సిద్ధం చేసేలా పనుల షెడ్యూల్‌ను రూపొందించారు.

నిర్ణీత గడువులో పనులు పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపడుతున్నారు. సదస్సు ఏర్పాట్ల కోసం చేపడుతున్న పనులు పూర్తయిన తర్వాత మిగిలిన నిర్మాణాలను కొనసాగించి, మార్చి నెలాఖరులోగా విశ్వవిద్యా లయాన్ని పూర్తిస్థాయిలో అందుబాటు లోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

అంగూల్ కలెక్టర్‌తో సిఎండి ప్రకాష్ భేటీ

నైనీ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ఒడిశాలో సింగరేణి ఆఫీస్, ఉద్యోగుల కాలనీ

హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త: సింగరేణి సంస్థ ఒడిశా రాష్ట్రంలో తమ నైనీ బొగ్గు గని సమీపంలో నిర్మించ తలపెట్టిన సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం, నైనీ నిర్వాసితులకు ఉద్దేశించిన ఆర్ అండ్ ఆర్ కాలనీ, కార్యాలయం, ఉద్యోగుల కాలనీ, బొగ్గు రవాణాకు సంబంధించి రోడ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాలను కేటాయిం చాలని సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఒడిశా ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఒడిశాలోని నైనీ ప్రాంతానికి చెందిన అంగూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ మహ్మద్ అబ్దుల్ అక్తార్ తో డాక్టర్ ప్రకాష్ సమావేశమయ్యారు.

అంశాల వారీగా చర్చించి తగిన సహకారం అందించాల్సిందిగా కోరారు. నైనీ బొగ్గు గని వల్ల నిర్వాసితులైన 40 కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మాణం కోసం తగిన స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు. అలాగే త్వరలోనే రిహాబిలిటేషన్ అండ్ పెరిఫెరి అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు, కాలనీ నిర్మాణానికి భూసేకరణ, పునరావాసం ప్యాకేజీలు మొదలైన సమస్యలపై నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి సంస్థ నైనీ బొగ్గు గనికి అనుబంధంగా సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని అక్కడ ఏర్పాటు చేయాలని యోచిస్తోందని, దీనికి సంబంధించి తుకుడా, జరపడా గ్రామాలకు చెందిన స్థలం అనుకూలమైనదిగా గుర్తించామని, దీని సేకరణకు సహకారం అందించాలని కోరారు. ప్రస్తుతం నైనీ బొగ్గును రైల్వే జంక్షన్ కు రవాణా చేయడం కోసం నిర్మించ తలపెట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణానికి గాను సింగరేణి ఇప్పటికే 35 కోట్ల రూపాయలు డిపాజిట్ చేసిందని చెప్పారు. ఈ రోడ్డు కోల్ కారిడార్ మాదిరిగా మారి ఇతర బొగ్గు ఉత్పత్తి పరిశ్రమలకు కూడా ఉపయోగపడుతుంది, దీన్ని దృష్టిలో ఉంచుకుని నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఒడిశాలో సింగరేణి కార్యాలయం, ఉద్యోగుల నివాస కాలనీ నిర్మాణానికి తగిన స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక గ్రామాల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బొగ్గు రవాణా జరపడం కోసం మాయికా బైపాస్ రోడ్డు నిర్మాణానికి సహకరించాలని, ఇప్పటికే సింగరేణి సంస్థ ఈ రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ కోసం నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. దీనికి జిల్లా కలెక్టర్ స్పందిస్తూ సింగరేణికి అన్ని రకాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. కాగా అంగూల్ జిల్లాలో కల ప్రపంచంలోనే తొలి కోల్ గ్యాసిఫికేషన్ ప్లాంట్‌ను డాక్టర్ ప్రకాష్ సందర్శించారు. ఆయా కార్యక్రమంల్లో సింగరేణి డైరెక్టర్లు గౌతమ్, వి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంపించిన భూమి.. భయాందోళనకు గురైన ప్రజలు

హైదరాబాద్ (అత్తాపూర్) అక్టోబరు 27, ప్రభాతవార్త : అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని ఉప్పర్‌పల్లి, ఎర్రబోడ, హైదర్‌గైడ చైతన్య విలాస్ కాలనీ ,మరియు లంగర్‌హౌస్, కేశవస్వామి నగర్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం భారీ శబ్దం వినిపించింది. ఉదయం 9.15 గంటల సమయంలో బ్లాస్టింగ్‌ను తలపించేలా ఒక్కసారిగా పెద్ద శబ్దంతో భూమి కంపించింది. దీంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. ఇంట్లో ఉన్న పలువురు బయటకు పరుగులు తీశారు. అసలు ఏం జరిగిందో తెలియక ప్రజలు అయోమయానికి గురైయ్యారు. ఎక్కడైనా బ్లాస్టింగ్ జరిగిందా? భూకంపం సంభవించిందా? అనే సందేహాలు స్థానికుల్లో వ్యక్తమయ్యాయి. ఉప్పర్‌పల్లి, ఎర్రబోడ మరియు హైదర్‌గూడ పరిసర ప్రాంతాల్లో పెద్ద శబ్దం వచ్చినట్లు స్థానికుల నుండి పోలీసులకు ఫిర్యాదులు రావడంతో సిఐ వెంకటేష్ పోలీసు సిబ్బందితో కలిసి ఘటన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...శబ్దానికి గల కారణం భూకంపమా లేక ఇతర ఏదైనా కారణమా అనేది తెలుసుకోవడానికి సంబంధిత సిస్మోగ్రఫీ అధికారులతో మాట్లాడి రిక్టర్ స్కేలు వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు. ఇక్కడ ఇలాంటి ప్రమాదం కానీ ఎలాంటి నష్టం జరగలేదని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే ఒకేసారి 4చోట్ల భారీ శబ్దం రావడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బ్లాస్టింగ్ జరిగిందా? భూకంపం సంభవించిందా? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.

మయన్మార్ మహిళపై భర్త, అతని ముగ్గురు స్నేహితుల లైంగిక దాడి

ముగ్గురు నిందితుల అరెస్టు

పరారీలో ప్రధాన నిందితుడు

హైదరాబాద్ (సైదాబాద్), అక్టోబరు 27, ప్రభాతవార్త : నగరంలో దారుణ సంఘటన వెలుగులోకి వచ్చింది. మయన్మార్‌కు చెందిన 18 సంవత్సరాల వివాహితను ఆమె భర్తే ఇంట్లో బంధించి, తన ముగ్గురు స్నేహితులతో లైంగిక దాడి చేయించిన సంఘటన కలకలం సృష్టిస్తోంది. ఇంటి యజమాని అద్దె వసూలు చేయడానికి వచ్చి తాళం పగుల గొట్టడంతో ఈ దారుణం వెలుగు చూసింది. బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బంగ్లాదేశ్ మయన్మార్‌కు చెందిన 18 సంవత్సరాల బాలికకు అక్కడ ఉన్నప్పుడే మహ్మద్ ఫయాజ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మే నెలలో ఆమెను నగరానికి తీసుకుని వచ్చాడు. నగరానికి వచ్చిన తర్వాత ఖాజీ సమక్షంలో వీరి వివాహం జరిగింది. వివాహం అనంతరం హాఫీజ్‌బాబానగర్‌లో ఇంటిని తీసుకుని ఉంటున్నారు. పెళ్లయిన నెల రోజుల తర్వాత ఫయాజ్ మయన్మార్‌కు చెందిన తన ముగ్గురు స్నేహితులు అహ్మద్ ముజీబ్, నూర్ కమల్, జియా ఉర్ రహమాన్‌లను తాము ఉంటున్న అద్దె ఇంటికి తీసుకుని వచ్చాడు. భర్త ఫయాజ్ బయటకు వెళ్లే సమయంలో తన ముగ్గురు స్నేహితులను ఇంట్లోకి పంపి బయట నుండి తాళం వేసేవాడు. ఫయాజ్ ముగ్గురు స్నేహితులు ఆమెపై లైంగిక దాడికి పాల్పడుతున్నారు. విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో ఈ నెల 23వ తేదిన ఇంటి అద్దె డబ్బుల వసూలు కోసం వచ్చిన ఇంటి యజమానికి బయట తాళం వేసి ఉండడంతో దాన్ని పగులగొట్టడంతో ఈ దారుణం వెలుగు చూసింది. ఇంటి తాళం పగులగొట్టడంతో నిర్బంధం నుండి బయటపడ్డ బాధితురాలు సెల్‌ఫోన్‌లో బంగ్లాదేశ్‌లోని తమ కుటుంబ సభ్యులకు జరిగిన ఘోరం గురించి సమాచారం అందించడంతో, వారు నగరంలో ఉంటున్న తమ బంధువులకు విషయం తెలియజేశారు. అక్టోబరు 26వ తేదీన బాధితురాలు నగరంలోని తన బంధువులతో కలిసి కాంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపిన పోలీసులు, నిందితులు నూర్ కమల్, అహ్మద్ ముజీబ్, జియా ఉర్ రహమాన్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఏ1గా ఉన్న మహ్మద్ ఫయాజ్ పరారీలో ఉన్నాడు.

నేపాల్‌లో ఉంటూ దోపిడీలకు స్కెచ్

నాలుగు రాష్ట్రాల్లో ఎనిమిది నేరాల్లో ప్రమేయం

ఆరేళ్లుగా పోలీసులకు చిక్కని ఘరానా దొంగ అరెస్ట్!

రిమాండ్‌కు తరలించిన జూబ్లీహిల్స్ పోలీసులు



జీవన్ బహదూర్ చంద్

హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 27, ప్రభాతవార్త: నేపాల్‌లో ఉంటూ దేశంలోని వివిధ ప్రాంతాల్లో దోపిడీలకు పథకాలు రచించడం.. ఇంట్లో పనిమనుషుల ముసుగులో చోరీలకు పాల్పడే ముఠాతో కలిసి నేరాలకు తెరలేపడం.. పోలీసులకు చిక్కకుండా ఆరేళ్లుగా తప్పించుకు తిరగడం.. ఇదీ నేపాల్‌కు చెందిన జీవన్ బహదూర్ చంద్ అలియాస్ జీర్ బహదూర్ సాహి చంద్(34) నేర చరిత్ర. పక్కా ప్రణాళికలతో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నేరాలకు పాల్పడుతున్న ఈ ముఠా కీలక సూత్రధారిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తెలంగాణతో పాటు కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్రల్లో నమోదైన ఎనిమిది నేరాల్లో ఇతడి ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు.

పనిమనుషుల ముసుగులో..

నేపాల్‌కు చెందిన జీవన్ చంద్ బెంగళూరులో కార్యాలయ సహాయకుడిగా, వంటపని చేసే వ్యక్తిగా చాలా కొనసాగేవాడు. బడా భవంతుల్లో పనిమనుషులుగా చేరి పక్కా పథకంతో చోరీలకు పాల్పడే విధానంలో ఇతని ఆధ్వర్యంలో ఒక ముఠా ఏర్పాటుచేసుకున్నాడు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో నేరాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న జీవన్ చంద్ కోసం దర్యాప్తు బృందాలు చాలా కాలంగా గాలిస్తున్నాయి. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, సైఫాబాద్, కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులతో పాటు ఇతర రాష్ట్రాల్లోని నేరాల్లోనూ ఇతడి ప్రమేయం ఉన్నట్లు విచారణలో గుర్తించారు. ఇక్కడ నేరాలకు పాల్పడే జీవన్ చంద్ నేరం చేసిన తరువాత తన ముఠా సభ్యులతో వేరై దేశం నుంచి నెమ్మదిగా నేపాల్‌లోకి జారుకొనేవాడు. ఇలా దాదాపు ఆరేళ్లుగా పలు ప్రాంతాల్లో నేరాలు చేయడం హద్దులు దాటి తప్పించుకోవడం ఇతనికి పరిపాటిగా మారింది.

నేపాల్ నుంచి స్కెచ్

తొలుత పలు దొంగతనాలకు పాల్పడిన జీవన్ చంద్ తరువాతి కాలంలో నేపాల్‌లో కూర్చొని స్కెచ్ వేయడం ప్రారంభించాడు. తన ముఠాను తయారుచేసుకొని తద్వారా సంపన్నుల ఇళ్లలో పనిచేసే వారిని తన పథకంలో భాగం చేసుకొనేవాడు. ఇలా హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, ఢిల్లీలోనూ ఇదే తరహా నేరాలకు పాల్పడేందుకు ముఠా సభ్యులు పథకాలు రచించాడు. జీవన్ చంద్‌ను పట్టుకొనేందుకు హైదరాబాద్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్, జూబ్లీహిల్స్ డీసీపీ ఏ.రమణారెడ్డి పర్యవేక్షణలో నేపాలీ గ్యాంగ్ ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటుచేశారు. ఈ క్రమంలోనే మాజీ ఐపీఎస్ సతీమణి హత్య కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసు బృందం ఇతనిపైన దృష్టి పెట్టింది. జీవన్ చంద్‌కు ప్రియురాలు ఉన్నట్లు గుర్తించారు. ఆమె ద్వారా అతనికి వల వేసి పట్టుకున్నట్లు తెలుస్తుంది. జూబ్లీహిల్స్ పోలీసులతోపాటు ప్రత్యేక దర్యాప్తు బృందం ఇన్‌స్పెక్టర్ జి.ఎస్. డేనియల్, జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ డి.అశోక్, ఎస్ఐలు సి.రాఘవేంద్రరెడ్డి, ఎస్.కరుణాకర్‌రెడ్డి, ఇతర సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. అరెస్టు చేసిన జీవన్ చంద్‌ను రిమాండ్‌కు తరలించారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటలు

అదనపు ఆదాయ మార్గాలపై రైతులకు అవగాహన కల్పించాలి

టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేశ్

హైదరాబాద్ ,అక్టోబరు 27, ప్రభాతవార్త: ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో భవిష్యత్తులో నీటి లభ్యతలో ఏర్పడే మార్పులను దృష్టిలో ఉంచుకుని, రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుతో పాటు అదనపు ఆదాయ మార్గాలపై దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేశ్ వి. పటేల్ సూచించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం, తక్కువ నీటి అవసరమయ్యే పంటలను ప్రోత్సహిం చడం, వ్యవసాయ విద్యుత్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాజేంద్రనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్, డైరెక్టరేట్ ఆఫ్ పౌల్ట్రీ రీసెర్చ్, తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీలను సీఎండీ సందర్శించి, ఆయా సంస్థల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలతో చర్చించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు వ్యవసాయ రంగంలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణ, రైతులకు అదనపు ఆదాయాన్ని అందించే అవకాశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడితే వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు శాస్త్రీయ మార్గదర్శకత్వం అందించాలని సీఎండీ సూచించారు. వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు ప్రత్యామ్నాయంగా నేల స్వభావం, స్థానిక వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను బట్టి నూనెగింజలు, చిరుధాన్యాలు తదితర పంటల సాగు అవకాశాలను పరిశీలించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా జొన్న, సజ్జ, రాగి, కొర్ర వంటి చిరుధాన్యాల సాగు పద్ధతులు, అనుకూలమైన విత్తన రకాలు, పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ నిపుణుల సహకారం తీసుకోవాలని సూచించారు.

పంటల ఎంపికలో నీటి లభ్యతతో పాటు మార్కెట్ డిమాండ్, సాగు వ్యయం, రైతులకు లభించే ఆదాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. పౌల్ట్రీ, పశుసంవర్ధక రంగాల ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందే అవకాశాలపై సంబంధిత నిపుణులతో చర్చించారు. పంటల వైవిధ్యీకరణతో పాటు అనుబంధ వ్యవసాయ కార్యకలాపాలను ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆదాయ వనరులను విస్తరించవచ్చని, నీటి వనరులపై ఒత్తిడిని తగ్గించే అవకాశాలుంటాయని పేర్కొన్నారు. పపరిశోధనా సంస్థల సందర్శనలో చర్చించిన అంశాలను రంగారెడ్డి జోన్ పరిధిలోని రైతులకు చేరవేయాలని సీఎండీ జితేశ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రంగారెడ్డి జోన్ చీఫ్ ఇంజనీర్ ఎల్. గోపయ్య, సంబంధిత సూపరింటెండింగ్ ఇంజనీర్లు రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, చిరుధాన్యాల సాగు, నీటి పొదుపు, వ్యవసాయ విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పరిశోధనా సంస్థల శాస్త్రవేత్తల సహకారంతో రైతులకు ఉపయోగపడే శాస్త్రీయ సమాచారాన్ని సేకరించి, క్షేత్రస్థాయి విద్యుత్ అధికారులు, సిబ్బంది ద్వారా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, నీటి సమర్థ వినియోగం, ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని పేర్కొన్నారు. నీటి వినియోగాన్ని తగ్గించడం ద్వారా సాగునీటి పంపింగ్‌కు అవసరమయ్యే విద్యుత్ వినియోగాన్ని కూడా సమర్థంగా నిర్వహించే అవకాశం ఉంటుందని సీఎండీ తెలిపారు. నీరు, విద్యుత్ వంటి వనరులను పొదుపుగా వినియోగించుకునే విధానాలపై రైతుల్లో అవగాహన పెంపొందించడం ద్వారా ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు ముందస్తు సన్నద్ధత సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

ఆట





భారత్‌దే టి20 సిరీస్

న్యూజిలాండ్‌పై 6 వికెట్ల తేడాతో గెలుపు

వెల్లింగ్టన్ (న్యూజిలాండ్): మూడవ టీ20లోభారత్ న్యూజిలాండ్‌ను ఆరు వికెట్ల తేడాతో ఓడించింది. మంగళవారం జరిగిన మూడో టీ20లో భారత్ కేవలం 4 వికెట్ల నష్టానికి 13.2 ఓవర్లలోనే 199 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో, ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3-0తో టీమ్ ఇండియా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను కైవసం చేసుకుంది. కివీస్ విసిరిన 199 పరుగుల లక్ష్యాన్ని కేవలం 13.2 ఓవర్లలో అందుకున్నది. ఓపెనర్ అభిషేక్ శర్మసూపర్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. అభిషేక్ 38 బంతుల్లో 113 రన్స్ చేసి ఔటయ్యాడు. ఛేజింగ్‌లో ఇండియన్ ఓపెనర్లు చెలరేగిపోయారు. వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ ఇద్దరూ తొలి వికెట్‌కు రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ ఇద్దరూ తొలివికెట్‌కు 133 రన్స్ జోడించారు. వైభవ్ 45 రన్స్ చేసి ఔటయ్యాడు. అయితే పవర్ ప్లేలో ఇండియా కొత్త రికార్డు క్రియేట్ చేసింది. 6 ఓవర్లలోనే భారత ఓపెనర్లు 118 రన్స్ చేశారు. కివీస్ బౌలర్లు ఏ దశలోనూ తమప్రభావాన్ని చూపలేకపోయారు. అభిషేక్, వైభవ్ ఆడుతున్న తీరు కివీస్ బౌలర్లలో దడపుట్టించింది. ఇండియా కేవలం 4 వికెట్లు కోల్పోయి టార్గెట్ చేరుకున్నది. కివీస్ బౌలర్లలో జేమీసన్ రెండు వికెట్లు తీసుకున్నాడు. తొలుత ఫస్ట్ బ్యాటింగ్ చేసిన కివీస్ నిర్ణీత ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 198 రన్స్ చేసింది. డారెల్ మిచెల్ డాషింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. అతను 52 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 89 రన్స్ చేశాడు. కివీస్ ఇన్నింగ్స్‌లో ఫిన్‌అలెన్ 40, గ్లెన్ ఫిలిప్స్ 17, బెవాన్ జాకబ్స్ 39 రన్స్ చేశారు. జాకబ్స్ 23 బంతుల్లో 4 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 39 రన్స్ చేశాడు. నాలుగో వికెట్ జాకబ్స్, మిచెల్ అజేయంగా 75 రన్స్ జోడించారు. ఆ ఇద్దరూ నాటౌట్‌గా నిలిచారు. భారత బౌలర్లలో నితీశ్, అక్షర్, అర్షదీప్ చెరో వికెట్ తీసుకున్నారు.

కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో నైజీరియాపై

భారత్ పురుషుల, మహిళల జట్లు విజయం

అహ్మదాబాద్: తొలి కామన్వెల్త్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ 2026లో భారత పురుషుల, మహిళల కబడ్డీ జట్లు తమ విజయ పరంపరను కొనసాగిస్తూ తమతమ మ్యాచ్‌లలో నైజీరియాను ఓడించాయి. మహిళల జట్టు 38-10 తేడాతో ఘన విజయం సాధించి సెమీఫైనల్స్‌కు చేరుకోగా, పురుషుల జట్టు 50-23 తేడాతో తమ నాలుగో విజయాన్ని నమోదు చేసింది. భారత మహిళలు ఆరంభం నుంచే ఆధిపత్యం



ప్రదర్శించి విరామ సమయానికి 24-6 ఆధిక్యాన్ని నెలకొల్పి, ఆ తర్వాత మరో 14 పాయింట్లను జోడించారు. 17 రైడ్‌లలో 11 రైడ్ పాయింట్లతో అను అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. సాక్షి 4 రైడ్ పాయింట్లు అందించగా, కెప్టెన్ నిధి శర్మ 2 పాయింట్లు జోడించింది. డిఫెన్స్‌లో, సభాయి గఢవి 3 టాకిల్ పాయింట్లు, ప్రియా, రితు చెరో 2 పాయింట్లు అందించారు. నైజీరియాకు చెందిన రాబర్ట్ మోసెస్ 6 రైడ్ పాయింట్లతో జట్టు తరపున అత్యధిక స్కోరర్‌గా నిలవగా, బస్సీ ఎడెట్ 2 పాయింట్లు సాధించంది. డెన్నిస్ ఉడెమే నైజీరియా తరపున ఏకైక టాకిల్ పాయింట్‌ను సాధించగా, మ్యాచ్‌లో ఎక్కువ భాగం భారత్ ఆధిపత్యం కొనసాగించింది. ఇక భారత పురుషుల జట్టు హాఫ్ టైం నాటికి 25-7 ఆధిక్యాన్ని సాధించి, చివరికి 50-23 తేడాతో ఘన విజయం సాధించింది. రైడ్ పాయింట్లలో భారత్ 31-21 ఆధిక్యంతో, టాకిల్ పాయింట్లలో 7-2 ఆధిక్యంతో ముగించింది. సచిన్ 12 రైడ్ పాయింట్లతో భారత్‌కు నాయకత్వం వహించగా, ఆదిత్య షిండే 11 పాయింట్లు, పంకజ్ మోహితే 8 రైడ్ పాయింట్లు, 2 టాకిల్ పాయింట్లు, సుర్జీత్ నర్వాల్ 4 టాకిల్ పాయింట్లు సాధించారు. నైజీరియా తరపున, ఎడెమ్ విజ్డమ్ ఇటా 8 రైడ్ పాయింట్లు సాధించగా, ఎక్పె విక్టరీ ఇమ్మాన్యుయెల్ 5 రైడ్ పాయింట్లు, ఒక టాకిల్ పాయింట్ సాధించాడు. ఇజు ప్రిన్స్ ఉడా 5 రైడ్ పాయింట్లను జోడించాడు. నైజీరియా రెండవ అర్ధభాగంలో 16 పాయింట్లు సాధించినప్పటికీ, భారత్ భారీ ఆధిక్యంలో ఉండటంతో ఓటమి తప్పలేదు.



కెనడియన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌కు అనాహత్



టొరియో: ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్ఏ) టూర్‌లో మంగళవారం తన అద్భుతమైన ప్రదర్శనను కొనసాగిస్తూ, కెనడాలోని టొరంటోలో జరుగుతున్న కెనడియన్ ఉమెన్స్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌కు భారత టీనేజ్ క్రీడాకారిణి అనాహత్ సింగ్ చేరుకుంది. ఈ టోర్నమెంట్‌లో ఆమె ఇంగ్లాండ్‌కు చెందిన శరణ్ న్ఘియెమ్‌ను నాలుగు గేమ్‌లలో ఓడించింది. ప్రస్తుతం ప్రపంచ 15వ ర్యాంకులో ఉన్న 18 ఏళ్ల అనాహత్ ఈ టోర్నమెంట్ రెండవ రౌండ్‌లో ప్రపంచ 52వ ర్యాంకు క్రీడాకారిణిని 11-6, 4-11, 11-5, 11-7 తేడాతో ఓడించింది. అనాహత్ ఆత్మవిశ్వాసంతో ఆరంభించి, తొలి గేమ్‌ను 11-6 తేడాతో కైవసం చేసుకోగా, న్ఘియెమ్ దీటుగా స్పందించి రెండో గేమ్‌ను 11-4 తేడాతో గెలుచుకుని పోటీని సమం చేసింది. మూడో గేమ్‌లో అనాహత్ మళ్లీ పట్టు సాధించి 11-5 తేడాతో గెలుపొందగా, నాలుగో గేమ్‌లో 11-7 తేడాతో విజయం సాధించి మ్యాచ్‌ను ముగించింది. ఇదిలా ఉండగా, టొరంటోలోనే జరిగిన కెనడా కప్‌లో భారత ఆటగాడు వీర్ చోత్రానీ పురుషుల పోటీ నుంచి నిష్క్రమించాడు. ప్రపంచ 36వ ర్యాంకర్ అయిన అతను, రెండో రౌండ్‌లో ఇంగ్లాండ్‌కు చెందిన మొహమ్మద్ ఎల్షోర్బగీ చేతిలో 7-11, 7-11, 6-11 తేడాతో ఓడిపోయాడు. జపాన్‌కు చెందిన ర్యునోసుకే సుకుయేను వరుస గేమ్‌లలో ఓడించిన తర్వాత చోత్రాని ఈ పోటీలోకి ప్రవేశించినప్పటికీ, అనుభవజ్ఞుడైన ఎల్షోర్బాగీని అధిగమించలేకపోయాడు.

రెజ్లింగ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్..

ఫైనల్స్‌కు కాజల్, నీలం

బారీస్ (అస్తానా): రెండుసార్లు అండర్20 ప్రపంచ ఛాంపియన్ అయిన కాజల్ ధోచక్, నీలం సిరోహి మంగళవారం నాడు వరుసగా మహిళల 76 కేజీలు, 50 కేజీల విభాగాల ఫైనల్స్‌లోకి దూసుకెళ్లి, ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లలో భారతదేశానికి కనీసం రెండు పతకాలను ఖాయం చేశారు. ఉత్కంఠభరితమైన సెమీఫైనల్ పోరులో, కాజల్ 1-7తో వెనుకబడినప్పటికీ, గత ఎడిషన్ రజత పతక విజేత అయిన కిర్గిజ్‌స్థాన్‌కు చెందిన ఐపెరి మెడెట్ కైజీని 10-7 తేడాతో ఓడించింది. అంతకుముందు, కాజల్ మంగోలియాకు చెందిన దవానసన్ ఎంఖ్ అమర్‌పై 9-2 తేడాతో తిరుగులేని విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది. ఆమె లిథువేనియాకు చెందిన కమిలే గ్రిస్కిన్ గౌకైటెపై విక్టరీ బై ఫాల్ నమోదు చేసి తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అలాగే 50 కేజీల సెమీఫైనల్స్‌లో, నీలం స్థానిక ఫేవరెట్ ఝైనెప్ బాయనోవాను 7-3 తేడాతో ఓడించి, దిగ్గజ జపనీస్ రెజ్లర్ యుయి సుసాకితో ఫైనల్‌కు చేరుకుంది. 50 కేజీల ప్రీక్వార్టర్ ఫైనల్ బౌట్‌లో నీలం బెలారస్‌కు చెందిన నటాలియా వరాకినాను 6-0 తేడాతో ఓడించి చివరి నాలుగు స్థానాలకు చేరుకుంది. గాయం కారణంగా టాప్ సీడ్ రష్యన్ క్రీడాకారిణి ఎలిజవెటా స్మిర్నోవా క్వార్టర్ ఫైనల్స్ నుండి వైదొలగడంతో ఈ విజయం సాధ్యమైంది.



మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో

నంబర్ 1 స్థానాన్ని కోల్పోయిన కెప్టెన్ స్మృతి

అగ్రస్థానానికి దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా

దుబాయ్: జింబాబ్వేతో జరుగుతున్న సిరీస్‌లో స్మృతి మంధాన ప్రదర్శన అంతంతమాత్రంగానే ఉండటంతో, ఐసీసీ మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఆమె నెంబర్ 1 అగ్రస్థానాన్ని కోల్పోయింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్ ఆ స్థానాన్ని తిరిగి దక్కించుకుంది. మంగళవారం విడుదలైన ఈ ర్యాంకింగ్స్‌లో తొలి వన్డేలో 32 పరుగులు చేసి, రెండో మ్యాచ్‌లో డకౌట్ అవ్వడంతో శృ విలువైన ర్యాంకింగ్ పాయింట్లను కోల్పోయింది. తొలి రెండు మ్యాచ్‌లు గెలిచి భారత్ ఇప్పటికే వడోదరలో



జరుగుతున్న మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఇక తాజా ఐసీసీ ర్యాంకింగ్స్ అప్‌డేట్‌లో పలువురు భారత క్రీడాకారులు గణనీయమైన పురోగతి సాధించారు. భారత మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు ఎగబాకి ఎనిమిదో స్థానానికి చేరుకోగా, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ నాలుగు స్థానాలు ఎగబాకి 23వ స్థానానికి చేరుకుంది. రెండో వన్డేలో ఈ ఇద్దరు క్రీడాకారిణులు శతకాలు సాధించి, ర్యాంకింగ్స్‌లో తమ స్థానాలను మెరుగుపరుచుకున్నారు. దీప్తి ఇతర విభాగాలలో కూడా పురోగతి సాధించింది, వన్డే ఆల్‌రౌండర్లలో రెండు స్థానాలు ఎగబాకి నాలుగో స్థానానికి, వన్డే బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఒక స్థానం పైకి ఎగబాకి ఎనిమిదో స్థానానికి చేరుకుంది. భారత పేసర్ క్రాంతి గౌడ్ వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు ఎగబాకి 25వ స్థానానికి చేరుకోగా, యువ బ్యాటర్ ప్రతీకా రావల్ ఏడు స్థానాలు ఎగబాకి వన్డే బ్యాటర్లలో తన కెరీర్‌లోనే అత్యుత్తమమైన 21వ ర్యాంకును సాధించింది. జింబాబ్వేతో సిరీస్ ముగిసిన అనంతరం, తాజా టీ20ఐ ర్యాంకింగ్స్‌లో బ్యాటర్లలో షఫాలీ వర్మ ఒక స్థానం పైకి ఎగబాకి మూడో స్థానానికి చేరుకోగా, మంధాన ఒక స్థానం మెరుగుపడి నాలుగో ర్యాంకుకు చేరింది.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌కు

కొత్త సారథి అనుప్ బాగ్చి



ముంబయి, అక్టోబరు 27: దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్‌గా ఉన్న హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా అనుప్ బాగ్చి బాధ్యతలు స్వీకరించారు. పాలనాపరమైన సమస్యలు, పెట్టుబడిదారుల్లో తగ్గుతున్న విశ్వాసం, పడిపోతున్న మార్జిన్లు, కోర్ ఆదాయ వృద్ధిలో మందగమనం వంటి అనేక సవాళ్లు ఆయనకు స్వాగతం పలుకుతున్నాయి. 2023 జులైలో మాతృసంస్థ హెచ్‌డిఎఫ్‌సితో విలీనం జరిగినప్పటి నుంచి బ్యాంకు లాభాల్లో వృద్ధి దాదాపు నిలిచిపోయింది. ఒకప్పుడు వరుసగా 34 త్రైమాసికాల పాటు 30 శాతానికి పైగా నికర లాభ వృద్ధిని నమోదు చేసిన ఈ బ్యాంకు ప్రస్తుత పరిస్థితి గణనీయంగా మారింది. తొలి సిఇఒ ఆదిత్య పురి హయాంలో బ్యాంకు సాధించిన వృద్ధితో పోలిస్తే ఇప్పటి పరిస్థితి భిన్నంగా ఉంది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మూడు దశాబ్దాలకు పైగా సాగిన చరిత్రలో, సంస్థ వెలుపలి వ్యక్తి సిఇఒగా బాధ్యతలు చేపట్టడం ఇదే తొలిసారి. గతంలో ఐసిఐసిఐ బ్యాంకులో కీలక బాధ్యతలు నిర్వహించిన అనుప్ బాగ్చి, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో మూడేళ్లపాటు మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒగా పనిచేశారు. మంగళవారం బాగ్చి బాధ్యతలు స్వీకరించినట్లు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తెలిపింది. ఆయనకు ముందు ఈ పదవిలో ఉన్న శశిధర్ జగదీశన్ పదవీకాలం పూర్తవడంతో సోమవారం బాధ్యతల నుంచి తప్పుకున్నారని స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. బాగ్చి ముందున్న ప్రధాన సవాళ్లలో కోర్ ఆదాయ వృద్ధి తగ్గడం, మార్జిన్లపై ఒత్తిడి, పాలనాపరమైన అంశాలపై పెట్టుబడిదారుల్లో నెలకొన్న ఆందోళనలు ఉన్నాయి. అంతేకాకుండా విలీనం అనంతరం చేపట్టిన కార్యకలాపాల సమీకరణ ప్రక్రియ కూడా పూర్తిస్థాయిలో ముగియాల్సి ఉంది. ఈ విలీనం సాంకేతికంగా 2023 జులైలో పూర్తయినప్పటికీ, కొన్ని పనులు ఇంకా మిగిలి ఉన్నాయని బాగ్చి వెల్లడించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో బీఎస్ఈలో రూ.680 వద్ద ట్రేడయింది. గత ముగింపుతో పోలిస్తే ఇది 1.2 శాతం తగ్గింది. గత ఏడాది కాలంలో షేరు ధర 33 శాతం పడిపోయింది. బ్యాంకు 52 వారాల కనిష్ఠ స్థాయి రూ.681.90 కంటే దిగువన ట్రేడవుతుండగా, గరిష్ఠ స్థాయి రూ.1,017.50గా ఉంది. ఈ క్యాలెండర్ సంవత్సరంలో ఇప్పటివరకు షేరు 31 శాతం క్షీణించింది.

సెన్సెక్స్, నిఫ్టీలకు తప్పని హెచ్చుతగ్గులు

ఫార్మా, రియల్టీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు

ముంబయి, అక్టోబరు 27: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం తీవ్ర ఒడిదుడుకుల మధ్య దాదాపు ఫ్లాట్‌గా ముగిశాయి. నెలవారీ డెరివేటివ్స్ గడువు ముగిసే రోజు కావడం, అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన నిర్ణయంపై ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడం మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు మెరుగైన పనితీరు కనబరిచాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 8.08 పాయింట్లు తగ్గి 73,598.67 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 50 సూచీ 3.45 పాయింట్లు క్షీణించి 22,749.75 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సూచీని ప్రధానంగా ఎస్‌బిఐ, ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్లు కిందకు లాగాయి. ఎస్‌బిఐ షేరు 1.63 శాతం, ఐసిఐసిఐ బ్యాంక్ 1.15 శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 1.14 శాతం చొప్పున పడిపోయాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 సూచీ 1.01 శాతం పెరగగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 సూచీ 2.01 శాతం ఎగసింది. బిఎస్ఇలో మొత్తం 2,946 షేర్లు లాభపడగా, 1,370 షేర్లు నష్టపోయాయి. మరో 241 షేర్లలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధర పెరిగింది. డిసెంబరు 2026 సెటిల్‌మెంట్ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 45 సెంట్లు లేదా పెరిగి 116.26 డాలర్లకు చేరింది. భారత్ 10 యేళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ల ఈల్డ్ 0.07 శాతం పెరిగి 7.487కు చేరింది. గత ట్రేడింగ్ సెషన్‌లో ఇది 7.482 వద్ద ఉంది. విదేశీ మారక మార్కెట్లో రూపాయి స్వల్పంగా బలహీనపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ గత సెషన్ ముగింపు స్థాయి 95.1500 నుంచి 95.1950కు చేరింది. ఎంసిఎక్స్‌లో డిసెంబరు 4, 2026 సెటిల్‌మెంట్ బంగారం ఫ్యూచర్స్ 0.51 శాతం తగ్గి రూ.1,42,350 వద్ద ట్రేడయ్యాయి. అమెరికా 10 యేళ్ల బాండ్ల ఈల్డ్ 0.04 శాతం పెరిగి 4.984కు చేరింది. వ్యక్తిగత షేర్ల విషయానికి వస్తే, మారుతీ సుజుకీ ఇండియా షేరు 2.05 శాతం పెరిగింది. సిప్లా షేరు 0.37 శాతం తగ్గింది. మ్యాన్‌కైండ్ ఫార్మా షేరు 8.24 శాతం దూసుకెళ్లింది.వన్‌సోర్స్ స్పెషాలిటీ ఫార్మా షేరు 13.78 శాతం ఎగసింది. సోనా బీఎల్‌డబ్ల్యూ ప్రెసిషన్ ఫోర్జింగ్స్ షేరు 8.95 శాతం, వీఏ టెక్ వాబాగ్ షేరు 7.55 శాతం పెరిగాయి.

మారుతీ సుజుకీ రాబడులు రూ.53,355 కోట్లు



న్యూఢిల్లీ, అక్టోబరు 27: దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ ఇండియాకు రెండో త్రైమాసికంలో నిరాశాజనక ఫలితాలు నమోదయ్యాయి. గత యేడాది ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 26.4 శాతం తగ్గి రూ.2,466.1 కోట్లకు పరిమితమైంది. అయితే మొత్తం రాబడులు మాత్రం రూ.53,355 కోట్లకు పెరిగాయి. ముడిసరుకుల ధరలు పెరగడం, విదేశీ మారకపు విలువల్లో ప్రతికూల మార్పులు కారణంగా వ్యయాలు అధికమయ్యాయి. దీనికితోడు మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులపై నష్టాలు నమోదు కావడంతో పెట్టుబడుల ద్వారా వచ్చే ఆదాయం తగ్గింది. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ హిసాషి టేకూచి వీడియో సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు మూడుసార్లు ధరలు పెంచినట్లు తెలిపారు. అదే సమయంలో అన్ని రకాల ఖర్చులను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. మొదటి త్రైమాసికంతో పోలిస్తే రెండో త్రైమాసికంలో కొంతమేర పుంజుకున్నామని చెప్పారు. రానున్న ఆరు నెలల్లో తగిన సమయంలో మరోసారి ధరల పెంపు చేపట్టాలని యోచిస్తున్నట్లు వెల్లడించారు. దీనివల్ల కంపెనీ లాభదాయకత మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రెండో త్రైమాసికంలో మారుతీ సుజుకీ కార్యకలాపాల ద్వారా వచ్చిన సమిష్టి ఆదాయం వార్షిక ప్రాతిపదికన 26 శాతం పెరిగి సుమారు రూ.53,355 కోట్లకు చేరింది.

మొత్తం వ్యయాలు 29.7 శాతం పెరిగి దాదాపు రూ.50,619 కోట్లకు చేరాయి. ఆదాయ వృద్ధిని మించి ఖర్చులు పెరగడంతో అమ్మకాలు మెరుగుపడినప్పటికీ లాభాలపై ఒత్తిడి ఏర్పడించింది. కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సిఎఫ్ఒ) ఆర్నబ్ రాయ్ మాట్లాడుతూ త్రైమాసిక ప్రాతిపదికన నిర్వహణ పనితీరు మెరుగుపడిందని తెలిపారు. ఎబిట్డా మార్జిన్ మొదటి త్రైమాసికంలోని 8.6 శాతం నుంచి రెండో త్రైమాసికంలో 9.4 శాతానికి పెరిగిందని చెప్పారు ఒండో త్రైమాసి కంలో మారుతీ సుజుకీ మొత్తం 6,96,654 వాహనాలను విక్రయించింది. గత యేడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 26.5 శాతం అధికం. కంపెనీ మార్కెటింగ్, సేల్స్ విభాగం సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి పార్థో బెనర్జీ మాట్లాడుతూ అధిక ఇంధనధరల నేపథ్యంలో సిఎన్‌జి వాహనాలకు డిమాండ్ బలంగా ఉందని తెలిపారు.

డాలర్ వర్సెస్ రూపాయి 95.22కు తగ్గిన మారకం విలువ



ముంబయి, అక్టోబరు 27: అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ మంగళవారం ప్రారంభ ట్రేడింగ్‌లో మరో 7 పైసలు క్షీణించి 95.22కు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగడం, భౌగోళిక రాజకీయ అనిశ్చితి, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయానికి ముందు డాలర్ బలపడటం రూపాయిపై ఒత్తిడి పెంచాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) జోక్యం చేసుకునే అవకాశాల నేపథ్యంలో రూపాయి కొంత కోలుకున్నప్పటికీ, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, దేశీయ స్టాక్ మార్కెట్లలో బలహీనమైన సెంటిమెంట్ కారణంగా ఆ లాభాలను నిలబెట్టుకోలేక పోయిందని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. ఇంటర్‌బ్యాంక్ విదేశీ మారక మార్కెట్‌లో రూపాయి 95.17 వద్ద ప్రారంభమైంది. అనంతరం కొంత కోలుకుని 95.11 స్థాయిని తాకింది. ఆ తర్వాత మళ్లీ బలహీనపడి, గత ముగింపు ధరతో పోలిస్తే 7 పైసలు తగ్గి డాలర్‌కు 95.22 వద్ద ట్రేడయ్యింది. సోమవారం కూడా రూపాయి వరుసగా మూడో రోజు నష్టాలను నమోదు చేసింది. ఆ రోజు డాలర్‌తో పోలిస్తే 22 పైసలు క్షీణించి 95.15 వద్ద ముగిసింది. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో కలిపి రూపాయి విలువ 77 పైసలు పడిపోయింది. ఆరు ప్రధాన కరెన్సీలతో పోలిస్తే అమెరికా డాలర్ బలాన్ని సూచించే డాలర్ ఇండెక్స్ 0.06 శాతం పెరిగి 101.86 వద్ద ట్రేడయ్యింది. అంతర్జాతీయ చమురు ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధర 0.91 శాతం తగ్గినప్పటికీ, బ్యారెల్‌కు 114.76 డాలర్ల వద్ద కొనసాగింది. ఇది గత ఆరు నెలల గరిష్ఠ స్థాయికి సమీపంలో ఉండటం గమనార్హం. ఇదిలా ఉండగా, సోమవారం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) నికరంగా రూ.1,462.49 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీల గణాంకాలు వెల్లడించాయి. ముడి చమురు ధరలు, డాలర్ బలం, విదేశీ పెట్టుబడుల ప్రవాహాలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయం వంటి అంశాలు రూపాయి తదుపరి కదలికలను ప్రభావితం చేసే అవకాశముంది.

టాటా క్యాపిటల్ నికర లాభంలో 51% వృద్ధి

క్యూ2లో రూ.1,660 కోట్లు



ముంబయి, అక్టోబరు 27: టాటా క్యాపిటల్ రెండో త్రైమాసికంలో మంచి ఫలితాలను ప్రకటించింది. గత యేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,097 కోట్లుగా ఉన్న కన్సాలిడేటెడ్ నికర లాభం, ఈసారి 51 శాతం వృద్ధితో రూ.1,660 కోట్లకు చేరుకుంది. కంపెనీ నియంత్రణ సంస్థలకు సమర్పించిన నివేదిక ప్రకారం సమీక్షా త్రైమాసికంలో నికర మొత్తం ఆదాయం 24 శాతం పెరిగి రూ.4,676 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఈ ఆదాయం రూ.3,774 కోట్లుగా నమోదైంది. టాటా క్యాపిటల్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ రాజీవ్ సబర్వాల్ మాట్లాడుతూ కంపెనీ రుణాల పోర్ట్‌ఫోలియో రూ.3 లక్షల కోట్ల మైలురాయిని దాటిందని తెలిపారు. ఇది సంస్థ వ్యాపార విస్తృతి, వైవిధ్యత, స్థిరత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థ అయిన టాటా క్యాపిటల్ నిర్వహణలోని ఆస్తుల విలువ ఏడాది ప్రాతిపదికన 26 శాతం వృద్ధితో రూ.3,08,030 కోట్లకు చేరింది. రుణాల ఆస్తుల నాణ్యత స్థిరంగా కొనసాగిందని రాజీవ్ సబర్వాల్ తెలిపారు. రుణాల పోర్ట్‌ఫోలియో నాణ్యత, జాగ్రత్తతో కూడిన రుణ మంజూరు విధానం, సమర్థవంతమైన వసూళ్లపై సంస్థ నిరంతరం దృష్టి సారించడం వల్ల ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని వివరించారు. మరోవైపు, ప్రస్తుత మీడియంటర్మ్ నోట్ కార్యక్రమ పరిమితిని 2 బిలియన్ డాలర్ల నుంచి 3 బిలియన్ డాలర్లకు పెంచే ప్రతిపాదనకు టాటా క్యాపిటల్ బోర్డు ఆమోదం తెలిపింది. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా, ఈ కార్యక్రమం కింద ఒకటి లేదా అంతకంటే ఎక్కువ విడతల్లో విదేశీ కరెన్సీ బాండ్లు లేదా ఇతర రుణ సాధనాలను ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ రూపంలో జారీ చేయనున్నట్లు కంపెనీ మరో ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో వెల్లడించింది. టాటా క్యాపిటల్‌కు దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కలిపి 1,515 శాఖలు ఉన్నాయి. విస్తృతమైన శాఖల నెట్‌వర్క్ ద్వారా సంస్థ తన రుణ, ఆర్థిక సేవలను వినియోగదారులకు అందిస్తోంది.

టాటాగ్రూప్‌లో ముదిరిన కోల్డ్‌వార్

చంద్రశేఖరన్ నియామకంపై నోయెల్ టాటా అభ్యంతరం



ముంబయి,అక్టోబరు 27: టాటా గ్రూప్‌లో కీలక పదవి చుట్టూ వివాదం మరింత ముదిరింది. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ పునర్నియామకాన్ని టాటా ట్రస్ట్స్ఛైర్మన్ నోయెల్ టాటా మరోసారి సవాలు చేశారు. బోర్డు సమావేశంలో అనుసరించిన విధానంపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. టివిఎస్ మోటార్‌తో చంద్రశేఖరన్ కుటుంబానికి చెందిన సంస్థకు ఉన్న వ్యాపార సంబంధాల గురించి బోర్డుకు ముందే సమాచారం ఇచ్చారా అని నోయెల్ ప్రశ్నించారు. ఈ అంశాలపై వివరణ ఇవ్వడంతోపాటు కీలక పత్రాలను ఏడు రోజుల్లో అందించాలని కోరారు. ఈనెల 26న టాటా సన్స్ కంపెనీ కార్యదర్శి సుప్రకాశ్ ముఖోపాధ్యాయకు నోయెల్ ఎనిమిది పేజీల లేఖరాశారు. సెప్టెంబర్ 17న చంద్రశేఖరన్ పునర్నియామకానికి ఆమోదం తెలుపుతూ తీసుకున్న నిర్ణయం చెల్లదని అందులో పేర్కొన్నారు. సమావేశ ఎజెండాలో ఈ అంశాన్ని స్పష్టంగా చేర్చలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. అవసరమైన ఎంపిక కమిటీని ఏర్పాటు చేయలేదని, ఓటింగ్ ప్రక్రియలోనూ నిబంధనలు పాటించలేదని ఆరోపించారు. చంద్రశేఖరన్ భార్య లలిత, కుమారుడు ప్రణవ్ డైరెక్టర్లుగా ఉన్న హన్నో వన్ వేర్‌హౌసింగ్ సంస్థతో టీవీఎస్ మోటార్‌కు వ్యాపార సంబంధాలున్నట్లు వార్తలు వచ్చాయి. హోసూరు సమీపంలో 17.41 ఎకరాల భూమిని 29 యేళ్లకు లీజుకు తీసుకుని, సుమారు రూ.106 కోట్లతో భవన నిర్మాణం చేపడుతున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రూ.27 కోట్ల ముందస్తు చెల్లింపు జరిగినట్లు నివేదికలు పేర్కొన్నాయి. మైసూరు సమీపంలో రూ.330 కోట్ల పారిశ్రామిక పార్కు ప్రాజెక్టు అంశాన్నీ నోయెల్ తన లేఖలో ప్రస్తావించారు. టివిఎస్ మోటార్ గౌరవ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్ టాటా సన్స్ బోర్డులో డైరెక్టర్‌గా ఉన్నారు. చంద్రశేఖరన్ పునర్నియామకంపై చర్చల్లో పాల్గొని, ఆమోదంగా ఓటు వేశారని నోయెల్ పేర్కొన్నారు. సమావేశ రికార్డులు, ప్రయోజనాల వెల్లడికి సంబంధించిన పత్రాలను అందించాలని కోరారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.